
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 200

మంగళవారం 11-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



37 పరుగులకే పడగొట్టేశారు

మహిళల ఆసియా కప్‌లో థాయ్‌లాండ్‌పై ఆరు ఓవర్లలోనే గెలిచిన భారత్ - 12లో



అదానీ చేతికి జేపీ సిమెంట్!

రూ. 5,000 కోట్ల ఆఫర్.. తుది దశలో చర్చలు - 13లో



గుజరాత్‌పై అర్బన్ నక్సల్స్ కన్ను

అర్బన్ నక్సల్స్ కొత్త రూపంలో గుజరాత్‌లో అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని.. వారి ఆటలు సాగవని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో



కొలీజియంలో విభేదాలు!

జడ్జీల ఎంపికకు సీజేఐ జస్టిస్ యూయూ లలిత్ చేపట్టిన 'సర్కులేషన్'పై కొలీజియం లోని ఇద్దరు జడ్జీలు అభ్యంతరం చెప్పారు.

వివరాలు 6లో



తలాక్‌లపై కేంద్రానికి నోటీసులు

ఇస్లాంలోని విడాకులను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలన్న వ్యాజ్యంపై స్పందన తెలపాలని కేంద్రాన్ని సుప్రీం ఆదేశించింది.

వివరాలు 6లో



కీవ్‌పై రష్యా భీకర దాడులు

క్రిమియా వంతెనపై బాంబు పేలుడును ఉగ్ర చర్యగా పేర్కొన్న రష్యా.. ఉక్రెయిన్ వ్యాప్తంగా భీకర దాడులు చేసింది.

వివరాలు 6లో

పారిశ్రామిక సపోర్టు

బందరుతోపాటు భావనపాడు, రామాయపట్నం నోడ్స్ అభివృద్ధి

2023 చివరికల్లా అందుబాటులోకి రామాయపట్నం పోర్టు : సీఎం వైఎస్ జగన్

- ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులు వేగవంతం
- వెంటనే అనుమతులిచ్చేలా సీఎస్, సీఎంఓ అధికారులతో ప్రత్యేక విభాగం
- అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలకు చేయూత
- చురుగ్గా కార్పొరేషన్.. విదేశాల్లో ఉత్తమ విధానాలపై పరిశీలన
- దేశంలోనే వినూత్నంగా డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు
- గ్రామాల నుంచే వర్క్ ఫ్రమ్ హోం విధానం బలోపేతం
- సచివాలయాలు, ఆర్బీకేలు, స్కూళ్లు ఫైబర్‌తో అనుసంధానం
- డిసెంబర్ నాటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించేలా అడుగులు
- పరిశ్రమలు–మౌలిక వసతులపై సమీక్షలో సీఎం దిశా నిర్దేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పోర్టులను ఆసరాగా చేసుకుని పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఇందుకోసం అవసరమైతే ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీని నియమించాలని సూచించారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రాజెక్టులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. త్వరితగతిన అన్ని అనుమతులు మంజూరయ్యేలా సీఎస్, సీఎంవో అధికారులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలకు చేయూత అందించి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పరిశ్రమలు – మౌలిక వసతులపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు..

మిగతా 2వ పేజీలో ▶

జూన్‌కు నాలుగు ఫిషింగ్ హార్బర్లు

పోర్టు అనుబంధ పారిశ్రామికాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో ప్రస్తుతమున్న పారిశ్రామిక నోడ్స్‌తో పాటు కొత్తగా అభివృద్ధి చేయనున్న మచిలీపట్నం, దొనకొండ నోడ్‌లకు అదనంగా భావనపాడు, రామాయపట్నం నోడ్‌లను అభివృద్ధి చేయాలి. రామాయపట్నం పోర్టును ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం 2024 మార్చి నాటికి కాకుండా 2023 డిసెంబర్‌కు పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. మచిలీపట్నం, భావనపాడు పోర్టు పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. మొదటి విడతలో నిర్మిస్తున్న జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లను 2023 జూన్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. రెండో దశలో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండ్ సెంటర్లపైనా దృష్టి పెట్టాలి.

ములాయం ఇక లేరు

వృద్ధాప్య సమస్యలతో ఆస్పత్రిలో కన్నుమూత



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తదితరుల సంతాపం

ఆస్పత్రికి వెళ్లి నివాళులర్పించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా


నేడు స్వగ్రామం సైఫైలో అంత్యక్రియలు

10 సార్లు ఎమ్మెల్యే, ఏడుసార్లు ఎంపీగా ఘనత

6లో

బ్యాంకులపై పరిశోధనకు ముగ్గురికి ఆర్థిక నోబెల్

బెన్ బెర్నాంకీ, డగ్లస్ డబ్ల్యూ.డైమండ్, ఫిలిప్ హెచ్.డైబ్‌విగ్‌లకు పురస్కారం



బెన్ బెర్నాంకీ



డగ్లస్ డబ్ల్యూ. డైమండ్



ఫిలిప్ హెచ్.డైబ్‌విగ్

- అమెరికా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు కృషి చేసిన అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ మాజీ చైర్మన్ బెన్ బెర్నాంకీని ఆర్థికశాస్త్ర నోబెల్ వరించింది. ఆయనతో పాటు బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థలపై కీలక పరిశోధనలు చేసిన మరో ఇద్దరు అమెరికా ఆర్థికవేత్తలు డగ్లస్ డబ్ల్యూ.డైమండ్, ఫిలిప్ హెచ్.డైబ్‌విగ్‌లకు కూడా నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

స్పిన్నింగ్ పరిశ్రమపై మాంద్యం దెబ్బ



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించడంతో ఆ ప్రభావం స్పిన్నింగ్ మిల్లులపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.రఘురామిరెడ్డి తెలిపారు. టీడీపీ ప్రభుత్వం రూ.947 కోట్ల రాయితీలను బకాయి పెడితే.. కోవిడ్ కష్టాలను గమనించిన వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.380 కోట్ల బకాయిలను చెల్లించిందన్నారు. అయినా మిల్లులను నడపలేని పరిస్థితి ఉందన్నారు.

వివరాలు 2లో ▸

ఏపీలోని రైతు సంక్షేమ పథకాలు అద్భుతం



రైతుల సంక్షేమం కోసం ఏపీలో అమలు చేస్తున్న పథకాలు అద్భుతంగా ఉన్నాయని ఆస్ట్రేలియా వ్యవసాయ శాఖ మంత్రి అలన్నా మాక్ టైర్నన్ ప్రశంసించారు. ఏపీలో వ్యవసాయ పరిశోధనలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

వివరాలు 14లో ▸

శివసేన రెండు వర్గాలకు వేర్వేరు పేర్లు



మహారాష్ట్రలోని శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గాన్ని 'శివసేన–ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే'గా గుర్తించడంతో పాటు కాగడా గుర్తును కేటాయిస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని 'బాలాసాహెబంచి శివసేన'గా పేర్కొంది.

వివరాలు 6లో ▸

విద్యపై విషపు రాతలా?

- విద్యారంగం వెనుకబాటు అంటూ 'ఈనాడు' దుష్ప్రచారం
- ప్రభుత్వంపై విషం కక్కుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా కథనం
- ఈ రాతల వెనుక క్రిమినల్ ఆలోచనలు
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ధ్వజం





బుడితి రాజశేఖర్

సాక్షి, అమరావతి: 'వెనుక'బడి'నా గొప్పలే' అంటూ ఈనాడు దినపత్రిక సోమవారం వండివార్చిన కథనంలో అన్నీ అసత్యాలేనని, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలన్న దుర్బుద్ధితో తప్పుడు కథనాన్ని ప్రచురించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పాఠశాల విద్య) బి. రాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈ కథనాన్ని రాసిందని, ఇందులో దురుద్దేశమే కాకుండా నేరపూరిత ఆలోచనలు కూడా ఉన్నాయని వ్యాఖ్యానించారు. సచివాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనాడు రాసిన కథనంలోని ప్రతి అంశమూ అసత్యమేనని సవివరంగా స్పష్టంచేశారు. అంశాల వారీగా ఈనాడు తప్పుడు రాతలను రాజశేఖర్ ఎండగట్టారు. ఆయన ఏమన్నారంటే..

వరల్డ్ బ్యాంకు ప్రాజెక్టుపై ఈనాడుకు అవగాహనలేదు..

జాతీయ విద్యా విధానంలో 5+3+3+4 విధానాన్ని కేవలం కరిక్యులమ్ వరకు మాత్రమే అమలుచేయాలని చెప్పిందని.. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయాలని ఎక్కడా చెప్పలేదని, ప్రపంచ బ్యాంకు ఒత్తిడికి తలొగ్గి టీచర్ల సంఖ్యను తగ్గించేందుకు విలీనం చేస్తున్నారంటూ ఈనాడు రాసింది. వాస్తవం ఏమిటంటే.. వరల్డ్ బ్యాంకు సహకారంతో అమలవుతున్న ప్రాజెక్టు మీద ఈనాడుకు అవగాహనలేదు. దానిపేరు సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్). గత మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాల్లోని ప్రగతిని గమనించి ఆ ప్రభుత్వాలకు ఆర్థిక సహకారమిచ్చి మరింత ముందుకుపోయేలా ఈ ప్రాజెక్టు ద్వారా ప్రపంచ బ్యాంకు 250 మిలియన్ డాలర్లను అందిస్తోంది. గతంలో మాదిరిగా తాను ఎలాంటి జోక్యం చేసుకోకుండా కేవలం సాధించే ఫలితాల ఆధారంగా ఆర్థిక సహాయాన్ని అందించే కొత్త విధానాన్ని ప్రపంచ బ్యాంకు చేపట్టింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ప్రాజెక్టులు 139 మంజూరు చేయగా

మిగతా 2వ పేజీలో ▶

'సెట్' అడ్మిషన్లన్నీ ఈ నెలలోనే



- 17 నుంచి ఏపీ ఈఏపీ సెట్ రెండో విడత కౌన్సెలింగ్
- ఈ నెల 13 వరకు ఈసెట్, 25 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్
- పీజీ ఈసెట్ అడ్మిషన్లు 27 నుంచి ఆరంభం.. ఉన్నత విద్య కోర్సులకు ప్రవేశాలన్నీ ఆన్‌లైన్‌లోనే..
- డిగ్రీ కోర్సులన్నీ నాలుగేళ్లు.. ఇంటర్న్‌షిప్, అలాగే ఉచితంగా కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సులు
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి వెల్లడి


2లో



ఒకటే వానలు

- 10 రోజులు రాష్ట్రమంతా అనూహ్య వర్షాలు.. ఎన్నడూ లేనివిధంగా అన్ని జిల్లాల్లో నమోదు
- రాష్ట్ర సగటు కంటే 17.69 మిల్లీమీటర్ల అదనపు వర్షం
- ఈ నైరుతి సీజన్ మొత్తం సమృద్ధిగా వర్షాలు.. 8 జిల్లాల్లో 50 నుంచి 90 శాతం అధికం

3లో



..పార్టీని కొత్తగా మార్చలేకపోయినా కనీసం ఆయన మారుతున్నారంటే హ్యాపీనే సార్!!

క్లుప్తంగా

ములాయం మృతి పట్ల గవర్నర్ సంతాపం

సాక్షి, అమరావతి: సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయంసింగ్ యాదవ్ మృతి పట్ల గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ములాయంసింగ్ యాదవ్ సుదీర్ఘకాలం పాటు పార్లమెంట్ సభ్యునిగా వ్యవహరించారని.. రక్షణ మంత్రిగా దేశానికి, ముఖ్యమంత్రిగా ఉత్తరప్రదేశ్‌కు విశేష సేవలందించారని గవర్నర్ కొనియాడారు. ములాయం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

అణగారినవర్గాల అభివృద్ధికి ములాయం విశేష కృషి

ములాయం మృతి పట్ల సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'నేతాజీ'గా ప్రసిద్ధి చెందిన ఆయన జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని.. భారతదేశంలో సోషలిస్ట్ నాయకత్వానికి చిహ్నమన్నారు. అణగారిన వర్గాలు, మైనారిటీల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ములాయం కుటుంబసభ్యులకు, మద్దతుదారులకు సీఎం జగన్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సోమవారం ట్వీట్ చేశారు.

రేపటి నుంచి ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్

నూజివీడు: ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ విద్యాబోధనకు నిలయమైన ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కోసం ఈ నెల 12వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 12, 13 తేదీల్లో ఆయా క్యాంపస్‌లలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు 14, 15 తేదీల్లో ఇడుపులపాయలో, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ల కోసం 15, 16 తేదీల్లో ఎచ్చెర్ల క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థులకు ఇప్పటికే ట్రిపుల్ ఐటీ అధికారులు కాల్ లెటర్లతోపాటు వారి సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు కూడా పంపారు. కౌన్సెలింగ్‌కు ట్రిపుల్ ఐటీల్లో అన్ని ఏర్పాట్లు చేశారు.

సెర్ప్ సీఈవోగా ఇంతియాజ్

సాక్షి, అమరావతి: సీసీఎల్ఏ అడిషనల్ చీఫ్ కమిషనర్, కార్యదర్శి ఎండీ ఇంతియాజ్‌కు సెర్ప్ సీఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెర్ప్ సీఈవోగా తిరుపతి ఈఎంసీ సీఈవో ఎం.గౌతమిని నియమిస్తూ చేసిన బదిలీని నిలిపివేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 30న జీవో నంబర్ 2057 ద్వారా జరిగిన ఐఏఎస్ బదిలీల్లో సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలకు సన్నద్ధం కండి : కృష్ణబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.కృష్ణబాబు ఆదేశించారు. మంగళగిరిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని చెప్పారు. డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది అన్ని పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో ఉన్నారా లేదా అనేది తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలన్నారు. ఈ విధానం కోసం నియమించిన అధికారులు, సిబ్బంది విధుల్లో చేరారా లేదా పరిశీలించాలన్నారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సిబ్బంది నియామకంపై డీఎంహెచ్‌వోలకు ఇప్పటికే మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. కనీసం 3 నెలలకు సరిపడా మందులు, టెస్ట్ కిట్లు, వైద్య పరికరాలు సిద్ధం చేసుకోవాలని ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డిని ఆదేశించారు. కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సుల ఆధునికీకరణ

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో మరమ్మతులకు గురైన బస్సులు, లీకేజీ అవుతున్న బస్సులన్నీ 2023 మార్చిలోగా ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ, పీటీడీ కమిషనర్ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. ఇప్పటికే రూ.15 కోట్లతో 1,321 పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సులను ఆధునికీకరించామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో 1,064 సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను వచ్చే మార్చి నాటికి ఆధునికీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సాలూరు డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు రూఫ్ టాప్ లీకేజీ విషయం తమ దృష్టికి రాగానే బస్సును ఆపేసి బాగుచేయించామని, బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

'సెట్' అడ్మిషన్లన్నీ ఈ నెలలోనే



సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ ఈఏపీ సెట్–2022 రెండో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానుందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ప్రకటించారు. ఈనెల 25వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వివిధ కోర్సులకు సంబంధించిన అడ్మిషన్ల కౌన్సెలింగ్ తేదీలను ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సోమవారం ఆయన విడుదల చేశారు. ఈసెట్, ఐసెట్, పీజీఈ సెట్, జీప్యాట్, బీఆర్క్‌లకు సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ తేదీలను ఖరారు చేసినట్లు వివరించారు. అలాగే పీఈ సెట్, పీజీ సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లను త్వరలో చేపట్టనున్నట్టు చెప్పారు. ఆర్ సెట్ పరీక్ష నిర్వహణ తేదీలను కూడా ఖరారు చేశామన్నారు. ఏపీ ఈఏపీ సెట్‌కు సంబంధించి కేటగిరీ–బి (యాజమాన్య కోటా) సీట్లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి సెప్టెంబర్ 3నుంచి 15వరకు అవకాశం ఇచ్చామన్నారు. నాన్ ఎన్ఆర్ఐ కోటా సీట్లను సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభించామని, అక్టోబర్ 17వ తేదీతో ఈ అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. కొన్ని సెట్ల తొలివిడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ ముగియగా.. కొన్ని సెట్ల తొలివిడత ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వాటినీ పూర్తిచేసి రెండో విడత కౌన్సెలింగ్‌ను చేపట్టేందుకు వీలుగా షెడ్యూళ్లను ఖరారు చేశామని వివరించారు.

డిగ్రీ కోర్సుల సీట్ల కేటాయింపు

కాగా, రాష్ట్రంలోని ఉన్నత విద్యాకోర్సులన్నిటికీ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లోనే కల్పిస్తున్నామని హేమచంద్రారెడ్డి వివరించారు. జూలై 22న డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చామని, సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించామని చెప్పారు. ఈ నెల 14న డిగ్రీ అభ్యర్థులకు తొలివిడత సీట్ల కేటాయింపు చేస్తామని చెప్పారు. వారంతా 15వ తేదీన కాలేజీల్లో రిపోర్టు చేయాలని, అదే రోజు నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. డిగ్రీ కోర్సులన్నీ నాలుగేళ్ల హానర్ కోర్సులుగా చేశామని, డిగ్రీలో చేరిన విద్యార్థులు ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. మూడేళ్లకే ఎగ్జిట్ అయ్యే విద్యార్థులకు 10 నెలల ఇంటర్న్‌షిప్ ఉంటుందన్నారు. ఇప్పటికే డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. ఇంటర్న్‌షిప్‌తోపాటు అదనంగా మైక్రోసాఫ్ట్, సేల్స్ ఫోర్స్ వంటి వివిధ ఆధునిక కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సులను కూడా ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు, కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహమ్మద్, సెట్స్ ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

వివిధ సెట్ల అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్స్ ఇలా..

సెట్	మొదటి విడత	రెండో విడత
ఈఏపీ సెట్	ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 5 వరకు	అక్టోబర్ 17 నుంచి 25 వరకు
ఈసెట్	సెప్టెంబర్ 6 నుంచి 13 వరకు	అక్టోబర్ 10 నుంచి 13 వరకు
ఐసెట్	అక్టోబర్ 9 నుంచి 12వరకు	అక్టోబర్ 25 నుంచి 31 వరకు
పీజీఈసెట్	సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 11వరకు	అక్టోబర్ 27 నుంచి నవంబర్ 3 వరకు
జీప్యాట్	సెప్టెంబర్ 12 నుంచి 21వరకు	అక్టోబర్ 17 నుంచి 21 వరకు
పీఈసెట్	అక్టోబర్ 10 నుంచి 25 వరకు	--
పీజీసెట్	అక్టోబర్ 20 నుంచి	--
బీఆర్క్	సెప్టెంబర్ 3 నుంచి 12 వరకు	అక్టోబర్ 17 నుంచి 22 వరకు
ఆర్‌సెట్	అక్టోబర్ 17 నుంచి 19 వరకు (టెస్ట్ షెడ్యూల్)	--
ఏడీసెట్	(ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి)	

చౌళూరు హత్యకేసు దర్యాప్తు ముమ్మరం

- వరుణ్ అలియాస్ మంజుపై అనుమానాలు
- మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వీఆర్‌కు రూరల్ సీఐ, ఎస్ఐ

హిందూపురం: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి హత్యకేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఇప్పటికే నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు హంతకుల కోసం వేట సాగిస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటకలోను గాలిస్తున్నాయి. హత్య జరిగిన ప్రదేశంలో అనుమానమున్న వస్తువులు, వేలిముద్రలను క్లూస్ టీం సేకరించింది. తనిఖీల్లో వేటకొడవలి పిడి కూడా దొరికింది. సంఘటన జరిగిన వెంటనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చౌళూరు గ్రామానికే చెందిన నేరచరిత్ర కలిగిన వరుణ్ అలియాస్ మంజు పాత్ర ఉందేమోనన్న కోణంలోను దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రామకృష్ణారెడ్డి హత్య జరిగినప్పటి నుంచి వరుణ్ అజ్ఞాంలోకి వెళ్లిపోయాడు. రామకృష్ణారెడ్డి వ్యాపార, ఆర్థిక లావాదేవీలు, రాజకీయ విభేదాలు, ధాబా పునరుద్ధరణ విషయంలో తలెత్తిన సమస్యలు తదితర అంశాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇది సుపారీ హత్యనా అనే కోణంలోను దర్యాప్తు సాగిస్తున్నారు. ఇటీవల రామకృష్ణారెడ్డి రాజకీయంగానే కాకుండా బెంగళూరులో వ్యాపారపరంగాను కొంత బిజీగా ఉంటూ వచ్చారు. తన ధాబా వద్ద బార్ ఏర్పాటు చేసేందుకు పనులు చేపడుతున్నారు. ఈ విషయంలో ఆయనకు వరుణ్‌తో గొడవ జరిగిందని స్థానికులు చెబుతున్నారు. బార్ కూడా ప్రారంభిస్తే రామకృష్ణారెడ్డి ఆర్థికంగా మరింత బలంగా తయారవుతారన్న కక్షతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారా అనే విషయంపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. రామకృష్ణారెడ్డి కుటుంబసభ్యులు మాత్రం రాజకీయంగా వ్యతిరేకులే హత్యకు కారణమని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైతే స్పష్టమైన కారణాలేవీ తెలియడంలేదు. సమగ్ర దర్యాప్తు కొనసాగించి నిజాలు తేలుస్తామని పోలీసులు చెబుతున్నారు.

రూరల్ సీఐ, ఎస్ఐలపై శాఖాపరమైన చర్యలు

హిందూపురం అప్‌గ్రేడ్ రూరల్ పోలీసుస్టేషన్ సీఐ జి.టి.నాయుడు, ఎస్ఐ కరీంలను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఉత్తర్వులిచ్చారు. చౌళూరు రామకృష్ణారెడ్డి తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు తెలిపినా రక్షణ కల్పించలేదన్న కారణంతో వీరిపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. విచారణాధికారిగా టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన రూరల్ స్టేషన్ ఇన్‌చార్జ్‌గాను వ్యవహరిస్తారు.

స్పిన్నింగ్ పరిశ్రమపై మాంద్యం దెబ్బ

- ఆర్డర్లులేక మూతపడుతున్న పరిశ్రమలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటేనే మనుగడ
- నేటి నుంచి 15 రోజుల పాటు మిల్లులు మూసివేస్తున్నాం
- ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి



కొరిటిపాడు (గుంటూరు): కోవిడ్, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సంక్షోభాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించడంతో ఆ ప్రభావం స్పిన్నింగ్ మిల్లుల పరిశ్రమపై తీవ్రంగా ఉంది. కోవిడ్ విపత్తు తర్వాత ఆర్డర్లులేని పరిస్థితుల్లో ముడిసరుకు దూది ధరకంటే నూలు ధర తక్కువ కావడం, ఎగుమతులు క్షీణించడం.. స్వదేశీ మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడం వంటి వరుస పరిణామాలు పరిశ్రమను వెంటాడుతున్నాయి. గత ప్రభుత్వం స్పిన్నింగ్ మిల్లులకు రూ.947 కోట్లు రాయితీలను బకాయి పెడితే కోవిడ్ కష్టాలను గమనించిన ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడేళ్లలో రూ.380 కోట్ల బకాయిలను చెల్లించింది. ఈ రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా టెక్స్‌టైల్ పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుండంతో మిల్లులను పూర్తిస్థాయిలో నడపలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో.. మంగళవారం నుంచి 15 రోజుల పాటు స్పిన్నింగి మిల్లులను మూసివేయాలని నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి ప్రకటించారు.

50 శాతం ఉత్పత్తి నిలిపివేసినప్పటికీ..

రాష్ట్ర స్పిన్నింగ్, టెక్స్‌టైల్ పరిశ్రమల అసోసియేషన్ గత సమావేశంలో అప్పటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తిలో 50 శాతం నిలిపివేయాలని తీర్మానం చేసిందని, కానీ.. ఇప్పుడు పరిస్థితులు మరింత క్షీణించిన దృష్ట్యా మొత్తం అన్ని పరిశ్రమలు పూర్తిగా మూసివేసి, నష్టాలబారి నుంచి బయటపడాలని నిర్ణయించినట్లు రఘురామిరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థలను, ఎంసీఎక్స్‌ను కట్టడిచేసి, పత్తి ధరలు నిలకడగా ఉండేలా చూడాలని కోరారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం కరోనా వేళ గతేడాది సెప్టెంబర్‌లో రూ.237 కోట్లు విడుదలచేసి ఆదుకుందన్నారు. అదే విధంగా ప్రస్తుత విపత్కర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను విడుదల చేయాలని రఘురామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండున్నర లక్షల మంది ఆధారపడి జీవిస్తున్న ఈ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు.

పారిశ్రామిక సపోర్టు



పరిశ్రమలు - మౌలిక వసతులపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఇంటర్నెట్, ఎంఎస్ఎంఈలు, పారిశ్రామిక కారిడార్లపై దిశా నిర్దేశం చేశారు. ఆ వివరాలివీ..

ఎంఎస్ఎంఈలకు తోడ్పాటు

పరిశ్రమలు ప్రారంభం కావడమే కాకుండా అవి నిలదొక్కుకునేలా చర్యలు తీసుకోవాలి. పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలకు చేదోడుగా నిలవాలి. వీటివల్ల పెద్ద సంఖ్యలో ఉపాధి లభించి నిరుద్యోగం తగ్గుతుంది. అందుకే ఎంఎస్ఎంఈలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఎంఎస్ఎంఈలు నిలదొక్కుకునేలా నిరంతరం చేయూతనివ్వాలి. ఎంఎస్ఎంఈలపై మన ప్రభుత్వం దృష్టి పెట్టినట్లుగా మరే ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ క్రియాశీలకంగా వ్యవహరించాలి. విదేశాల్లో ఎంఎస్ఎంఈల రంగంలో ఉత్తమ విధానాలపై పరిశీలన చేసి ఇక్కడ అమలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఇతర దేశాల్లోని ప్రతిష్టాత్మక ఎంఎస్ఎంఈ పార్కులతో ఒప్పందాలు కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలి. ఏయే రంగాల్లో ఎంఎస్ఎంఈలు నడుస్తున్నాయి? వాటిని ఇక్కడకు రప్పించడం ద్వారా ఆదాయం, ఉద్యోగాల కల్పన ఎలా చేయవచ్చో ఆలోచన చేయాలి. ఎంఎస్ఎంఈ పార్కుల నిర్వహణ విధానాలను పరిశీలించడంతో పాటు కాలుష్య నివారణ, ఉత్పత్తుల తయారీలో అత్యాధునిక విధానాలు, ఉద్యోగాల కల్పన తదితర అంశాలు పరిశీలనలో భాగం కావాలి. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. మార్కెట్‌లో అవకాశాలున్న ఉత్పత్తులు ఎంఎస్ఎంఈల నుంచి వచ్చేలా తగిన తోడ్పాటు అందించాలి.

బల్క్‌డ్రగ్ పార్కుపై ఫార్మా కంపెనీల ఆసక్తి

రాష్ట్రానికి మంజూరైన కాకినాడ బల్క్‌డ్రగ్ పార్కులో కంపెనీల ఏర్పాటుకు ఇప్పటికే ప్రధాన ఫార్మా కంపెనీల నుంచి ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. పార్కు నిర్మాణ ప్రణాళికను సీఎం జగన్‌కు వివరించడంతోపాటు గత మూడేళ్లలో పారిశ్రామిక ప్రగతి వివరాలను అధికారులు తెలియచేశారు. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈల కోసం రెండు క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో పరిశ్రమలు, వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సీఎస్ సమీర్‌శర్మ, పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ఎస్.భరత్ గుప్తా, ఏపీ మారిటైం బోర్డు సీఈఓ షన్ మోహన్, ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ మధుసూదన్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, ఏపీటీపీసీ చైర్మన్ కె.రవిచంద్రారెడ్డి, ఏపీఎండీసీ చైర్ పర్సన్ షమీమ్ అస్లాం, ఏపీ ఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ సలహాదారు రాజీవ్ కృష్ణ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సలహాదారు లంక శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌కు పూర్తిస్థాయిలో ఇంటర్నెట్..

డిసెంబర్ నాటికి అన్ని గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, స్కూళ్లను ఫైబర్‌తో అనుసంధానించి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. 5జీ సేవలను గ్రామాలకు చేరవేసే విధంగా టెలికాం కంపెనీలతో ఏపీఎస్ఎఫ్ఎల్ పని చేయాలి. డిజిటల్ లైబ్రరీలు గ్రామాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. వైఎస్సార్ జిల్లా వేల్పులలో నెలకొల్పిన డిజిటల్ లైబ్రరీ ద్వారా సుమారు 30 మంది అక్కడ నుంచే ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో అన్ లిమిటెడ్ బ్యాండ్ విడ్త్‌తో ఇలాంటి లైబ్రరీలు వస్తే సొంతూరి నుంచే ఉద్యోగాలు చేసే పరిస్థితి వస్తుంది. అందుకే డిజిటల్ లైబ్రరీల ద్వారా వర్క్‌ఫ్రం హోం కాన్సెప్ట్‌ను బలోపేతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. దేశంలోనే ఇదొక వినూత్న వ్యవస్థ గా ఆదర్శంగా నిలుస్తుంది.

విద్యపై విషపు రాతలా?

▶ మొదటి పేజీ తరువాయి

అందులో ఏపీ ఒక్కటి. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సాధిస్తున్న పురోగతిని గమనించి ప్రపంచబ్యాంకు ఈ ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. ఇందులో ఎలాంటి షరతుల్లేవు. రాష్ట్ర విద్యారంగ చరిత్రలోనే ఇలాంటి ప్రాజెక్టు ఎక్కడా రాలేదు. అయితే, ఈనాడులో ప్రపంచ బ్యాంకు ఒత్తిడిచేసి విలీనం చేయిస్తోందని తప్పుడు వార్త రాసింది. ఎన్ఈపీలో విద్యార్థులకు అన్ని సదుపాయాలనూ అందుబాటులోకి తెచ్చేలా వనరులన్నిటినీ వినియోగించుకోవాలని, అందుకు అనుగుణంగా ఆయా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, ఆ దిశగా 5+3+3+4 విధానాన్ని అనుసరించాలని ఎన్ఈపీ 7.5 పేరాలో కేంద్రం స్పష్టంగా చెప్పింది. కానీ, దీనిపై అవగాహన లేకుండా ఈనాడు ప్రజలను తప్పుదోవ పట్టించింది.



చేరికల అంకెల్లోనూ అడ్డగోలు రాతలే

ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు తగ్గిపోయాయని తప్పుడు అంకెలతో కథనం రాశారు. అసలు చేరికల లెక్కలకు సంబంధించి కేంద్రం ప్రామాణికంగా నిర్దేశించిన యూడైస్ ప్లస్ గణాంకాలు ఇంకా ఖరారు కాలేదు. ఇష్టమొచ్చిన సంఖ్యలు రాశారు. ఈనెల 14, 15 తేదీల్లో కేంద్ర విద్యాశాఖ దక్షిణాది రాష్ట్రాలతో వర్కుషాపును నిర్వహించాక ఈ గణాంకాలు ఖరారవుతాయి. ఈ ఏడాది లెక్కలు ఇంకా ఖరారు కానందున ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో సీఎం ప్రసంగానికి గత ఏడాది గణాంకాలను అందించాం. యూడైస్ ప్లస్ ఏడాదికి ఒక్కసారే అప్‌డేట్ అవుతుంది. కానీ, రాష్ట్రంలో చైల్డ్ ఇన్ఫో పేరుతో రోజువారీ అప్‌డేషన్‌తో గణాంకాలు నిర్వహిస్తున్నాం. ఎక్కడినుంచో కొన్ని అంకెలను తీసుకుని ఈనాడు ప్రభుత్వంపై విషం చిమ్మింది. ఏ విద్యార్థీ బడిబయట ఉండరాదన్న ఉద్దేశంతో అమ్మఒడి సహ అనేక కార్యక్రమాలను ఎలాంటి తారతమ్యం లేకుండా ప్రభుత్వం చేస్తోంది. చరిత్రలో ఎవరూ పెట్టని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై దృష్టిపెట్టింది. ప్రతి పిల్లాడినీ బడిలో చేర్చేలా కసరత్తు చేశాం. రాష్ట్రం ఏర్పాటయ్యాక గణాంకాలు పరిశీలిస్తే.. 2014–15లో 72,32,771 చేరికలు కాగా 2015–16కు 69,07,004కు తగ్గింది. 2016–17లో 68,48,197, 2017–18లో 69,75,526, 2018–19లో 70,43,071లుగా చేరికలు ఉన్నాయి. ఇక 2019–20లో ఆ సంఖ్య 72,43,269లకు 2020–21లో 73,12,852కు పెరిగింది. 2021–22లో 72,45,640కు చేరింది. ఇక 2022–23లో సెప్టెంబర్ 30 వరకు 71,59,441లుగా చేరికలు ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే 86,199 తగ్గింది. ఈ తగ్గడం ఎందుకంటే ఇతర రాష్ట్రాలకు మైగ్రేషన్‌వల్ల 16,857, సీజనల్ మైగ్రేషన్‌వల్ల 38,951, మరణాలవల్ల 1,289 మంది చేరికలు తగ్గాయి. ఇక జనాభా తగ్గుదల వల్ల దేశవ్యాప్తంగా ఒకటో తరగతిలో చేరికలు తగ్గాయి. మన రాష్ట్రంలో కూడా ఆ విధంగా 29,102 మంది తగ్గారు. సీజనల్ మైగ్రేషన్ అయిన వారిని తిరిగి స్కూళ్లలో చేర్చేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే 12వేల మంది చేరారు.

ప్రైవేటు స్కూళ్లకు వెళ్లమనా ఈనాడు ఉద్దేశ్యం?

ఆంగ్ల మాధ్యమంలో ఒక్క వాక్యాన్నీ చదవలేకపోతున్నారని రాశారు. కానీ, అది అవాస్తవం. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో తెలుగు మీడియంలో 1,08,543 మంది హాజరైతే 43.97 శాతం పాసయ్యారు. ఇంగ్లీషు మీడియంలో 4,22,743 మంది రాస్తే 77.55 శాతం పాసయ్యారు. ఈ పరీక్షలను ఎలాంటి వాతావరణంలో నిర్వహించామో అందరికీ తెలుసు. మాస్‌కాపీయింగ్ చేసిన వారిని, దానికి సహకరించిన టీచర్లనూ సస్పెండ్ చేశాం. ఇంత పకడ్బందీ నిర్వహణలోనూ ఇంగ్లీషు మీడియం పిల్లలు పాస్ అత్యధికంగా ఉంది. ఏదీ రాయడం, చదవడం రాకుండానే ఇంతమంది పాసవుతారా? అన్నది అర్థం చేసుకోవాలి. ఇలాంటి తప్పుడు వార్తలతో ప్రజలను మిస్‌లీడ్ చేయడం వెనుక ఈనాడు ఉద్దేశమేమిటి? ప్రభుత్వ స్కూళ్ల నిర్వీర్యం అయ్యాయంటూ ప్రైవేటు స్కూళ్లకు వెళ్లమని పిల్లలకు చెబుతున్నారా? రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం.

చేరికలు ఐదు లక్షలకు పైగా పెరిగాయి

ప్రభుత్వ స్కూళ్లలో చేరికలు చూస్తే.. వాటిపై శ్రద్ధ గత ప్రభుత్వానికి, ఇప్పటికి ప్రభుత్వానికి మధ్యనున్న తేడా తెలుస్తుంది. ప్రభుత్వ స్కూళ్లలో 2014–15లో 41,83,441 మంది పిల్లలుండగా 2015–16లో 39,24,078కు, 2016–17లో 37,57,000లకు, 2017–18లో 37,29,000లకు, 2018–19లో 37,20,988లకు చేరింది. అదే 2019–20లో 38,18,348లకు పెరగ్గా 2020–21లో 43,42,874లకు చేరింది. అంటే ఏకంగా 5 లక్షల మేర చేరికలు అదనంగా పెరిగాయి. 21–22లో 44,29,569లు కాగా 2022–23లో అది 40,31,239లుగా ఉంది. కరోనావల్ల ఆర్థిక పరిస్థితులు దెబ్బతిని ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లలోకి చేరికలు పెరిగాయని పలు విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే, ఈ చేరికల్లో ఏపీ 14 శాతంతో అగ్రస్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాలు మనకన్నా తక్కువగా ఉన్నాయి. అసర్ నివేదిక కూడా ఇదే చెబుతోంది. జనాభా తగ్గుదలవల్ల కూడా చేరికలు తగ్గుతున్నట్లు ఎన్‌సీఈఆర్టీ నివేదిక చెబుతోంది. 2025 నాటికి 14 శాతం మేర తగ్గుతుందని నివేదించింది. ఇక 2019–20లో ప్రభుత్వ స్కూళ్లలో 38,18,348 మంది పిల్లలుండగా ప్రైవేటులో 32,28,681 మంది ఉన్నారు. అదే ప్రస్తుత విద్యాసంవత్సరంతో పోలిస్తే ప్రభుత్వ స్కూళ్లలో 40,31,239 మంది పిల్లలున్నారు. అంటే రెండు లక్షల మంది అదనంగా పెరిగారు. అదే ప్రైవేటు స్కూళ్లలో 2019–20తో పోలిస్తే 2,12,407 చేరికలు తగ్గాయి. ప్రభుత్వ స్కూళ్లలో చేరికలు తగ్గాయని ప్రైవేటులోకి వెళ్లిపోతున్నారని ఈనాడు పచ్చి అబద్ధాలు రాసింది. కరోనా పరిస్థితులు తగ్గి ఆర్థిక స్థితి కొంత పెరిగి తిరిగి ప్రైవేటులోకి వెళ్లిపోతున్నారని అనుకున్నా అందరూ ప్రభుత్వ స్కూళ్ల నుంచి వెళ్లడంలేదని ఈ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఆంగ్ల మాధ్యమంతో పాటు పథకాలు, ఇతర కార్యక్రమాలవల్ల తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగింది. ఐఏఎస్ అధికారులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేరుస్తున్నారంటే రాష్ట్రంలో విద్యారంగంలో ప్రమాణాలు ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నాయో స్పష్టమవుతోంది. ఇక బెండపూడి స్కూలులో ప్రసాద్ అనే టీచర్ చేసిన ప్రయత్నంవల్ల విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతున్నారు. దీన్ని రాష్ట్రంలోని ఇతర స్కూళ్లలోనూ అమలుచేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇంత మంచిగా కార్యక్రమాలు జరుగుతూ విద్యారంగం అభివృద్ధి సాధిస్తుంటే వెనుకబడిపోయిందని ఈనాడు తప్పుడు రాతలు రాయడం సరికాదు. తప్పుడు లెక్కలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం వెనుక ఈనాడుకు నేరపూరిత ఉద్దేశాలున్నాయి.

15న విశాఖ గర్జన

- జేఏసీ ప్రజాగర్జనకు మా పార్టీ మద్దతిస్తోంది: మంత్రి బొత్స
- డాబా గార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం - బీచ్ రోడ్డు వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ
- వికేంద్రీకరణకు మద్దతుగా ఉత్తరాంధ్రలో ర్యాలీలు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా 15న నిర్వహించనున్న విశాఖ గర్జనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మూడు రాజధానులను సీఎం జగన్ ప్రకటించారని చెప్పారు. ఉత్తరాంధ్ర జేఏసీ పిలుపు మేరకు గర్జనకు వైఎస్సార్‌సీపీ మద్దతు పలుకుతోందన్నారు. విశాఖ దాబా గార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బీచ్ రోడ్డు వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి మద్దతుగా ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో ర్యాలీలు జరుగుతాయన్నారు. సోమవారం విశాఖ మద్దిలపాలెంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించాలని చంద్రబాబు, ఉత్తరాంధ్ర టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లతో గెలిచిన టీడీపీ నేత అచ్చెన్నాయుడు సొంత ప్రాంతం అభివృద్ధి చెందకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. 'మీ వ్యాపారాలకు, నివాసానికి, పిల్లల చదువుల కోసం విశాఖ కావాలా? ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచి ఈ ప్రాంతం మాత్రం అభివృద్ధి చెందకూడదా?' అని నిలదీశారు.

- ➡ టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడిపోతామనే భయం ఆ పార్టీ నాయకుల్లో కనబడుతోంది.
- ➡ 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు విశాఖలో చేసిన అభివృద్ధి శూన్యం. వెనకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్ర, విశాఖను అభివృద్ధి చేసింది దివంగత వైఎస్సార్ ఒక్కరే. విశాఖలో హెల్త్‌సిటీ, ఐటీ పార్క్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, బీఆర్‌టీఎస్, విమ్స్, బీహెచ్ఈఎల్, ఫార్మా పరిశ్రమలను తెచ్చి ముందుచూపుతో నేటి యువతరానికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

గిరిజన పిల్లలకు మెరుగైన విద్య

- మంచి ఫలితాలు ఇస్తున్న ప్రభుత్వ చర్యలు
- గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి వెల్లడి
- గిరిజన సంక్షేమ అధికారులకు మూడు రోజుల శిక్షణ ప్రారంభం

సాక్షి, అమరావతి: గిరిజన పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్(అడ్మిన్) బి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (బాపట్ల) కేంద్రంలో గిరిజన సంక్షేమ అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు 'గిరిజన సంక్షేమ శాఖ అధికారుల పాత్ర–బాధ్యతలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థల నిర్వహణ' అనే అంశాలపై మల్లిఖార్జునరెడ్డి బోధించారు. రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, ఏకలవ్య పాఠశాలలు, గిరిజన పాఠశాలల ద్వారా విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత చదువుల వరకు గిరిజన పిల్లలు రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తోందని వివరించారు. ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలు, సమస్యలు పరిష్కరించడంలో బహుముఖ పాత్ర పోషిస్తున్నారు. అనంతరం 'గిరిజన ప్రాంతాల్లోని చారిత్రక నేపథ్యం–దాని పరిరక్షణ' అనే అంశంపై డాక్టర్ వీఎస్‌వీకే శాస్త్రి, గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్న పథకాలపై జి.చంద్రిక ప్రసంగించారు.

ఒకటే వానలు



అనంతపురం జిల్లాలోని చాగల్లు వద్ద ప్రవహిస్తున్న పెన్నానది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత 10 రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ సీజన్‌లో వర్షాలు మామూలే అయినా అన్ని ప్రాంతాల్లోను పడుతుండడం ప్రత్యేకంగా చెబుతున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉన్నా గతంలో అది కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యేది. కానీ ఈసారి అన్ని జిల్లాల్లోను భారీ వర్షాలు కురుస్తున్నాయి.

బాపట్ల జిల్లాలో 90.4 శాతం అధికం

ఈ నెల ఒకటో తేదీ నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 17.69 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ 10 రోజుల్లో 82.3 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ 99.99 మిల్లీమీటర్ల వర్షం పడింది. 8 జిల్లాల్లో 50 నుంచి 90 శాతం అధిక వర్షం కురిసింది. బాపట్ల జిల్లాలో 90.4 శాతం అధిక వర్షం పడింది. అక్కడ 84.9 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 161.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శ్రీకాకుళం జిల్లాలో 70 శాతం, విజయనగరం జిల్లాలో 62.2 శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 61.2, ఏలూరు జిల్లాలో 66.4, కృష్ణాలో 51, గుంటూరు జిల్లాలో 64.5, పల్నాడు జిల్లాలో 50.4 శాతం అధిక వర్షం కురిసింది. ఒక్క నెల్లూరు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోను పడాల్సిన దానికంటే ఎక్కువ వర్షం పడింది.

కృష్ణా, గోదావరి, పెన్నా బేసిన్లలో రిజర్వాయర్లు కళకళ

భారీ వర్షాలతో గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్లలో రిజర్వాయర్లలోకి బాగా నీరు చేరి కళకళలాడుతున్నాయి. గోదావరి బేసిన్‌లో లక్ష్మి, సమ్మక్క బ్యారేజీల నుంచి దిగువకు భారీగా నీటిని వదులుతున్నారు. కృష్ణా బేసిన్‌లో తుంగభద్ర, సుంకేశుల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు, ప్రకాశం బ్యారేజీ నిండిపోవడంతో 10 రోజులుగా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. పెన్నా బేసిన్‌లో గండికోట, మైలవరం, సోమశిల రిజర్వాయర్లు కూడా నిండిపోవడంతో నీటిని కిందకు వదులుతున్నారు. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్లన్నీ జలకళతో తొణికిసలాడుతున్నాయి.

నైరుతి మురిసింది..

ఈ నైరుతి సీజన్‌లో రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు కురిశాయి. జూన్ ఒకటి నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు 657 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 683.1 మిల్లీమీటర్లు నమోదైంది. శ్రీ సత్యసాయి జిల్లాలో 41.3 శాతం అధిక వర్షం కురిసింది. అనంతపురం జిల్లాలో 36.6, బాపట్ల జిల్లాలో 30.6 మిల్లీమీటర్ల అధిక వర్షం పడింది. మిగిలిన అన్ని జిల్లాల్లోను సాధారణ వర్షపాతం నమోదైంది.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపు



రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ నూతన కార్యవర్గంతో గవర్నర్ విశ్వభూషణ్

సాక్షి, అమరావతి: పర్యావరణ పరిరక్షణ కోసం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ నూతన కార్యవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. మితిమీరిన ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో రక్తం అందుబాటులో లేక ఏ ఒక్కరూ ప్రాణం కోల్పోకూడదన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గవర్నర్ దంపతులు విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ రాజ్‌భవన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం

రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీడాతో పాటు పి.జగన్‌మోహన్‌రావు(శ్రీకాకుళం), ఎం.శ్రీరాములు(మన్యం), కేఆర్‌డీ ప్రసాదరావు(విజయనగరం), డాక్టర్ శివనాగేంద్ర(విశాఖపట్నం), ఎస్వీ సాయికుమార్(అనకాపల్లి), జె.మహేష్‌బాబు(కాకినాడ), వై.మధుసూదనరెడ్డి(రాజమండ్రి), కె సత్యన్నారాయణ(కోనసీమ), బీవీ కృష్ణారెడ్డి(ఏలూరు), ఎంఎస్ వీఎస్ భద్రిరాజు(భీమవరం), కె.రమేశ్(కృష్ణా), పి.రామచంద్రరాజు(గుంటూరు), డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి(బాపట్ల), డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి(పల్నాడు), డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి(ప్రకాశం),డి.రవిప్రకాష్(నెల్లూరు), పి.దస్తగిరి(నంద్యాల), వి.రమేష్‌బాబు(చిత్తూరు), డాక్టర్ వి.ప్రసాద్(తిరుపతి) ప్రమాణ స్వీకారం చేశారు.

శ్రీశైలానికి 1,07,853 క్యూసెక్కుల వరద

నాగార్జునసాగర్ 12 గేట్ల నుంచి నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్/మాచర్ల/సత్రశాల(రెంటచింతల): కొద్ది రోజులుగా కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం సమయానికి జూరాల, సుంకేసుల నుంచి 1,07,853 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మూడు క్రస్ట్‌గేట్లను పదడుగులు ఎత్తి 83,811 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పాదన అనంతరం 66,199 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 2,750 క్యూసెక్కులు, హంద్రీ–నీవా సుజల స్రవంతికి 338 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 884.70 అడుగుల మట్టంలో 213.8824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం నుంచి, స్థానికంగా ఉన్న ఉప నదుల ఉంచి నాగార్జునసాగర్ జలాశయానికి 1,46,318 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. సాగర్ 12 గేట్లను ఐదడుగులు ఎత్తి 96,696, విద్యుదుత్పాదన అనంతరం 32967.. కలిపి మొత్తం 1,29,663 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, వరద కాలువ, ఎస్‌ఎల్‌బీసీలకు మొత్తం 16,665 క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్ జలాశయంలో 589.60 అడుగుల మట్టంలో 310.8498 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తి 1,14,029, రెండు యూనిట్లలో విద్యుదుత్పాదన అనంతరం 7,206.. కలిపి మొత్తం 1,21,235 క్యూసెక్కుల నీటిని పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

గుళ్లలోని క్షురకులకు రూ.20 వేల కనీస ఆదాయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- టికెట్ల ద్వారా నెలకు రూ.20 వేల కన్నా తక్కువ వస్తే.. మిగిలిన మొత్తం అందేలా చర్యలు
- ఎక్కువ వస్తే వారికే చెందుతుందని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ప్రధాన ఆలయాల్లోని కేశఖండనశాలల్లో క్షురకులుగా పనిచేసే వారికి ప్రతి నెలా కనీసం రూ.20 వేలు ఆదాయం వచ్చేలా చర్యలు చేపడుతున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ధార్మిక పరిషత్ తొలి సమావేశం సోమవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగింది. అనంతరం సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ప్రధాన ఆలయాల్లోని క్షురకులు ప్రస్తుతం టికెట్ల ఆధారంగా ప్రతి నెలా ఆదాయం పొందుతున్నారని చెప్పారు. వాళ్లకు నెలకు రూ.20 వేల కంటే తక్కువ ఆదాయం దక్కే సమయంలో.. ఆయా ఆలయాల్లోని వెల్ఫేర్ ట్రస్టు ద్వారా మిగిలిన మొత్తాన్ని ఇప్పించాలని సీఎం వైఎస్ జగన్ తమకు సూచించారని పేర్కొన్నారు. రూ.20 వేల కంటే ఎక్కువ ఆదాయం వస్తే.. వారికే ఆ మొత్తం చెందుతుందన్నారు. తక్కువ వచ్చినప్పుడు మాత్రమే ఆ మొత్తాన్ని అదనంగా అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. సమావేశంలో హథీరాంజీ, బ్రహ్మంగారి మఠం,అహోబిలం, గాలి గోపురం, బ్రహ్మానంద మఠాలకు సంబంధించిన పాలనపరమైన అంశాలపైనా చర్చించినట్టు చెప్పారు. బెజవాడ దుర్గ గుడిలో అంతరాలయ దర్శన టికెట్ ధర ఎప్పటి నుంచో రూ.500గానే ఉందన్నారు.

ఏడు జిల్లాలకు డీఎంహెచ్‌వోల నియామకం

సాక్షి, అమరావతి: ఏడు జిల్లాలకు డీఎంహెచ్‌వోలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఏఎస్‌ఆర్ జిల్లా డీఎంహెచ్‌వోగా డాక్టర్ జమాల్ పాషా, తూర్పుగోదావరి డీఎంహెచ్‌వోగా డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, పశ్చిమగోదావరికి డాక్టర్ డి.మహేశ్వరరావును నియమించారు. బాపట్ల జిల్లాకు డాక్టర్ జయమ్మ, చిత్తూరుకు డాక్టర్ వై.వెంకటేశ్వరరావు, సత్యసాయి జిల్లాకు డాక్టర్ కృష్ణారెడ్డి, కాకినాడకు డాక్టర్ శాంతిప్రభను నియమించారు.

'విజిలెన్స్ విచారణలు నిలిపివేయాలి'

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతోన్న గ్రామ సచివాలయ, ఆర్బీకే, హెల్త్ కేంద్రాల నిర్మాణ పనుల్లో నాణ్యతల పేరుతో ఇంజనీర్లపై చర్యలు తీసుకోవద్దని ఏపీ పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్స్ జేఏసీ కోరింది. పనుల్లో నాణ్యతపై విజిలెన్స్ విచారణలు ఆపాలని ఇంజనీర్స్ జేఏసీ చైర్మన్ మురళీ కృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి కె.రవీంద్ర విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఈ నెల 13 నుంచి ఆందోళన చేపడతామన్నారు. 13–15 తేదీల మధ్య నల్ల బ్యాడ్జీలతో విధులు, 17 నుంచి ఈఎన్‌సీ కార్యాలయం, జిల్లాల్లో సీఈ, డీఈ ఆఫీసుల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన, 20న ఈఎన్‌సీ కార్యాలయంలో ధర్నా, 24 నుంచి పూర్తి స్థాయిలో సహాయ నిరాకరణ చేస్తామన్నారు.

'దసపల్లా' భూములపై త్వరలో సరైన నిర్ణయం

- విశాఖ జిల్లా కలెక్టర్ స్పష్టీకరణ
- ఆ భూముల అంశాలపై త్వరలో అధికారులతో భేటీ

సాక్షి, విశాఖపట్నం: దసపల్లా భూముల వ్యవహారంపై త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. సోమవారం తన చాంబర్లో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం దసపల్లా ఫైల్ పరిశీలనలో ఉందని, త్వరలోనే దీనికి సంబంధించి యూఎల్‌సీ, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం కానున్నట్లు వివరించారు. ఎన్నో ఏళ్లుగా భూముల వ్యవహారంలో వివాదం నడుస్తోందని, దీనిపై గతంలో పనిచేసిన కలెక్టర్లు ప్రభుత్వానికి లేఖలు రాశారని గుర్తు చేశారు. ఆ లేఖలు, సుప్రీం కోర్టు ఆదేశాలని అనుసరించి 2015–18 మధ్య కాలంలోనే ప్రభుత్వం మార్గదర్శకాల్ని విడుదల చేసిందన్నారు. ఆ సమయంలో అడ్వొకేట్ జనరల్ చేసిన సూచనలే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. వీటన్నింటినీ క్రోడీకరించి, ఫైల్‌ని సమగ్రంగా అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం దసపల్లా భూములు 22ఏ రిజిస్టర్‌లోనే ఉన్నాయని వెల్లడించారు. అయితే.. దసపల్లా భూముల్లో గతంలో నిర్మించిన వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల్ని తొలగించేస్తారంటూ వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఆ ప్రభుత్వ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని కలెక్టర్ డా. మల్లికార్జున తెలిపారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య
- ఏపీ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోర్ల మహీధర్ నియామకం

సాక్షి, అమరావతి: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే.. బీసీలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏపీ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోర్ల మహీధర్ నియమితులవ్వగా.. ఆర్.కృష్ణయ్య ధ్రువపత్రాన్ని అందించారు. ఈ విషయాన్ని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి రావడానికి బీసీలు ముఖ్య కారణమన్నారు. కానీ, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టే విషయంలో బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీజేపీ బాధ్యత తీసుకుని బిల్లు పెట్టకపోతే.. ఆ పార్టీని బీసీలంతా బహిష్కరిస్తారని హెచ్చరించారు.



సత్యం అనేది ఎప్పుడూ వికారంగా ఉండదు.
దాన్ని వికారంగానో, చేదుగానో చేసేది మన మనసులే!
- చలం

సాక్షి
మంగళవారం, అక్టోబర్, 11

గుర్తింపు పోరాటం!

మహారాష్ట్ర రాజకీయం మరో అంకానికి చేరింది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వర్గాలలో ఎవరిది అసలైన శివసేన పార్టీ అనే పంచాయతీలో ఎన్నికల సంఘం (ఈసీ) ప్రస్తుతానికి ఇద్దరినీ సమదూరం పెట్టేసింది. బాలాసాహెబ్ ఠాక్రే పెట్టిన అసలు శివసేన పార్టీ పేరు, విల్లంబుల చిహ్నం ఇరువర్గాలూ వాడకుండా స్తంభింపజేస్తూ, మధ్యంతర నిర్ణయం తీసుకుంది. మూడు ప్రత్యామ్నాయాలతో కొత్త పేరు, కొత్త ఎన్నికల గుర్తు ప్రతిపాదనల్ని సోమవారాని కల్లా పంపాల్సిందని నిర్దేశించింది. రెండుగా చీలిన శివసేన ఇప్పుడు ప్రత్యామ్నాయమైన పేర్లు, ఎన్నికల గుర్తుల కసరత్తుతో గుర్తింపు సమస్యలో పడింది. నవంబర్ 3న అంధేరీ (ఈస్ట్) అసెంబ్లీ ఉప ఎన్నిక, ఆపై రానున్న ముంబయ్ కార్పొరేషన్ ఎన్నికలతో ఇది కీలకంగా మారింది. ఉప ఎన్నికలో కమలం గుర్తుపై సొంత అభ్యర్థిని నిలబెట్టి, శిందే వర్గాన్ని అక్కున చేర్చుకున్న బీజేపీకి ఇది కలిసొచ్చే అంశం.

ఉప ఎన్నిక దగ్గరవుతున్నందున మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతున్న తమకే పార్టీ విల్లంబుల గుర్తు ఇవ్వాలంటూ శివసేన తిరుగుబాటు వర్గానికి సారథ్యం వహిస్తున్న శిందే అక్టోబర్ 4న ఈసీని అభ్యర్థించారు. అయితే, ఎమ్మెల్యేలు గోడ దాటినా, కార్యకర్తల్లో అధిక సంఖ్యాకులు తన వైపే ఉన్నారన్నది ఉద్ధవ్ వాదన. వీటి ఫలితమే - ఈ తాత్కాలిక ఆదేశం. ఎన్నికల్లో గందరగోళం నివారించడానికే ఈ నిర్ణయమని ఈసీ తేల్చేసింది. నిజానికి కాంగ్రెస్, శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీలను అక్కునచేర్చుకొని, అసలైన శివసేన సిద్ధాంతాలకు ఉద్ధవ్ తిలోదకాలిస్తున్నారని శిందే వాదన. ఆ ఆరోపణలు చేస్తూనే మొన్న జూన్‌లో ఆయన తన వర్గంతో బయటకొచ్చి, పార్టీని నిలువునా చీల్చారు. బాలాసాహెబ్ అసలైన సేన తమదేనని వాదిస్తున్నారు. అయితే, శివసేన సంస్థాపకుడి వారసుడిగా పార్టీని నడుపుతున్న ఉద్ధవ్‌ను శివసేన గుర్తుకు దూరం చేస్తూ ఈసీ ఇచ్చిన ఆదేశం ప్రజాస్వామ్యాన్ని స్తంభింపజేయడమేనని కపిల్ సిబల్ తదితరుల విమర్శ. బీజేపీతో అంట కాగుతున్న శిందే వర్గానికి అప్పనంగా అన్నీ అప్పజెప్పడానికే ఈ ప్రయత్నమని వారి ఆరోపణ.

నిజానికి, ఒకే పార్టీకి చెందిన ప్రత్యర్థి వర్గాలు గనక పార్టీ పేరు, జెండా, గుర్తులపై అధికారంపై జగడానికి దిగితే, 'ఎన్నికల చిహ్నాల (కేటాయింపు) ఆదేశం-1968', సెక్షన్ 15 ప్రకారం నిర్ణయాధికారం ఈసీదే. అసలు శివసేన ఎవరిదనే విషయంలో ఈసీ నిర్ణయం తీసుకోవడం సుదీర్ఘ ప్రకియ. అందుకు నెలలు పడుతుంది. ఇటీవలే సుప్రీమ్ కోర్ట్ సైతం ఉద్ధవ్ వర్గం వేసిన పిటిషన్‌పై రూలింగ్ ఇస్తూ, 'అసలైన శివసేన' ఎవరిది లాంటి అంశాలు నిర్ణయించే అధికారం ఈసీదేనని స్పష్టం చేసింది. శిందే వర్గంలోకి వెళ్ళిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై మాత్రం విచారణ జరుపుతోంది. ఈ పరిస్థితుల్లో ఈసీ నిర్ణయం 'అన్యాయ'మని అభివర్ణిస్తున్న ఉద్ధవ్ చేసేదేమీ లేక ప్రస్తుతానికి వేరే గుర్తులు ప్రతిపాదిస్తూ, తమను 'బాలాసాహెబ్ ఠాక్రే శివసేన'గా గుర్తించాలని కోరారు.

విజయదశమికి ఉద్ధవ్, శిందే వర్గాలు పోటాపోటీ ర్యాలీలు జరిపి, బలప్రదర్శనకు దిగాయి. అసలు బలం వచ్చే వివిధ ఎన్నికల్లో తేలనుంది. మహారాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనుంది. రాష్ట్రంలో రెక్కలు చాస్తున్న బీజేపీ, ఉద్ధవ్‌పై పాత పగ తీర్చుకోవడానికి సిద్ధమవుతోంది. కన్ను మూసిన తమ ఎమ్మెల్యే స్థానంలో ఆయన భార్యను నిలబెట్టిన ఉద్ధవ్ సేన అసెంబ్లీలో కాకున్నా ప్రజల్లో బలం తమదేనని నిరూపించుకోవాల్సిన పరిస్థితిలో పడింది. అసలే ఎమ్మెల్యేలు చేయిదాటి పోయి, కార్యకర్తలపై పట్టుపోతున్న వేళలో ఈ ఎన్నికలు, అందులోనూ అలవాటైన ఎన్నికల గుర్తు లేకపోవడం ఉద్ధవ్‌కు ఇరకాటమే. కొత్త గుర్తు, పేరు జనంలోకి తీసుకెళ్ళడం ఇప్పటికిప్పుడు తేలికేమీ కాదు. కాకపోతే, ఈసీ నిర్ణయంపై ఉద్ధవ్ వర్గం సోమవారం ఢిల్లీ హైకోర్ట్‌ను ఆశ్రయించింది. రేపు కథ సుప్రీమ్ దాకా వెళ్ళవచ్చు. అప్పుడు విల్లంబుల గుర్తు శాశ్వత స్తంభనకు గురికావచ్చు.

గతంలో 1969లో సీనియర్లతో ఇందిరా గాంధీకి తీవ్ర విభేదాలు వచ్చినప్పుడు కాంగ్రెస్ అసలు గుర్తు కాడి - జోడెద్దులు గుర్తు శాశ్వత స్తంభనకు గురైంది. ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ (ఆర్)కు ఆవు - దూడ గుర్తు, కాంగ్రెస్ (ఒ)కు చరఖాపై నూలు వడుకుతున్న స్త్రీ గుర్తు ఇవ్వడం ఓ చరిత్ర. అప్పట్లో ఇందిరా గాంధీ కొత్త ఎన్నికల గుర్తు ఆవు - దూడపైనే పోటీ చేసి, 'గరీబీ హఠావో' నినాదంతో 1971 లోక్‌సభ ఎన్నికల్లో, 1972 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ రెండోసారి చీలినప్పుడు ఇందిర వర్గానికి హస్తం గుర్తు దక్కింది. 1960లలో కమ్యూనిస్ట్ పార్టీ చీలిక వేళ, సీపీఐ (ఎం) కొడవలి - సుత్తి - నక్షత్రం గుర్తును ఎంచుకోవడం మరో కథ. ఆ మధ్య 2017లో ఓ ఉప ఎన్నిక వేళ అన్నాడిఎంకే వర్గాల మధ్య పోరులో రెండు ఆకుల చిహ్నాన్ని ఇప్పటిలాగే ఈసీ తాత్కాలికంగా స్తంభింపజేసింది.

ఇలా ఎన్నికల చిహ్నాలపై పార్టీలలో చీలిక వర్గాలలో పోరు కొత్త కాదు. శివసేన వ్యవహారం రేపు ఏ మలుపు తీసుకుంటుందన్నది చూడాలి. ఒకరకంగా ఈసీ తన నిష్పాక్షికతనూ, స్వతంత్ర ప్రతిపత్తినీ మరోసారి నిరూపించుకోవాల్సిన సందర్భం ఇది. ఫలితం ఏమైనా, యాభై ఆరేళ్ళ క్రితం 1966 జూన్‌లో బాలాసాహెబ్ చేతుల మీదుగా ఆరంభమై, మరాఠా రాజకీయాలను దశాబ్దాలుగా శాసించిన బలమైన ప్రాంతీయ పార్టీకి ఇది దీర్ఘకాలంలో దెబ్బే. పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చిన విధంగా ఈ గొడవలో చివరకు లాభపడేది కమలనాథులే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: బ.విదియ రా.1.33 వరకు, తదుపరి తదియ
నక్షత్రం: అశ్వని సా.5.24 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: ప.1.21 నుండి 2.56 వరకు, తిరిగి రా.3.19 నుండి 4.56 వరకు
దుర్ముహూర్తం: ఉ.8.14 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.34 నుండి 11.23 వరకు అమృతఘడియలు: ప.2.43 నుండి 4.18 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

జడ్జి ప్రశ్నలకు జవాబులున్నాయా?

ఆరోగ్యవంతమైన పత్రికలకు జాతీయ, సామాజిక బాధ్యత అనివార్యం. ప్రజలకు చేదోడు వాదోడుగా ఉండటంలో పాలనాశక్తుల కన్నా ముందుగా జాగరూకులవడంలో మీడియా స్వతంత్ర హోదాలో వ్యవహరించాలి. ప్రజల పట్ల కడు గౌరవంతో, అణకువతో ప్రవర్తించాలి. కానీ ఒకనాటి విశిష్ట పాత్రికేయ ప్రమాణాలన్నీ క్రమంగా పతనమవడం చూస్తున్నాం. అందుకే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో సామాజిక, నైతిక ప్రమాణాల గురించి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి నిశితమైన విమర్శలు చేశారు. నిజాయితీ గల పాత్రికేయులందరూ వీటికి జవాబులు వెతకాలి. అయితే పత్రికా విలేకర్లు, ఎడిటర్లు అంటే నేడు చులకన భావన ప్రజల మనసుల్లో నాటుకుపోవడానికి దోహదపడినవి స్వార్థపర రాజకీయాలేనని మరవరాదు.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"వార్తా పత్రికలు అనేవి సమాజంలో అంతర్భాగం. అంతమాత్రాన్నే తాము మొత్తం సమాజానికే 'శిష్టాది గురువు'లమనీ, లోకంలోని జ్ఞానమంతా తమ సొత్తనీ భావించి విర్రవీగరాదు. బుద్ధిగల ఏ వార్తాపత్రికైనా చారిత్రక పరిణామంలో తనవంతు కీలకమైన పాత్ర నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే బాధ్యత గల ఏ పత్రికైనా సమాజం కోసం, తాను సేవలందించే ప్రజల కోసం వారి పట్ల కడు గౌరవంతో, అణకువతో ప్రవర్తించాలి. ఆరోగ్యవంతమైన పత్రికలకు జాతీయ, సామాజిక బాధ్యత అనివార్యం. ఈ క్రమంలోనే సమాజం పట్ల పత్రికల బాధ్యతను ఏరోజుకారోజు తాత్కాలిక రాజకీయ పార్టీలు లేదా ఆనాటి ప్రభుత్వాల బాధ్యతతో పోల్చుకోరాదు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి చేదోడు వాదోడు కావడంలో పత్రికలు పాలనాశక్తుల కన్నా ముందుగా జాగరూకులవడంలో స్వతంత్ర హోదాలో వ్యవహరించాలి."

- సుప్రసిద్ధ జాతీయ దినపత్రిక 'ది హిందూ' 1978 సెప్టెంబరు 5న తన నూరు సంవత్సరాల చరిత్రను (1878-1978) సమీక్షిస్తూ రాసిన సంపాదకీయం.

రెండో మాట



ఒకనాటి ఇలాంటి విశిష్ట పత్రికా (పాత్రికేయ) ప్రమాణాలన్నీ కొలది సంవత్సరాలుగా ఎలా పతనమవుతూ వస్తున్నాయో చూస్తూనేవున్నాం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, తెలుగు న్యాయమూర్తులలో విశిష్టమైన జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఈ విషయంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వతంత్ర భావాలతో న్యాయస్థానాల ద్వారా, సభల ద్వారా ప్రజా బాహుళ్యంలో ఆధునిక వైజ్ఞానిక దృష్టిని పెంపొందించడానికి కృషి చేస్తూ వచ్చిన వ్యక్తి సుదర్శన్ రెడ్డి. తెలంగాణా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో నేటి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో సామాజిక, నైతిక ప్రమాణాల గురించి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రస్తావించి, నిశితమైన విమర్శలు చేశారు. ఈనాటి కొందరు జర్నలిస్టులు పత్రికా యాజమాన్యాల సాయంతో పాలకుల్ని ఒప్పించడం సబబైన మార్గమని భావిస్తూండడాన్ని జస్టిస్ సుదర్శన్ విమర్శించారు. ఈ ధోరణి నేటి మీడియాలో పెరిగిపోతుండడాన్ని ఆయన నిరసించారు.

వేలాది వార్తా పత్రికలు, వెయ్యి ఉపగ్రహాల సహాయంతో నడుస్తున్న న్యూస్ చానల్స్, 600 ఎఫ్.ఎం. స్టేషన్స్‌తో దేశంలోని బహు కొలదిమంది సంపన్నులు లాభాల వేటలో పడి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి వాతావరణంలోనే ఒక నటుడు ఆత్మహత్య చేసుకుంటే దాన్ని మీడియా ఓ పెద్ద ఘటనగా చూపింది. అందుకు దోహదం చేసినవాళ్లు వెంటనే దాన్ని రాజకీయ పోరాటంగా మలిచేశారు. కానీ అదే సమయంలో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటనకు కేవలం ఏడు నిమిషాల ప్రాధాన్యం కల్పించారు. ఎందుకని? వార్తలు పత్రికా ఆఫీసుల నుంచి కాకుండా ఎక్కడో బయట 'అల్లి' పత్రికలకు చేరుతున్నాయి! అయినా నిజాయితీ గల జర్నలిస్టులు, ప్రజా సమస్యల పట్ల ఆవేదన చెందగల పాత్రికేయులు కూడా మనకు లేకపోలేదని జస్టిస్ సుదర్శన్ రెడ్డి గుర్తించగలిగారు.

అంతేగాదు, మరొక వాస్తవాన్ని కూడా జస్టిస్ సుదర్శన్ బహిర్గతం చేశారు. వార్తా పత్రికలు నిర్వహించే యాజమాన్య సంస్థల్లో పెక్కింటికి ఇతర వ్యాపారాలు కూడా ఉన్నందున నిర్ణయాలు త్వరగా తీసుకోలేని దుఃస్థితిని కూడా ఆయన వివరించారు. అందుకే దేశంలో ప్రజాస్వామ్యాన్ని, దాని విలువల్ని కాపాడేందుకుగానూ పూర్తిగా ప్రయివేట్ పత్రికా యాజమాన్యాల మీడియా సంస్థలపై సరైన అదుపాజ్ఞలు విధించడం అవసరమన్న సుప్రీంకోర్టు ప్రకటనను కూడా జస్టిస్ సుదర్శన్ గుర్తు చేయవలసి వచ్చింది.

ఇక ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ - ప్రతీ పాత్రికేయ విలువనూ, గత ప్రమాణాలనూ ధ్వంసం చేసి నేరస్థ రాజకీయ విలువల్ని చొప్పించేశారనీ, అదే జర్నలిజంగా ప్రమోట్ అవుతోందనీ ఆవేదన చెందారు. ధనార్జనలో భాగంగా అమెరికన్ కోటీశ్వరుడు రూపర్ట్ మర్డోక్ 'ఫాక్స్' న్యూస్ ఛానల్ పెట్టి ఎలా అనైతిక ప్రమాణాలను ప్రవేశపెట్టాడో లోకానికి తెలుసు. ఎక్కడో అమెరికా, ఇతర దేశాల సంగతి కాదు... ఆ మాటకొస్తే మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నట్టింటనే ఇలాంటివి జరిగాయి. "సీనియర్ జర్నలిస్టుల" పేరిట చలామణీ అవుతున్న ఇద్దరు ముగ్గురు వ్యక్తుల్ని ఒక ముఖ్యమంత్రి సాకడం జరిగింది. వారికి ఇంటర్- స్టేట్ వాహనాల లైసెన్సులు ఇప్పించడమే గాకుండా హౌసింగ్ బోర్డు యాజమాన్యంలో కూడా చోటు కల్పించారు. దాన్ని స్వప్రయోజనాలకు వినియోగించుకుని బ్యాంకుల్ని దివాళా తీయించిన ఉదాహరణలూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని మరవరాదు!

అంతేగాదు, అనైతిక మీడియా సోదరుడే "ముందు వాడి (ఎన్.టి.ఆర్.) ఫోటోను తీసి అవతల పారేస్తావా, లేదా?" అని స్వయంగా చంద్రబాబు ముఖం మీదనే 'ఉరిమాడా,' లేదా? ఎన్టీఆర్ ఫొటో తీసేస్తే కథ అడ్డం తిరుగుతుందని తెలిసిన చంద్రబాబు 'అలాగే తీసేద్దాంలే, ఇప్పుడు కాదు' అని చెప్పి... 'ఫొటో నాటకం' కోసం కొన్నాళ్లు ఎన్టీఆర్ అవసరమని తెలిసి తన తైనాతీ జర్నలిస్టును కాపాడుకున్నాడా, లేదా? ఇప్పటికీ ఆ నాటకం ఎన్టీఆర్ బొమ్మతోనే కొనసాగిస్తున్నారా, లేదా? చివరికి అమరావతి రైతాంగాన్ని మోసగించిన వైనాన్ని గురించి సీనియర్ జర్నలిస్టుగా హైకోర్టులో నేను రిట్ వేసినా, దాన్ని కనీసం చర్చకు కూడా రానివ్వకుండా తొక్కిపెట్టించిన ఖ్యాతిని మూటగట్టుకున్నవాడు చంద్రబాబే! అంతేగాదు, అమరావతి రైతాంగానికి జరిగిన అన్యాయం గురించి సుప్రీంకోర్టులో నేను రిట్ వేసినప్పుడు, ఆగమేఘాల మీద ఢిల్లీ చేరుకుని, ఆ కేసును కూడా తొక్కిపట్టేట్టు చేసినవాడూ చంద్రబాబే కదా? ఆ కేసు అప్పటికీ ఇప్పటికీ అక్కడే ఉండిపోయింది. ముక్కారు పంటలు పండే అమరావతి ప్రాంత భూములను తన రాజకీయ ప్రయోజనాల కోసం, తన మంత్రివర్గంలోని ధనాఢ్యుడైన విద్యాశాఖామంత్రికి ధారాదత్తం చేయడమే కాక... ఎదురు తిరిగిన రైతుల భూముల్ని తగలబెట్టించి, ఆ దుర్మార్గాన్ని దళితుడైన నందిగం సురేష్‌పై (నేటి పార్లమెంట్ సభ్యుడు) నెట్టి, వేధింపులకు గురిచేసిన వాళ్లెవరు?

కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. పత్రికా విలేకర్లు, ఎడిటర్లు అంటే నేడు చులకన భావన ప్రజల మనసుల్లో నాటుకుపోవడానికి దోహదపడినవి పాలకుల స్వార్థపర రాజకీయాలేనని మరవరాదు. కనుకనే గౌరవ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మన మీడియా నిర్వాహకులకు (కోట్లకు పడగలెత్తిన యాజమాన్యాలకు, బతుకు బాటలో లొంగిపోయే కొందరు మీడియా మిత్రులకు) చురకలు వేయడం సకాలంలో సబబైన స్పందనగా నేను భావిస్తున్నాను. అమెరికాలో వాల్టర్ లిప్‌మన్, ప్రొఫెసర్ నోమ్ చామ్‌స్కీ నిర్వహించిన పాత్రను ఇక్కడ మన కాలంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోషిస్తున్నారని చెప్పడం అతిశయోక్తి కాజాలదు!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

రష్యా చేతిలోనే...



అణుయుద్ధాన్ని తప్పించాలంటే ఉన్న తప్పనిసరి మార్గం, రష్యా దాన్ని మొదలుపెట్టకపోవడమే! వాళ్లు చేయకపోతే, ఇంకెవరూ చేయరు. అలాగే ఉక్రెయిన్ దురాక్రమణను అంతమొందించాలంటే, ఉక్రెయిన్ నుంచి రష్యా వైదొగలగడమే మార్గం. యుద్ధం వచ్చిందే రష్యా వల్ల! కాబట్టి రష్యా ఎప్పుడు ఆపితే అప్పుడు యుద్ధం ఆగుతుంది.

- డేవిడ్ ఫ్రూమ్, కాలమిస్ట్

నాన్న లేరు



నా ఆదరణీయ పితాజీ, మనందరి నేతాజీ మరిక లేరు. (సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్‌ను ఉద్దేశించి.)

- అఖిలేశ్ యాదవ్, యూపీ మాజీ ముఖ్యమంత్రి

ఇక సెలవు



మరింత సానుకూల శక్తి కోసం మాత్రమే దీన్ని ఖాళీ చేస్తున్నాను. ఇది ఆ దిశగా ఒక అడుగు. గుడ్‌బై ట్విట్టర్.

- కరణ్ జోహార్, దర్శకుడు

అదే గుర్తు



అయోధ్యలో హిందూ కరసేవకులను చంపిన మనిషి చనిపోయారు. అవును, నిరాయుధ రామ భక్తులను చంపినవాడిగానే ముల్లా ములాయం గుర్తుండిపోతారు.

- పంకజ్ సక్సేనా, సాంస్కృతిక పరిశోధకుడు

రక్షకురాలి మరణం



సుప్రసిద్ధ శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం (కేరళ)లో నివసించిన 75 ఏళ్ల శాకాహార మొసలి బబియా చనిపోయింది. రోజూ ఆలయ ప్రసాదాన్ని బబియాకు రెండుసార్లు తినిపించేవారు. భక్తులు దాన్ని ఆలయ సంరక్షకురాలిగా కూడా తలచేవారు. బబియాకు వందలాది మంది నివాళులు అర్పించారు. ఓం శాంతి.

- అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

అందుకు గొప్ప



రథయాత్ర జరిగిన సమయంలో మతపరమైన అలజడికి గట్టి వ్యతిరేక వైఖరి తీసుకున్నారు ములాయం సింగ్ యాదవ్. ఆయన ఎన్నో విషయాల్లో విఫలమయ్యారు. కానీ ఉత్తరప్రదేశ్‌ను మతం ఆక్రమించడాన్ని పదిహేనేళ్లు ఆలస్యం చేసినందుకు ఆయనకు క్రెడిట్ ఇవ్వాలి. ఆత్మకు శాంతి కలుగుగాక!

- ఆదిత్య మేనన్, జర్నలిస్ట్

ఇతరులతో కలవరా?



మనుషులు ఇంకా తమ జాతివాళ్లు, తమ కులం వాళ్లతోనే కలిసిమెలిసి తిరగడానికి ఇష్టపడటం చూస్తుంటే ఎంతో బాధ కలుగుతుంది. వైవిధ్య భరితమైన సమాజంతో కలవగలిగే అవకాశం ఉన్నప్పుడు కూడా వాళ్లు అలా ఎందుకు చేస్తారు? ముఖ్యంగా ఈ ధోరణి దక్షిణాసియావాళ్లలోనే కనబడుతుంది.

- అమీనా బేగమ్ అన్సారీ, పాలసీ అనలిస్ట్

పథకాలు కావు... ఆత్మగౌరవ పతాకలు!

అభిప్రాయం



కైలే అనిల్ కుమార్

నియోజకవర్గం ప్రతినిధిగా గడప గడపకు వెళుతున్నప్పుడు... ప్రజలను ప్రభుత్వం గౌరవిస్తున్న తీరు అర్థమవడం మొదలయింది. సంక్షేమ పథకాలను అమలు చేయడమే బాధ్యతగా భావిస్తున్న ప్రభుత్వం... పేదల ఆత్మాభిమానాన్ని పెంచే విధంగా ఆ పథకాల అమలు తీరును నిర్దేశించిన విషయం అవగతమవుతోంది.

పేదలను ప్రేమించి, గౌరవించిన ప్రభుత్వం ఇది. మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉంటే నవరత్నాలు నిరుపేదల గుమ్మం ముందుకు ఎలా చేరతాయో చూపిస్తున్న ప్రభుత్వం ఇది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలను గౌరవిస్తున్న ప్రభుత్వం ప్రస్తుతం నడుస్తోంది. సమాజంలోని అన్ని వర్గాల శ్రేయస్సును కాంక్షించి జగనన్న ప్రభుత్వం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు సామాజిక న్యాయం దిశగా సాగుతున్న ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లుగా మనకు కనపడుతున్నాయి. అన్ని వర్గాల పేదలు, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలే గుండె చప్పుడుగా పథకాలు అమలవుతున్నాయి.

ప్రతి నెల ఒకటో తేదీ తలుపుతట్టి పెన్షన్ అందిస్తున్న వాలంటీర్ పేదల ఇళ్లకు తీసుకెళ్లేది కేవలం పెన్షన్ డబ్బులే కాదు... డబ్బుతో పాటు ఆ వృద్ధుల, దివ్యాంగుల, ఒంటరి మహిళల ఆత్మగౌరవాన్ని కూడా. పెన్షన్ ఇవ్వడం కేవలం సంక్షేమ పథకమే కావచ్చు. కానీ పెన్షన్‌ను వారి చేతికి అందించడం ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉన్న ప్రేమ, గౌరవాన్ని సూచిస్తుంది. పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడం అంటే కేవలం వారు తలదాచుకోవడానికి గూడు కల్పించడమే కాదు... సమాజంలో సగౌరవంగా తలెత్తుకు బ్రతికే ఆత్మవిశ్వాసాన్ని కూడా కల్పించడమే. ప్రభుత్వం రాష్ట్రంలో 31 లక్షల మంది మహిళల పేరిట ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించి ఇస్తోంది. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని ఇప్పుడు ఇంటి గుమ్మం ముందుకు తెచ్చి ఇస్తున్నారు. ఇది కూడా పేదల ఆత్మాభిమానాన్ని గౌరవించే చర్యే.

ఇలా పథకం/సేవ ఏదైనా అమలు విధానంలో ప్రస్ఫుటంగా ప్రజలను గౌరవిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి యాభై ఇళ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి సేవలందిస్తున్న ముఖ్యమంత్రి జగనే ఓ వాలంటీర్. ముఖ్యమంత్రి జగన్ బాటలో నడుస్తూ గడప గడపకు వెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకుంటున్న నా లాంటి ఎమ్మెల్యేలు అంతా ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లే.

వ్యాసకర్త పామర్రు ఎమ్మెల్యే, కృష్ణా జిల్లా | 99494 18777

'భావజాల' విముక్తే ప్రత్యామ్నాయానికి దారి

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

భారతదేశం ఈనాడు అంబేడ్కర్ మార్గంలో నడవాలా? గాంధీ మార్గంలో నడవాలా? అనే పెద్ద ప్రశ్న దేశంలోని పార్టీల ముందు ఉంది. భారత దేశంలో ఈనాడు రాజకీయ కూటములు ఎక్కువ ఏర్పడుతున్నాయి. బీజేపీ కూటమి గాంధీ, సర్దార్ వల్లభాయి పటేల్ భావజాలాల్లో నడుస్తోంది. కాంగ్రెస్ కూటమి గాంధీ, నెహ్రూ భావజాలాల్లో నడుస్తున్నది. కేసీఆర్, నితీష్ కుమార్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి వారితో ఏర్పడుతుందని చెబుతున్న మూడవ కూటమి ఇంకా తన భావజాలాన్ని ప్రస్ఫుటం చేయలేదు. కానీ భారతదేశంలో సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో మౌలికమైన మార్పు రావాలంటే తప్పకుండా అంబేడ్కర్ భావజాలమే ఈనాడు భారతదేశానికి అవసరం.

బీజేపీ పైకి గాంధీ పేరు చెప్తున్నా అది హిందూ మతోన్మాద భావజాలాన్ని ఆర్ఎస్ఎస్ మార్గంలో నడుపుతోంది. హిందూ మతోన్మాదాన్ని భారతదేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సరిగ్గా అంచనా వేశారు. హిందూ మతాన్ని నిర్మూలించకుండా భారతీయ సామాజిక విప్లవం విజయవంతం కాదనీ, హిందూ మతోన్మాదం ప్రమాదకరమైనదనీ అంబేడ్కర్ నొక్కి వక్కాణించాడు. భారత సామాజిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోయిన బౌద్ధ ఉద్యమంలోని మానవతా వాదాన్ని ఆయన పరివ్యాప్తం చేశాడు. కమ్యూనిస్టులు ప్రాచీన భారత సామాజిక ఉద్యమకారులను, ఆధునిక సామాజిక ఉద్యమకారులైన మహాత్మాపూలే, అంబేడ్కర్, పెరియార్ వంటి వారినీ; వారి సిద్ధాంతాలనూ నిర్లక్ష్యం చేశారు. దాని ఫలితంగా భారతదేశంలో ఈనాడు మతోన్మాదం తెట్టెం కట్టుకుపోయింది. మతోన్మాదులు, సామ్రాజ్యవాదుల అండ తీసుకొని మరింతగా బలపడటం ప్రారంభించారు. ఇక దీనికి రాజ్య వ్యవస్థ తోడైందంటే ఎంత ప్రమాదమో చూడండి!

అంబేడ్కర్ విషయానికి వస్తే... మొదటి నుండి ఆర్ఎస్ఎస్ భావజాలానికి ప్రత్యామ్నాయంగా... భారతదేశంలో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, విద్యా, తాత్విక రంగాలలో ప్రామాణికమైన కాంగ్రెస్ నాయకులు మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూలను ఎదిరిస్తూ వచ్చాడు. తన 'వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ హేవ్ డన్ టు ది అన్‌టచ్‌బుల్స్' అనే గ్రంథంలో కాంగ్రెస్ నాయకుల నిజ స్వరూపాన్ని బయటపెట్టాడు. నిజానికి కాంగ్రెస్‌లో అంత గ్రతంగా హిందూయిజం వుంది. బీజేపీ తమ సిద్ధాంతకర్తలుగా కాంగ్రెస్ నాయకులను తలకెత్తుకోవడంలోని ఆంతర్యం అదే.

అంబేడ్కర్ అసలు హిందూమతం అంటే ఏమిటి? హిందూ మత భావజాలంతో నడిచేవి అసలు పార్టీలు అవుతాయా? అని ప్రశ్నించాడు. నిషేధాల శిక్షాస్మృతినే హిందూ మతంగా చలామణీ చేసి ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించడం జరుగుతోందని అంబేడ్కర్ అన్నారు. ఒక వర్గానికి ఒక న్యాయం, మరొక వర్గానికి మరొక న్యాయం... వీటిలో ఎప్పటికీ మార్పు లేకుండా చేసి అన్యాయాన్ని శాశ్వతీకరించడం మరీ దురన్యాయం అన్నారాయన. లేని 'హిందూ' మతాన్నీ, వాదాన్నీ గాంధీ తలకెత్తుకున్నాడు. దానితో ముస్లిం లీగ్ విజృంభించింది. మతవాద రాజకీయాలు, స్వాతంత్ర్య ఉద్యమాలతోనే హిందూ రాజకీయ వాదం ప్రారంభమైంది. హిందూ శబ్దం వేదాల్లో లేదు. భారత, రామాయణ, భాగవత అష్టాదశ పురాణాల్లో లేదు. వైదిక మతం, బ్రాహ్మణమతం ఉన్నాయి కానీ హిందూ



మతం లేదు. ఇప్పుడు బీజేపీ హిందూ మతోన్మాదాన్నీ, కాంగ్రెస్ హిందూ సాంప్రదాయ వాదాన్నీ ముందుకు తెస్తున్నాయి. ఇప్పటికే అంబేడ్కర్ హిందూ ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను రూపొందించారు. ఆయన కొత్త మ్యానిఫెస్టోలు ఎప్పటికప్పుడు రచించారు. అంబేడ్కర్ రాజకీయ ఉద్యమంలో బౌద్ధ తత్వ ప్రభావం వుంది. బౌద్ధ తాత్వికతలో వున్న సమసమాజ నిర్మాణ భావన ఆయనలో వ్యక్తమయ్యింది.

అంబేడ్కర్ మానవతావాది. హేతువాది సామ్యవాది. ఆయన జాన్‌డ్యూయీ శిష్యుడు. జాన్‌డ్యూయిలోని ప్రజాస్వామ్య భావాలనూ, కారల్ మార్క్స్‌లోని సామ్యవాద భావాలనూ, కబీరులోని మానవతావాద భావాలనూ ఆయన రాజకీయాలతో సమన్వయించారు. ఆయన నిర్మించిన రాజకీయ పార్టీలో సామ్యవాద భావాలు నిండి వున్నాయి. మార్క్స్ భావజాలాన్ని కూడా ఆయన తన రాజకీయ ప్రణాళికలో చేర్చాడు. మార్క్సియన్ పద్ధతిలో కాకపోయినా, భారతీయ సామాజిక విప్లవకారుడిగా సమసమాజం కోరుతున్న అంబేడ్కర్ కుల నిర్మూలనా వాదం వర్గపోరాటానికి సజీవశక్తి అనడంలో అతిశయోక్తి లేదు. అంబేడ్కర్ కొన్ని అంశాల్లో మార్క్స్‌తో విభేదించాడు. కొన్ని అంశాల్లో అంగీకరించాడు. అంగీకరించిన ప్రధాన అంశం 'సమ సమాజం'. అంగీకరించని అంశం సాధించే పద్ధతిలోనే బలప్రయోగం లక్ష్యం. ఇద్దరిదీ సమ సమాజమే. సాధించే పద్ధతిలోనే కొంత తేడా వుంది. ఇద్దరి సామాజిక తత్వవేత్తల వైరుధ్యాలను, సమన్వయాలను పరిశీలించి భారత సామాజిక విప్లవానికి వారిరువురి సిద్ధాంతాలను ఉపయుక్తం చేసుకోవలసిన 'సమ సామాజిక వాదులు' ఆ చారిత్రక బాధ్యతను విస్మరించారు. కులవాదం మీద అంబేడ్కర్ విశ్లేషణలను మార్క్స్ మీద అంబేడ్కర్ చేసిన విశ్లేషణలుగా ప్రచారం చేసి అంబేడ్కర్‌ను మార్క్స్ వ్యతిరేకిగా చిత్రించడంలో హిందూ కమ్యూనిస్టులు కృతకృత్యులయ్యారు.

అంబేడ్కర్, లోహియా, మార్క్స్‌ల భావజాలాల సమన్వయమే హిందూ భావజాల రాజకీయాలకు ప్రత్యామ్నాయం. దళిత బహుజన మైనార్టీ లౌకిక వాదులు ఈ మార్గంలో నడిస్తేనే భారతదేశానికి భావజాల విముక్తి. భావజాల విముక్తి వల్లే రాజకీయాలకు ప్రత్యామ్నాయ యుగం ఆవిర్భవిస్తుంది. ఆ దిశగా పయనిద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నేత
మొబైల్: 98497 41695

విభజన చట్టంలోని హామీలన్నింటినీ అమలు చేయాలి

ఏపీ నాన్ పొలిటికల్ జేఏసీ నేతల డిమాండ్

మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలన్నింటినీ అమలు చేయాలని ఏపీ నాన్ పొలిటికల్ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం ఏపీ నాన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు అప్పికట్ల శ్రీహరినాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నేతలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖకు రైల్వే జోన్ కేటాయించడంతో పాటు.. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, షెడ్యూలు 9, 10, 13లో పొందుపర్చిన అన్ని సంస్థలనూ తక్షణమే నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఇక ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక నిధులను కేటాయించాలని, విభజన అనంతరం తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన వాటాలను, నిధులను కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని వెంటనే విడుదల చేయాలని నాన్ పొలిటికల్ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాన్ పొలిటికల్ జేఏసీ నేతలు జీవీ సాయికృష్ణ, వీసం వెంకటేశ్వరరావు, బాణాల నాగేశ్వరరావు, తిరుమలశెట్టి సురేంద్ర, ఎస్కే సుభానీ, ఆరేపల్లి మణికంఠ, పలు పార్టీల నేతలుపాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ నాన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు అప్పికట్ల శ్రీహరినాయుడు

చిన్నారిని సంరక్షణలోకి తీసుకోవడం అక్రమ నిర్బంధం కాదు

- దీనిపై హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుకు వీల్లేదు
- ఓ తండ్రి పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: తల్లి మరణించిన చిన్నారిని అమ్మమ్మ, తాతయ్య తమ సంరక్షణలోకి తీసుకోవడం అక్రమ నిర్బంధం కిందకు రాదని హైకోర్టు స్పష్టం చేసింది. దీనిపై హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదంది. చిన్నారిని అమ్మమ్మ తాతయ్య తమ సంరక్షణలోకి తీసుకోవడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించలేమని పేర్కొంది. తన భార్య మరణించిన నేపథ్యంలో పదినెలల తన కుమార్తెను తన అత్తమామలు అక్రమంగా నిర్బంధించారంటూ బాపట్లకు చెందిన గోపి అనే వ్యక్తి దాఖలుచేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కొట్టేసింది. సహజసిద్ధ సంరక్షకుల హక్కులను నిర్ధారించేముందు ఆ చిన్నారి సంరక్షణ అత్యంత ముఖ్యమని తెలిపింది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిందని గుర్తుచేసింది. చిన్నారి కస్టడీ కోసం సంబంధిత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని గోపీకి సూచిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ బి.వి.ఎల్.ఎన్.చక్రవర్తి ధర్మాసనం తీర్పు చెప్పింది. ప్రతి ఆదివారం వెళ్లి అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉన్న ఆ చిన్నారిని చూసుకునేందుకు గోపీకి ధర్మాసనం అనుమతి ఇచ్చింది. తన భార్య చనిపోయిన తరువాత తన కుమార్తెను తన అత్తమామలు అక్రమంగా నిర్బంధించారని, ఆ చిన్నారిని కోర్టు ముందు ప్రవేశపెట్టేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ గోపి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ధర్మాసనం విచారించింది.

పిండ మార్పిడితో మేలుజాతి పశుసంపద


ఆవులను పరిశీలిస్తున్న ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం శ్రీనివాసరావు, పశువైద్యులు

చిలకలూరిపేట: పిండ మార్పిడి విధానం ద్వారా ఆవులు, గేదెల్లో మేలు జాతి పశు సంపదను సృష్టించవచ్చని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణం ఎన్టీఆర్ కాలనీలోని షిరిడీ సాయిబాబా మందిర ప్రాంగణంలోని గోశాలలో సోమవారం పిండ మార్పిడి విధానం ద్వారా ఆవు గర్భంలోకి మేలుజాతి పిండాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ (పిండమార్పిడి విధానం) ద్వారా తక్కువ పాలు ఇచ్చే ఆవులు, గేదెలకు మేలు జాతి పశువుల పిండాలను ప్రవేశపెట్టి అధిక పాలదిగుబడిని ఇచ్చే పశుసంతతిని వృద్ధి చేయవచ్చన్నారు. ప్రస్తుతం గుంటూరు లాంఫాం, నెల్లూరు జిల్లా చింతపల్లి ఫాం, తిరుపతిలో టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న పశువైద్యశాలల్లో ఈ సాంకేతికత ఉందన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ టి.శ్రీనివాసరావు, పిండ మార్పిడి నిపుణులు డాక్టర్ శ్రీమన్నారాయణ, పసుమర్రు, పశువైద్యులు రవీంద్రకుమార్, దీప్తి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో మరణించే వరకు జైలు శిక్ష

విజయవాడ స్పోర్ట్స్: ఏడేళ్ల బాలికపై లైంగికదాడి చేసిన వ్యక్తికి జీవితకాలం కఠిన కారాగార శిక్ష (మరణించే వరకు జైలు) విధిస్తూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి రజిని సోమవారం తీర్పు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నున్నకి చెందిన బాలిక(7) ఈ ఏడాది ఫిబ్రవరి 26న స్కూలుకు వెళ్లి వచ్చి ఇంటి వద్ద ఉంది. ఆ ఇంటి సమీపంలోనే ఉంటున్న అనీల్(30) ఆ బాలికకు నెమలి ఈకలు ఇస్తానని ఆశ చూపి తాను పని చేస్తున్న టెంట్ హౌస్‌కు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనీల్ అత్యాచారం చేశాడని బాలిక తన తల్లికి చెప్పడంతో ఆమె నున్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి కేసును దిశా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దిశా పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి పై విధంగా శిక్ష, రూ.3 వేలు జరిమానా విధించారు. బాలిక కుటుంబానికి రూ.5 లక్షలు నష్టపరిహారం అందేలా చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆదేశించారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. సర్వ దర్శనానికి 20 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతుంది. 32 కంపార్ట్‌మెంట్‌లు నిండాయి. క్యూలైన్‌లు టీబీసీ వద్దకు చేరుకున్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,188 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.5 కోట్లు వేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
అటవీ శాఖ
డిప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కార్యాలయం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

TTD దేవాలయాలకు రెండు పనులు అంటే వాహనం తాండ్లు (Vahanam Thandlu) & సంబంధిత ఐటమ్‌ల సరఫరా కోసం ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన, టెండరు వివరాలు మరియు అర్హత ప్రమాణాల కోసం వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in కు లాగాన్ కావలెను. తదుపరి వివరాలకు సంప్రదించండి. ఫోన్ నంబర్లు: 0877-2264518, 2264444.
Roc.No.PR4/13947/Adv.No.244/PRO/2022, Dt:10.10.2022 — ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
No.14/NLR/Dargah/Mosque/DB/TO/2022 టెండరు ప్రకటన (రివర్స్ టెండరింగ్) తేది: 07.10.2022
పని పేరు: నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, దర్గామిట్ట, బారాషహీద్ దర్గా ఆవరణలో మసీదు నిర్మాణం. అంచనా మొత్తం: రూ.750.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.10.2022 ఉ.11.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 25.10.2022 సా.04.00 గం.వరకు. బిడ్ల స్వీకరణకు చివరి తేది: 25.10.2022 సా.05.00 గం.వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 25.10.2022 సా.05.30 గం. మరిన్ని వివరాలకు దర్శించండి: https://tender.apeprocurement.gov.in, ఫోన్: 2328649
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్ సర్కిల్, నెల్లూరు
DIPR RO No.6228/CL/Advt/1/1/2021-22, Dt. 10.10.2022

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జల వనరుల శాఖ
నెం.27/2022-23 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది:07.10.2022
పని పేరు : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల గ్రామ సమీపంలోని పైడేరు ఎస్కేప్ ఛానల్ పై డిస్ట్రిబ్యూటరీ రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జికి తక్షణ మరమ్మతులు చేయుట. పని విలువ : రూ. 125.20 లక్షలు. టెండరు డాక్యుమెంట్లు లభ్యమగు తేది : 10.10.2022 ఉ.11.00 గం. నుండి 24.10.2022 సా. 05.00 గం.వరకు. టెండర్లు స్వీకరించు చివరి తేది : 26.10.2022 సా.5.00 గం.వరకు. ప్రీ బిడ్ తెరుచు తేది : 27.10.2022 ఉ.11.00 గం.కు. ఫైనాన్షియల్ బిడ్ తెరుచు తేది : 31.10.2022 ఉ. 11.00 గం.కు. ఆక్షన్ (రివర్స్ ఆక్షన్) తేది : 31.10.2022 మ.2.00 గం.కు (కనీస వ్యవధి 3.00 గం.లు) వివరాలు: https://tender.apeprocurement.gov.in ఫోన్: 0861-2327658
సం/- పర్యవేక్షక ఇంజనీర్, నీటిపారుదల వలయము, నెల్లూరు
DIPR RO No.6227/CL/Advt/1/1/2021-22, Dt: 10.10.2022

ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ, విజయవాడ
C1/484/APDASCAC/RMTW/2021, ప్రకటన తేది: 07.10.2022
అర్హులైన శారీరక విభిన్న ప్రతిభావంతులు 70 శాతము, ఆపై వైకల్యము మరియు 18-45 సంవత్సరముల మధ్య వయసు కలిగిన వారికి మూడు చక్రముల మోటారు వాహనము మంజూరు నిమిత్తము ఆన్‌లైన్ దరఖాస్తులు కోరడమైనది. దయచేసి మార్గదర్శకాల కొరకు www.apdascac.ap.gov.in ను సందర్శించగలరు.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO.No.1295PP/CL/Advt/1/1/2021-22, Dt: 10/10/2022

DEPARTMENT OF TECHNICAL EDUCATION
(On behalf of APSCHE)
APECET-2022 ADMISSIONS
FINAL PHASE NOTIFICATION
CERTIFICATE VERIFICATION & OPTION EXERCISING FOR WEB BASED COUNSELLING

The Qualified & eligible candidates of APECET-2022 (Diploma Holders in Engineering and Pharmacy & B.Sc Maths Candidates) are informed that the web counselling process comprising payment of processing fee cum registration, certificate verification and option entry will be conducted from **12-10-2022 to 15-10-2022.** For detailed notification (containing the list of Help Line centres, Certificates to be uploaded for online verification and schedule of counselling) visit website **https://sche.ap.gov.in**
Dated: 07-10-2022 — Sd/- C. Naga Rani, I.A.S
Place: Mangalagiri — Convenor & CTE

AP CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
NIT No. 08/MAU61-ABMNOSD(VI)/4/2022-IFR1 Dt : 10.10.2022
E PROCUREMENT TENDER NOTICE
NAME OF WORK : "Operation and Maintenance of Street Lighting for the Reaches (1) From KWD Regulator to Hon'ble Ex C M's Residence Check post Jn., (2) From Hon'ble High Court Judge Bunglows Road (Karakatta), (3) From Hon'ble Ex C M's Residence Checkpost Jn. to Sri M S Raju Ashram Jn. (E3 Road), (4) From E3 Road Jn. via. Venkatapalem up to Venkatapalem Checkpost, (5) From Hon'ble Ex C M's Residence Checkpost Jn. to Undavalli caves Jn., (6) From Undavalli Caves Jn. to Penumaka, (7) From Penumaka Jn. to Krishnayapalem Jn., (8) From Yerrabalem Cheruvu to Venkatapalem Checkpost, (9) From IGC to Velagapudi via. Mandadam Jn., (10) From MLA Quarters (E3 Road) to Hon'ble High Court via. Hon'ble High Court Judge Bungiows, (11) From Venkatapalem Checkpost to Mandadam Jn.(12) From Hon'ble High Court via. AIS Quarters upto R&B Road Jn., (13) Thulluru Road From Balayesu Colony to Ayyappa Swamy Temple for the Year 2022-23" ECV: Rs.26,22,358/-.
The bid can be downloaded on AP e-procurement portal from 14.10.2022 to 31.10.2022 up to 14.00 Hrs. Due date for submission of Bid 31.10.2022 up to 15.00 Hrs, Technical bid opening 31.10.2022 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
సమగ్ర శిక్షా
స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీస్, KBC బాయ్స్ హైస్కూల్ క్యాంపస్, రైతు బజార్ ఎదురుగా, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్
టెండరు ప్రకటన
e-procurement Notice No.SS-16/34/2022-CMO SEC-SSA, తేది: 10.10.2022
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ వారు 2023-24 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ/ MPP/ ZPP/ మున్సిపల్/ KGBVs/ మోడల్ స్కూల్స్/ ఆశ్రమ పాఠశాలలు/ రెసిడెన్షియల్/ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్స్ యొక్క ఎయిడెడ్ స్కూల్స్‌లో తరగతులు I నుండి X వరకు విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు (సుమారుగా 41.38 లక్షల మంది) అందరికీ **"జగనన్న విద్యా కానుక"** పథకం క్రింద యూనిఫామ్ క్లాత్ సరఫరా కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరుతున్నారు. వివరాల కోసం 11-10-2022 నుండి దర్శించండి https://tender.apeprocurement.gov.in. టెండర్/RFP ఫారంను వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అర్హత గల సంస్థలు పైన తెలిపిన వెబ్‌సైట్‌లో ఇచ్చిన షెడ్యూల్స్ ప్రకారం నిర్ణీత నమూనా అప్‌లోడ్ చేయవలసిందిగా కోరబడుతున్నారు. సంప్రదించవలసిన నం.:0866-2428599.
సం/- స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్
DIPR RO No.1298PP/CL/Advt/1/1/2021-22, Dt:10.10.2022

భూముల రీసర్వే గడువు పెంచాలి

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే, భూహక్కు పత్రాల అందజేత (రీసెటిల్‌మెంట్)కు నిర్దేశించిన గడువును మరో మూడు మాసాలు పెంచాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లాలో జరుగుతున్న రీసర్వేను ఆయన ఇందుకూరుపేట పరిసరాల్లో పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఏపీఆర్ఎస్ఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులుగా తాము రీసర్వేను స్వాగతిస్తున్నామన్నారు. ప్రతి 20 ఏళ్లకో దఫా జరగాల్సిన రీసర్వేను 100 ఏళ్ల తరువాత ప్రభుత్వం మంచి ఉద్దేశంతో చేస్తోందని తెలిపారు. 90 రోజుల్లో రీసర్వే, రీసెటిల్‌మెంట్ చేయమని టార్గెట్లు విధించారని, ఫీల్డ్ లెవల్‌లో అనేక సమస్యలున్నాయన్నారు. సర్వే ఒక దఫా, మరో దఫా రిజిస్టర్‌లో నమోదు చేసి హక్కు కల్పించడం చేయాల్సి ఉండగా.. ఏక కాలంలో ఈ పనులు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో ఉద్యోగుల్లో ఒత్తిడి పెరిగిందన్నారు. హడావుడిగా చేస్తే తప్పులు జరిగే అవకాశం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
O/o. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
రిఫ్ నెం. బి1/48/2022 — **ఫారమ్ నెం.VII** — తేది : 06-10-2022
(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్-1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం మండలం తల్లవరం మరియు తూటిగుంట గ్రామములో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాసితులకు బుట్టాయిగూడెం మండలం గణపవరం గ్రామం నందు ఆర్ అండ్ ఆర్ కాలనీ కేటాయించినందున సదరు నిర్వాసితులకు స్మశానం కేటాయించు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2018-19నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువ సుదహరించిన షెడ్యూల్లు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం మండలం తల్లవరం మరియు తూటిగుంట గ్రామములో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాసితులకు బుట్టాయిగూడెం మండలం గణపవరం గ్రామం నందు ఆర్ అండ్ ఆర్ కాలనీ కేటాయించినందున సదరు నిర్వాసితులకు స్మశానం నిర్మాణం కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ప.గో. — మండలం : బుట్టాయిగూడెం — గ్రామం : గణపవరం

క్రమ సంఖ్య	సర్వే నెం/ స.డి.నెం.	మొత్తం విస్తీర్ణం	సేకరించిన విస్తీర్ణం	వర్గీకరణ	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1	241/2	22.81	2.60	న.పుంజ	పునులూరి లీలావతి భర్త కృష్ణారావు	రిసెం.న. 241/1	రిసెం.న. 242,243	రిసెం.న. 238	రిసెం.న. 249	రేగు-1 తాడి-35
2	243/1	7.10	1.90	న.పుంజ	పునులూరి లీలావతి భర్త కృష్ణారావు	రిసెం.న. 241	రి.సెం.న. 243/2	రి.సెం.న. 242	రి.సెం.న. 244	వేప-3 కుంకుడు-2
	మొత్తం		4.50							

ఈ భూముల ప్లాను శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. చట్టములోని అంశములను అనుసరించి, ఈ ప్రతిపాదిత భూసేకరణ జరిగిన ఆర్ అండ్ ఆర్ గ్రామము నందు నూతన భూసేకరణ మరియు పునరావాస పునఃస్థాపన న్యాయమైన, పారదర్శక నష్టపరిహారం పొందే హక్కు చట్టము, 2013 అనుసరించి, ఇంటింటికి వెళ్ళి సర్వే జరిపి ఇందు అర్హులైన నిర్వాసిత కుటుంబములు గాని, ప్రభావిత కుటుంబములు లేవని నివేదిక ఆధారంగా నిర్ధారించడమైనది.

బొగ్గుగనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గానీ లేదా ఒక ప్రత్యేక భాగములో గానీ ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గానీ తొలగించుట గానీ చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** I.A.S., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
O/o. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
రిఫ్ నెం. బి1/72/2022 — **ఫారమ్ నెం.VII** — తేది : 06-10-2022
(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్-1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం మండలం కొత్తమామిడిగొంది గ్రామములో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాసితులకు జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామం నందు ఆర్ అండ్ ఆర్ కాలనీ కేటాయించినందున సదరు నిర్వాసితులకు స్మశానం కేటాయించు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2018-19నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువ సుదహరించిన షెడ్యూల్లు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం మండలం కొత్తమామిడిగొంది గ్రామములో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాసితులకు జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామం నందు ఆర్ అండ్ ఆర్ కాలనీ కేటాయించినందున సదరు నిర్వాసితులకు స్మశానం నిర్మాణం కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ప.గో. — మండలం : జీలుగుమిల్లి — గ్రామం : కామయ్యపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెం/ స.డి.నెం.	మొత్తం విస్తీర్ణం	సేకరించిన విస్తీర్ణం	వర్గీకరణ	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1	197/2	3.26	1.00	న.పుంజ	ఆరేపల్లి రాములు	రి.న.నెం. 197/1, 212	రి.న.నెం. 196	రి.న.నెం. 198	రి.న.నెం. 197/1	
	మొత్తం		1.00							

ఈ భూముల ప్లాను శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. చట్టములోని అంశములను అనుసరించి, ఈ ప్రతిపాదిత భూసేకరణ జరిగిన ఆర్ అండ్ ఆర్ గ్రామము నందు నూతన భూసేకరణ మరియు పునరావాస పునఃస్థాపన న్యాయమైన, పారదర్శక నష్టపరిహారం పొందే హక్కు చట్టము, 2013 అనుసరించి, ఇంటింటికి వెళ్ళి సర్వే జరిపి ఇందు అర్హులైన నిర్వాసిత కుటుంబములు గాని, ప్రభావిత కుటుంబములు లేవని నివేదిక ఆధారంగా నిర్ధారించడమైనది.

బొగ్గుగనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గానీ లేదా ఒక ప్రత్యేక భాగములో గానీ ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గానీ తొలగించుట గానీ చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** I.A.S., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
O/o. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
రిఫ్ నెం. బి1/74/2022 — **ఫారమ్ నెం.VII** — తేది : 06-10-2022
(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్-1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం మండలం శివగిరి గ్రామములో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాసితులకు జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామం నందు ఆర్ అండ్ ఆర్ కాలనీ కేటాయించినందున సదరు నిర్వాసితులకు స్మశానం కేటాయించు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2018-19నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువ సుదహరించిన షెడ్యూల్లు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం మండలం తల్లవరం గ్రామములో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాసితులకు జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామం నందు ఆర్ అండ్ ఆర్ కాలనీ కేటాయించినందున సదరు నిర్వాసితులకు స్మశానం నిర్మాణం కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ప.గో. — మండలం : జీలుగుమిల్లి — గ్రామం : రాచన్నగూడెం

క్రమ సంఖ్య	సర్వే నెం/ స.డి.నెం.	మొత్తం విస్తీర్ణం	సేకరించిన విస్తీర్ణం	వర్గీకరణ	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1	75/05	8.24	1.50	న.పుంజ	గెడ్డం సత్యనారాయణ తండ్రి రామకోటి	రి.న.నెం. 70, 75/1ఎ	రి.న.నెం. 75/1ఎ	రి.న.నెం. 75/1ఎ	రి.సం.నెం. 69	తాడి-21 (పెద్దవి) తాడి-7 (చిన్నవి) బోరు-1
	మొత్తం		1.50							

ఈ భూముల ప్లాను శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. చట్టములోని అంశములను అనుసరించి, ఈ ప్రతిపాదిత భూసేకరణ జరిగిన ఆర్ అండ్ ఆర్ గ్రామము నందు నూతన భూసేకరణ మరియు పునరావాస పునఃస్థాపన న్యాయమైన, పారదర్శక నష్టపరిహారం పొందే హక్కు చట్టము, 2013 అనుసరించి, ఇంటింటికి వెళ్ళి సర్వే జరిపి ఇందు అర్హులైన నిర్వాసిత కుటుంబములు గాని, ప్రభావిత కుటుంబములు లేవని నివేదిక ఆధారంగా నిర్ధారించడమైనది.

బొగ్గుగనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గానీ లేదా ఒక ప్రత్యేక భాగములో గానీ ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గానీ తొలగించుట గానీ చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** I.A.S., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

శివసేన రెండు వర్గాలకు వేర్వేరు పేర్లు

ముంబై: శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గాన్ని 'శివసేన–ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే'గా గుర్తించడంతోపాటు ఆయన వర్గానికి మండుతున్న కాగడా గుర్తును ఎన్నికల సంఘం సోమవారం కేటాయించింది. సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని 'బాలాసాహెబంచి శివసేన'గా పేర్కొంది. మత విశ్వాసాలతో సంబంధమున్నందున త్రిశూలం, గద గుర్తులను ఏ వర్గానికీ ఇవ్వడం లేదని పేర్కొంది. ఉదయించే సూర్యుడు గుర్తు డీఎంకేకు ప్రత్యేకించినట్లు తెలిపింది. మంగళవారం ఉదయం 10 గంటల్లోగా వేరే గుర్తులతో జాబితాను ఇవ్వాలని షిండే వర్గాన్ని ఆదేశించింది. తమ వర్గం పేరు, గుర్తు కేటాయింపులపై ఠాక్రే వర్గం హర్షం వ్యక్తం చేసింది. తాము కోరుకున్నట్లుగానే ఉద్ధవ్, బాలాసాహెబ్, ఠాక్రే పేర్లు ఇందులో ఉన్నాయని తెలిపింది.

క్లుప్తంగా...

గుజరాత్‌పై అర్బన్ నక్సల్స్ కన్ను: మోదీ

బరూచ్(గుజరాత్): కొత్త రూపంలో అర్బన్ నక్సల్స్ తొలిసారిగా గుజరాత్‌లో అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గుజరాత్ పర్యటనలో ఉన్న మోదీ బరూచ్ జిల్లాలో దేశంలోనే తొలి బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. 'అర్బన్ నక్సల్ కన్ను గుజరాత్‌పై పడింది. శక్తియుక్తులున్న గుజరాతీ అమాయక ఆదివాసీ యువతను వారు లక్ష్యంగా చేసుకుందామనుకుంటున్నారు. అయితే వీరి ఆటలు ఇక్కడ సాగవు. వారిని రాష్ట్రం తరిమికొడుతుంది' అని మోదీ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తొలిసారిగా గుజరాత్ ఎన్నికల బరిలో దిగుతున్న నేపథ్యంలో ఆప్‌నుద్దేశిస్తూ మోదీ ఈ పరోక్ష వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రాష్ట్రంలో నర్మదా నదిపై సర్దార్ సరోవర్ డ్యామ్‌ను మేధాపాట్కర్ వంటి వారు అడ్డుకోవడాన్ని అభివృద్ధి నిరోధక అర్బన్ నక్సలైట్లుగా గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ అభివర్ణించారు. మేధా పాట్కర్ గతంలో ఆప్ టికెట్‌పై పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలయ్యారు. బరూచ్ ఫార్మా పార్క్ అందుబాటులోకి వచ్చాక బల్క్ డ్రగ్స్‌లో భారత్ స్వావలంబన సాధిస్తుందని మోదీ అన్నారు.

పటేల్ ఏకంచేశారు. కానీ నెహ్రూ..

గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాలో సోమవారం ర్యాలీలో మోదీ మాట్లాడారు. 'సర్దార్ పటేల్ సంస్థానాలన్నింటినీ దేశంలో విలీనం చేశారు. కానీ ఒక్క వ్యక్తి జమ్మూకశ్మీర్ అంశాన్ని నెత్తినేసుకుని ఎటూ తేల్చకుండా వదిలేశారు' అని నెహ్రూపై విమర్శలు చేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న కశ్మీర్ సమస్యను పటేల్ స్ఫూర్తితో పరిష్కరించి ఆయనకు నివాళులర్పించానన్నారు.

మధ్యాహ్న భోజనం ఖర్చును పెంచిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం ధరలను పెంచింది. రెండేళ్ల విరామం అనంతరం ఒక్కో విద్యార్థిపై గతంలో అందిస్తున్న వంట ఖర్చు(ఆహార దినుసులు, గ్యాస్ తదితరాలు కలిపి)ను 9.6 శాతం మేర పెంచింది. 2020లో చివరిసారి వంట ఖర్చును పెంచిన సమయంలో ప్రాథమిక తరగతి (1–4వ తరగతి వరకు)లో ఒక్కో చిన్నారికి భోజనానికి రోజుకు రూ.4.97 చెల్లించగా, దానిని ఇప్పుడు రూ.5.45కు సవరించింది. ప్రాథమికోన్నత (6– 8వ తరగతి వరకు) స్థాయిలో భోజనం ఖర్చు రూ.7.45 నుంచి రూ.8.17కు పెంచుతూ కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న 11.20 లక్షల ప్రభుత్వం, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 11.80 కోట్ల విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. పెంచిన ధరలు ఈ ఏడాది అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చాయని కేంద్రం రాష్ట్రాలకు లేఖలు రాసింది. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తితో నిధులు సమకూరుస్తాయి. 2022–23 బడ్జెట్‌లో కేంద్రం ఈ పథకానికి రూ.10,233 కోట్లు కేటాయించగా, రాష్ట్రాలు రూ.6,277 కోట్లు ఖర్చు చేయనున్నాయి. కేంద్రంపై అదనంగా రూ.600 కోట్ల భారం పడనుందని సమాచారం.

జడివానలోనూ 'జోడో'



తుమకూరులో ములాయంకు రాహుల్ నివాళి

తుమకూరు: పెద్దలకు పలకరింపులు, అక్కడక్కడా హారతులు, పిల్లలతో ముచ్చట్లతో కర్ణాటకలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర కొనసాగుతోంది. వర్షంలోనూ ఆయన యాత్ర కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు తుమకూరు జిల్లా బరకనహాల్ గేట్ వద్ద నుంచి రాహుల్ నడక ఆరంభమైంది. ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు వెంట వచ్చారు. హులియురు వద్ద గిరిజన మహిళలు ఆయనకు హారతి ఇచ్చారు. అనంతరం వారు పాదయాత్రలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు కెంబెరె వద్ద రాహుల్ టిఫిన్ చేసి కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. తరువాత ప్రారంభించి సాయంత్రం 6 గంటలకు పొరుగున ఉన్న చిత్రదుర్గం జిల్లాలోకి అడుగుపెట్టారు. హిరియూరు వైపు యాత్ర సాగింది. హిరియూరు వద్ద జడివాన కురుస్తున్నప్పటికీ నడకను ఆపలేదు. కార్యకర్తలను ఉత్సాహపరచడానికి పలుచోట్ల నేతలతో కలిసి పరుగులు తీశారు.



శాకాహార మొసలి సాయుజ్యం

కాసర్గోడ్(కేరళ): అదో శాకాహార మొసలి. తన జాతి లక్షణానికి పూర్తి విరుద్ధంగా అత్యంత శాంతమూర్తిగా జీవించింది. కేరళలోని కాసర్గోడ్ జిల్లాలో కుంబ్లాలోని అనంత పద్మనాభస్వామి ఆలయానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తూ వచ్చింది! ఒకటీ రెండూ కాదు, ఏకంగా 75 ఏళ్లకు పైగా రోజుకు రెండు సార్లు కేవలం బియ్యం, బెల్లంతో స్వామికి నివేదించిన ప్రసాదమే తిని బతికింది. వేళకు బుద్ధిగా వచ్చి పూజారి చేతుల మీదుగా ప్రసాదం తింటూ అందరినీ అలరించేది. ఆలయ కొలనులో నిత్యం అటూ ఇటూ తిరుగుతూ సందడి చేసేది. అప్పుడప్పుడూ ఆలయంలోకి వచ్చేసేది. ఎందరున్నా లక్ష్యపెట్టకుండా ఒక్కోసారి గర్భగుడి దాకా కూడా వెళ్లేది. కాసేపు అక్కడే గడిపి కొలనులోకి వెళ్లిపోయేది. ఇన్నేళ్లలోనూ ఆగ్రహంగా ప్రవర్తించింది గానీ, పొరపాటునైనా ఎవరికీ ఇసుమంతైనా హాని చేసింది గానీ లేదు. భక్తులంతా దాన్ని మహా భక్తిపరురాలైన దివ్య మొసలిగా భావించి గౌరవించేవారు. బాబియా అంటూ ముద్దుగా పిలుచుకునేవాళ్లు. ఆలయ పూజారులు తరచూ కొలనులో దాన్ని ముద్దు చేస్తుండేవాళ్లు. అసలది కొలనులోకి ఎలా వచ్చి చేరిందన్నది కూడా మిస్టరీయేనంటారు. 1945లో ఓ బ్రిటిష్ అధికారి ఆలయ కొలనులో ఓ మొసలిని కాల్చిచంపాడని స్థానికులు చెబుతారు. తర్వాత కొద్ది రోజులకే కొలనులో బాబియా ప్రత్యక్షమైందట.

అలా తన ప్రశాంత చిత్తంతో అందరినీ అలరిస్తూ వచ్చిన బాబియా ఆదివారం రాత్రి మరణించింది. సోమవారం కొలనులో దాని కళేబరం పైకి తేలుతూ కన్పించింది. దాంతో భక్తులంతా తీవ్ర విచారంలో మునిగిపోయారు. కడసారి చూపు కోసం వందలాదిగా తరలి వచ్చారు. అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి ప్రేమను చాటుకున్నారు. పాడెపై మోసుకెళ్లి అంతిమసంస్కారం నిర్వహించారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే మొదలుకుని అసంఖ్యాక అభిమానులు సోషల్ మీడియాలో బాబియాకు నివాళులర్పించారు. తిరువనంతపురంలోని ప్రపంచ ప్రఖ్యాత పద్మనాభస్వామి ఆలయానికి కాసర్గోడ్‌లోని ఈ అనంతపద్మనాభస్వామే మూలమని చెబుతుంటారు. ఈ స్వామికి రక్షణగా బాబియా పహారా కాసేదని భక్తుల నమ్మకం.



కాసర్గోడ్ అనంత పద్మనాభ స్వామి ఆలయం



ఆస్పత్రిలో ములాయం పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న అమిత్ షా

రాజకీయ మల్లుడు

ములాయం ఇక లేరు

రాష్ట్రపతి, ప్రధాని తదితరుల సంతాపం.. నేడు అంత్యక్రియలు

గురుగ్రాం/లఖ్‌నవూ/న్యూఢిల్లీ: రాజకీయ మల్లుడు, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ (82) ఇక లేరు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ఆగస్టు నుంచి ఆస్పత్రిలోనే ఉన్నారు. ఆరోగ్యం బాగా క్షీణించడంతో అక్టోబర్ 2న గురుగ్రాంలోని మేదాంత ఆస్పత్రిలో ఐసీయూలో చేర్చారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలియగానే అమిత్ షా హుటాహుటిన మేదాంత ఆస్పత్రికి చేరుకున్నారు. ఆయన కుమారుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, ఇతర కుటుంబీకులను ఓదార్చారు. అనంతరం భౌతికకాయాన్ని యూపీ ఇటావా జిల్లాలోని ములాయం స్వగ్రామం సైఫైకి తరలించారు. అభిమాన నేత కడసారి చూపు కోసం జనం భారీగా తరలి వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. ములాయం మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు పలువురు రాజకీయ తదితర ప్రముఖులు దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. అతి సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన ములాయం సాధించిన ఘనతలు అసమానమంటూ ముర్ము కొనియాడారు. ''ఆయన భూమి పుత్రుడు. అన్ని పార్టీల మన్ననలూ పొందారు. ఆయన కుటుంబానికి, మద్దతుదారులకు నా ప్రగాఢ సానుభూతి'' అంటూ ట్వీట్ చేశారు.

సంతాపాల వెల్లువ

1939 నవంబర్ 22న యూపీలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ములాయం యాదవ్ దేశ రాజకీయాల్లో ప్రముఖ నేతగా ఎదిగారు. ఏకంగా 10 సార్లు ఎమ్మెల్యేగా, ఏడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు! 1996–98 మధ్య రక్షణ మంత్రిగా పని చేశారు. 1989–91, 1993–95, 2003–07 మధ్య మూడుసార్లు యూపీ సీఎంగా చేశారు. ఆయన మృతి భారత రాజకీయాలకు తీరని లోటని కాంగ్రెస్, బీజేపీ పేర్కొన్నాయి. ములాయం అట్టడుగు నుంచి ఎదిగిన నేత అని బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీ (92) అన్నారు. ఆయనతో సైద్ధాంతిక విభేదాలున్నా పరస్పరం ఎంతగానో గౌరవించుకునే వాళ్లమని గుర్తు చేసుకున్నారు. 1990లో అద్వానీ రథయాత్ర సందర్భంగా యూపీ సీఎంగా ఉన్న ములాయం ఆ యాత్రను తీవ్రంగా వ్యతిరేకించడం, దాన్ని అడ్డుకుని తీరతానంటూ ప్రతిజ్ఞ చేయడం తెలిసిందే. సోషలిస్టు ఉద్యమానికి ములాయం చిరునామాగా నిలిచారంటూ మాజీ ప్రధానులు దేవెగౌడ, మన్మోహన్‌సింగ్ ప్రస్తుతించారు. ఆయన మృతితో సోషలిస్టు గళం మూగవోయిందంటూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆవేదన వెలిబుచ్చారు. మతవాద శక్తులను ములాయం ఆజన్మాంతం ఎదిరించారంటూ ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కొనియాడారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కూడా ములాయంకు ఘనంగా నివాళులర్పించారు. భారత్ జోడో యాత్రలో ఉన్న ఆయన కర్నాటకలో యాత్ర మధ్యలోనే ములాయం సంతాప సభ నిర్వహించారు. ఆయన నిజమైన యోధుడంటూ కీర్తించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర సింగ్ చౌధురి తదితరులు సైఫైలో ములాయం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అఖిలేశ్ తదితరులను ఓదార్చారు. ముఖ్యమంత్రులు కేసీఆర్, నితీశ్‌కుమార్, పినరయి విజయన్, బసవరాజ్ బొమ్మై, ఎంకే స్టాలిన్‌తో పాటు సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజా, బీఎస్పీ చీఫ్ మాయావతి తదితరులు కూడా సంతాపం తెలిపారు. భారత రాజకీయాల్లో ప్రముఖ నేతగా ములాయం కొనసాగారంటూ ఆరెస్సెస్ నేత సునీల్ అంబేడ్కర్ ట్వీట్ చేశారు.

మాది సన్నిహిత బంధం: మోదీ

ములాయం చిత్తశుద్ధితో ప్రజాసేవ చేసిన అరుదైన నాయకుడంటూ మోదీ కొనియాడారు. ''లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, రాం మనోహర్ లోహియా భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు ఆయన జీవితాన్ని అంకితం చేశారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిలో ముందువరుసలో నిలుస్తారు. యూపీతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ ములాయంది కీలక పాత్ర. రక్షణ మంత్రిగా దేశాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. ఆయనతో నాది సన్నిహిత బంధం. ఆయన యూపీకి, నేను గుజరాత్‌కు సీఎంగా ఉండగా ఎన్నోసార్లు కలుసుకున్నాం. పలు అంశాలపై ఆయన అభిప్రాయాలను ఆసక్తిగా వినేవాన్ని'' అన్నారు.





లక్నో: సుశిక్షితుడైన మల్లయోధుడు. రాజకీయాల్లో కాకలుతీరిన వ్యూహకర్త. హిందుత్వ వ్యతిరేక రాజకీయాలకు చిరకాలం పాటు కేంద్ర బిందువు. జాతీయ స్థాయిలో విపక్ష రాజకీయాల్లో కీలక పాత్రధారి. ఇలా బహుముఖీన వ్యక్తిత్వం ములాయంసింగ్ యాదవ్ సొంతం. ఓ సాధారణ రైతు బిడ్డగా మొదలైన ఆయన ప్రస్థానం ప్రధాని పదవికి పోటీదారుగా నిలిచేదాకా సాగింది. దశాబ్దాల పాటు దేశ రాజకీయాల్లో ప్రముఖ నేతగా వెలుగొందినా, ఈ రాజకీయ మల్లునికి యూపీయే ప్రధాన రాజకీయ వేదికగా నిలిచింది. సోషలిస్టుగానే కొనసాగినా రాజకీయాల్లో ఎదిగేందుకు అందివచ్చిన అవకాశాలను రెండు చేతులా అందిపుచ్చుకోవడంలో ములాయం ఏనాడూ వెనకాడలేదు. యూపీలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రధాన ప్రత్యర్థి అయిన బీఎస్పీతో పాటు కాంగ్రెస్‌తోనూ పొత్తుకు సై అన్నారు! రాజకీయంగా గాలి ఎటు వీస్తోందో గమనిస్తూ తదనుగుణంగా వైఖరి మార్చుకుంటూ వచ్చారు. తొలినాళ్లలో లోహియాకు చెందిన సంయుక్త సోషలిస్టు పార్టీ, చరణ్‌సింగ్ భారతీయ క్రాంతిదళ్, భారతీయ లోక్‌దళ్, సమాజ్‌వాదీ జనతా పార్టీ తదితరాల్లో కొనసాగినా, 1992లో సమాజ్‌వాదీ పార్టీని స్థాపించినా ఈ సూత్రాన్నే అనుసరించారు.

లోహియా అనుయాయి...

ములాయం టీనేజీ దశలోనే సోషలిస్టు దిగ్గజం రామ్ మనోహర్ లోహియా సిద్ధాంతాల పట్ల ఆకర్షితులయ్యారు. విద్యార్థి ఉద్యమాల్లో ముమ్మరంగా పాల్గొన్నారు. పొలిటికల్ సైన్స్‌లో పట్టభద్రుడై కొంతకాలం అధ్యాపకునిగా పని చేశారు. 1967లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఉండగా ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం గడిపారు. అనంతరం లోక్‌దళ్ యూపీ విభాగానికి అధ్యక్షుడయ్యారు. పార్టీలో చీలిక నేపథ్యంలో చీలిక వర్గానికి రాష్ట్ర చీఫ్‌గా కొనసాగారు. యూపీ అసెంబ్లీలో, మండలిలో విపక్ష నేతగా పని చేశారు. బీజేపీ బయటినుంచి మద్దతుతో జనతాదళ్ నేతగా 1989లో తొలిసారిగా యూపీ సీఎం పదవి చేపట్టారు. 1993లో బీఎస్పీ మద్దతుతో మరోసారి సీఎం అయినా కొంతకాలానికి ఆ పార్టీ మద్దతు ఉపసంహరించడంతో ములాయం సర్కారు కుప్పకూలింది. అనంతరం ఆయన జాతీయ రాజకీయాలపై దృష్టి సారించారు. మెయిన్‌పురి నుంచి 1996లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. యునైటెడ్ ఫ్రంట్ పేరుతో కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వ ఏర్పాటుకు విపక్షాలు ప్రయత్నించిన సమయంలో ప్రధాని అభ్యర్థిగా ఆయన పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది. చివరికి హెచ్‌డీ దేవెగౌడ ప్రధాని కాగా ఆయన ప్రభుత్వంలో ములాయం రక్షణ మంత్రిగా పని చేశారు.

వివాదాలూ మరకలూ...

మలినాళ్ల ప్రస్థానంలో ములాయం ఎన్నో ఎగుడుదిగుళ్లు చవిచూశారు. పలు వివాదాస్పద వ్యాఖ్యలతో విమర్శలూ మూటగట్టుకున్నారు. యూపీలో సమాజ్‌వాదీ పార్టీకి బీజేపీయే ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న నేపథ్యంలో 2019లో ఏకంగా పార్లమెంటులోనే ప్రధాని మోదీపై పొగడ్తలు కురిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. మోదీ తిరిగి అధికారంలోకి రావాలంటూ ఆకాంక్షించిన తీరు విశ్లేషకులను కూడా విస్మయపరిచింది. రేప్ కేసుల్లో మరణశిక్షలను వ్యతిరేకించే క్రమంలో 'అబ్బాయిలన్నాక తప్పులు చేయడం సహజం' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి విమర్శలపాలయ్యారు. కుటుంబ పోరు ముదిరి 2017లో అఖిలేశ్ పార్టీ పగ్గాలు చేపట్టినా అభిమానుల దృష్టిలో చివరిదాకా 'నేతాజీ'గానే ములాయం నిలిచిపోయారు!

అసెంబ్లీకి బాటలు వేసిన 'కుస్తీ'!

స్వయంగా మల్లయోధుడైన ములాయంకు కుస్తీ పోటీలంటే ఎంతో మక్కువ. మల్లయోధులుగా తర్ఫీదు పొందే యువకులను ఎంతగానో ప్రోత్సహించేవారు. కుస్తీ ప్రావీణ్యమే ములాయంకు తొలిసారి ఎమ్మెల్యే టికెట్ తెచ్చిపెట్టడం విశేషం. జస్వంత్‌నగర్ సిట్టింగ్ ఎమ్మెల్యే, సోషలిస్ట్ పార్టీ నేత నాథూసింగ్ ఒకసారి ములాయంతో కుస్తీకి దిగారు. ఆయన తనతో తలపడ్డ తీరుకు నాథూసింగ్ ఎంతగానో ముచ్చటపడ్డారు. 1967 ఎన్నికల్లో తనకు బదులుగా జస్వంత్‌నగర్ నుంచి సోషలిస్టు పార్టీ తరఫున బరిలో దిగాల్సిందిగా కోరారు. అందుకు ములాయం సరేననడం, ఎన్నికల్లో గెలిచి మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టడం చకచకా జరిగిపోయాయి.

సోనియా 'ప్రధాని' ఆశలకు గండికొట్టారు

1999లో వాజ్‌పేయి ప్రభుత్వ పతనానంతరం సోనియా ప్రధాని కాకుండా అడ్డుకోవడంలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌తో కలిసి ములాయం ప్రధాన పాత్ర పోషించారు. అప్పటికి ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్‌ను కలిసొచ్చి జోరు మీదున్నారు. మెజారిటీకి అవసరమైన 272 మంది ఎంపీలు తమవద్ద ఉన్నారని, ప్రభుత్వ ఏర్పాటు లాంఛనమేనని మీడియా సాక్షిగా ప్రకటించారు. కానీ 20 మంది ఎంపీల బలమున్న ములాయం మాత్రం సోనియా ప్రధాని అవడాన్ని ఇష్టపడలేదు. సీపీఎం దిగ్గజం జ్యోతిబసు పేరును ప్రతిపాదించి ఆమె ఆశలపై నీళ్లు చల్లారు.

తలాక్‌లపై కేంద్రానికి నోటీసులు

న్యూఢిల్లీ: ఇస్లాంలో తలాక్–ఎ–కినయా, తలాక్–ఎ–బెయిన్‌తో పాటు అన్నిరకాల విడాకులనూ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై స్పందన తెలపాల్సిందిగా కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ మేరకు కేంద్ర న్యాయ, మైనారిటీ వ్యవహారాల శాఖలకు నోటీసులు జారీ చేసింది. కర్నాటకకు చెందిన సయేదా అంబ్రీన్ దాఖలు చేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎ.నజీర్, జస్టిస్ జె.బి. పార్డీవాలాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది.

ముగ్గురికి ఆర్థిక నోబెల్



బెన్ బెర్నాంకీ | డగ్లస్ డబ్ల్యూ. డైమండ్ | ఫిలిప్ హెచ్. డైబ్‌విగ్

స్టాక్‌హోమ్: తీవ్ర ఆర్థికమాంద్యంలో అతలాకుతలమైన అమెరికా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు అహర్నిశలు కృషిచేసిన అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ మాజీ చైర్మన్ బెన్ బెర్నాంకీని ఆర్థికశాస్త్ర నోబెల్ వరించింది. ఆయనతోపాటు బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థలపై కీలక పరిశోధనలు చేసిన మరో ఇద్దరు అమెరికా ఆర్థికవేత్తలు డగ్లస్ డబ్ల్యూ.డైమండ్, ఫిలిప్ హెచ్.డైబ్‌విగ్‌లకు సోమవారం ఆర్థిక నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు. 'బ్యాంక్‌లు కుప్పకూలకుండా చూసుకోవడం మనకు ఏ విధంగా అత్యంత ముఖ్యమైన అంశం' అనే దానిపై ఈ ముగ్గురి శోధన కొనసాగిందని స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్స్‌లోని నోబెల్ కమిటీ పేర్కొంది. ఆర్థికవ్యవస్థలను సంస్కరించాలనే పునాదులను ఈ ముగ్గురు 1980 దశకంలోనే వేశారని ఆర్థిక శాస్త్రాల నోబెల్ కమిటీ అధినేత జాన్ హస్‌లర్ చెప్పారు. 'ఆర్థిక వ్యవస్థను నిట్టనిలువునా కూల్చేసేవి ముఖ్యంగా రెండే. అవి ఆర్థిక సంక్షోభం, ఆర్థికమాంద్యం. వీటి నివారణ, సమర్థవంతంగా ఎదుర్కోవడం అనే వాటిలో వీరి పరిశోధనలు ఎంతగానో సాయపడనున్నాయి' అని హస్‌లర్ అన్నారు. 68 ఏళ్ల బెర్నాంకీ ప్రస్తుతం ఒక బ్రోకింగ్ ఇన్‌స్టిట్యూట్ కోసం పనిచేస్తున్నారు. ఈయన 1930లో అమెరికా చవిచూసిన మహామాంద్యం మూలాలపై పరిశోధన చేశారు. ఆనాడు ఆందోళనకు గురైన జనం ఒక్కసారిగా బ్యాంక్‌ల నుంచి మొత్తం నగదును ఉపసంహరించుకుంటుంటే బ్యాంకింగ్ వ్యవస్థలు కుప్పకూలడం, తదనంతరం ఊహించనిస్థాయికి ఆర్థికవ్యవస్థ కుప్పకూలడం లాంటి వాటిపైనా బెర్నాంకీ పరిశోధన చేశారు. అంతకుముందు షికాగో విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 68 ఏళ్ల డగ్లస్ డైమండ్, సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 67 ఏళ్ల ఫిలిప్ డైబ్‌విగ్‌లు బ్యాంక్ డిపాజిట్లకు ప్రభుత్వం పూచీకత్తుగా ఉంటే సంక్షుభిత ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఎలా నిలబడగలదో అనే అంశాలపై పరిశోధన కొనసాగించారు. బ్యాంకింగ్ వ్యవస్థకు సాయపడేలా 1983లోనే డైమండ్, ఫిలిప్ సంయుక్తంగా 'బ్యాంక్ రన్స్, డిపాజిట్ ఇన్సూరెన్స్, లిక్విడిటీ' రచన చేశారు. బెర్నాంకీ 2007–08 కాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలోపెట్టేందుకు స్వల్పకాలిక వడ్డీరేట్లను సున్నాకు తెచ్చారు. ఈయన నేతృత్వంలో ఫెడ్ రిజర్వ్ తీసుకున్న నిర్ణయాల వల్ల అమెరికా ఆర్థికమాంద్యం నుంచి త్వరగా గట్టెక్కింది. 2020 తొలినాళ్లలో కోవిడ్‌తో కుదేలైన అమెరికా ఆర్థిక వ్యవస్థకు 2020నాటి ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జోరోమ్ పావెల్ సైతం ఇవే నిర్ణయాలను అమలుచేసి వ్యవస్థను మళ్లీ దారిలోపెట్టడం గమనార్హం. 1930నాటి మహామాంద్యం చాలా సంవత్సరాలు తీవ్రస్థాయిలో కొనసాగడానికి గల కారణాలను 1983నాటి పరిశోధనా పత్రంలో బెర్నాంకీ విశదీకరించారు. డిపాజిటర్లు డబ్బంతా బ్యాంక్‌ల నుంచి ఉపసంహరించుకోవడంతో ఆర్థికవ్యవస్థకు కీలకమైన కొత్త రుణాలను మంజూరుచేయలేక బ్యాంక్‌లు కుప్పకూలాయని బెర్నాంకీ కనుగొన్నారు. ఇవి బ్యాంకింగ్ వ్యవస్థను మరింతగా అర్థంచేసుకునేందుకు సాయపడుతున్నాయని నోబెల్ కమిటీ అధినేత హస్‌లర్ అభిప్రాయపడ్డారు.

కీవ్‌పై రష్యా భీకర దాడులు

10 మంది మృతి, 60 మందికి గాయాలు



కీవ్‌లో రష్యా వైమానిక దాడి నుంచి తృటిలో తప్పించుకున్న స్థానికుడు

కీవ్: వ్యూహాత్మకంగా కీలకమైన క్రిమియా వంతెనపై జరిగిన బాంబు పేలుడును ఉగ్ర చర్యగా అభివర్ణించిన రష్యా.. ఉక్రెయిన్ వ్యాప్తంగా సోమవారం వరుసగా రెండో రోజు భీకర దాడులు కొనసాగించింది. కొద్ది నెలలుగా ప్రశాంతంగా ఉన్న రాజధాని కీవ్ సహా నగరాలు పేలుళ్లతో దద్దరిల్లాయి. దాడులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉదయం ఏకధాటిగా నాలుగు గంటలపాటు సైరన్లు మోగాయి. దాడుల్లో కనీసం 10 మంది మృతి చెందగా 60 మంది వరకు గాయపడినట్లు సమాచారం. కీలక ఇంధన, సైనిక వ్యవస్థలను టార్గెట్‌గా గగనతలం, సముద్రం, భూమిపై నుంచి తమ సైన్యం దాడులు సాగించినట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్ ఉగ్రదాడులు కొనసాగిస్తే అందుకు తామిచ్చే జవాబు అత్యంత కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. అంతకుముందు ఆయన సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. మరో పరిణామం..రష్యా, బెలారస్ ఉమ్మడి బలగాలను మోహరించనున్నట్లు బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో ప్రకటించారు. బెలారస్‌పై దాడి చేసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. అయితే, బలగాలను ఎక్కడ మోహరించేదీ లుకషెంకో వివరించలేదు.

దేశంలోని మిగతా ప్రాంతాల్లో పోరాటం కొనసాగుతున్నా రాజధాని కీవ్‌లో జనజీవనం యథాప్రకారం కొనసాగుతోంది. కీవ్ ప్రజలు కొద్ది నెలలుగా ప్రశాంతతకు అలవాటుపడ్డారు. సోమవారం ఉదయం ఆ పరిస్థితి మారిపోయింది. ఒక్కసారిగా మొదలైన సైరన్ల మోతతో జనం ఉలిక్కిపడ్డారు. బాంబు షెల్టర్లలోకి పరుగులు తీశారు. అధికారులు రైలు సర్వీసులను రద్దు చేశారు. జనం రైల్వే స్టేషన్లనే షెల్టర్లుగా చేసుకున్నారు.

కొలీజియంలో విభేదాలు!

- జడ్జీల నియామక ప్రక్రియలో 'సర్క్యులేషన్'పై ఇద్దరు జడ్జీల అభ్యంతరం, తొలిసారి వారి పేర్లను బయటపెట్టిన వైనం

సాక్షి, న్యూఢిల్లీ: కొత్త జడ్జీల నియామకప్రక్రియలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మధ్య సర్వామోదం సన్నగిల్లింది. నూతన జడ్జీల ఎంపికకు సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ లలిత్ చేపట్టిన 'సర్క్యులేషన్' పద్ధతిపై కొలీజియంలోని ఇద్దరు జడ్జీలు భిన్న స్వరం వినిపించడం తెలిసిందే. ఆ ఇద్దరి పేర్లను తొలిసారిగా బహిరంగంగా వెల్లడించడం గమనార్హం. 11 మంది నూతన జడ్జీల నియామకం కోసం సెప్టెంబర్ 26న సీజేఐ జస్టిస్ లలిత్ నేతృత్వంలోని జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ కేఎం జోసెఫ్‌ల కొలీజియం భేటీ జరిగింది. జస్టిస్ చంద్రచూడ్ హాజరుకాలేదు. 10 మంది జడ్జీల నియామక ప్రక్రియ కోసం నలుగురు జడ్జీలకు సీజేఐ లేఖలు రాశారు. తమ అభిప్రాయాలు వ్యక్తపరుస్తూ జస్టిస్ కిషన్ అక్టోబర్ ఒకటిన, జస్టిస్ జోసెఫ్ అక్టోబర్ ఏడున సీజేఐకు ప్రతిలేఖలు రాశారు. లేఖలు రాసే పద్ధతిపై జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ నజీర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అభిప్రాయం తెలపాలని అక్టోబర్ రెండున మరోసారి కోరినా స్పందించలేదు. సాధారణంగా కొలీజియంలో వ్యక్తమయ్యే బేధాభిప్రాయాలు, అభ్యంతరాలు తెలిపిన జడ్జీల పేర్లను వెల్లడించరు. కానీ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ నజీర్ పేర్లను బయటపెడుతూ కొలీజియం ప్రకటన విడుదలచేసింది. ఇక నవంబరు 9న కొత్త సీజేఐ వచ్చాకే కొలీజియం సమావేశం కానుంది. జస్టిస్ దీపాంకర్ గుప్తాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలంటూ ఇప్పటికే కేంద్రానికి సిఫార్సు చేసిన విషయం విదితమే.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 11 । అక్టోబర్ । 2022



మైనర్లపై పోలీసు నిఘా!

మచిలీపట్నంలో లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లపై ట్రాఫిక్ పోలీసులు నిఘా పెట్టారు. అలాంటి వారిని పట్టుకునేందుకు ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. -8లో▸



27,627 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 27,627 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానంలో 24,820 బస్తాలు విక్రయించారు.



టెన్నిస్ పోటీలు ప్రారంభం

విజయవాడలో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సీనియర్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.పట్టాభిరామయ్య తెలిపారు. -8లో▸

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో వివిధ ట్రేడ్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 13వ తేదీన స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్- 2022లో ర్యాంక్ పొందిన విద్యార్థులు, పరీక్ష రాయని వారు కూడా కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 12 తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి వచ్చి దరఖాస్తు అందజేయాలని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం పది గంటలకు కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

ఆర్చరీలో సత్తా చాటిన షణ్ముఖి



లబ్బీపేట (విజయవాడ తూర్పు): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సెప్టెంబర్ 28న ప్రారంభమైన 36వ నేషనల్ గేమ్స్ ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని బి. షణ్ముఖి నాగసాయి సత్తాచాటింది. ఉమెన్స్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా షణ్ముఖి నాగసాయిని సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.


ఆస్రా నేషనల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా తరుణ్ కాకాని



భవానీపురం (విజయవాడ పశ్చిమ): వినియోగదారుల హక్కుల సంస్థ ఆస్రా (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్‌నెస్)కు నేషనల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా కృష్ణా-ఎన్టీఆర్ జిల్లాల అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని నియమితులయ్యారు. ఆయన అమరావతి బోటింగ్ క్లబ్ సీఈఓగా కూడా సేవలు అందిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తి, కన్జ్యూమర్ రిడ్రెస్సల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఆర్.కె.అగర్వాల్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు తరుణ్ కాకాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కృష్ణమ్మ పరవళ్లు

- కృష్ణానదిలో నిరంతరాయంగా నీటి ప్రవాహం
- జూన్ 10 నుంచి కాలువలకు విడుదలవుతున్న సాగునీరు
- జూలై 9న ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తివేత
- ఇప్పటికే 918 టీఎంసీలు సముద్రంలో కలిసిన వైనం



ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. కడలి వైపు వడివడిగా పరుగులు తీస్తోంది. ఈ ఏడాది జూలై 22వ తేదీ నుంచి వరద స్థిరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది జూలై 9వ తేదీన ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తి సముద్రంలోకి నీటిని విడుదల చేశారు. మధ్యలో రెండు సార్లు గేట్లు మూసినా, జూలై 22వ తేదీ నుంచి నిరంతరాయంగా సముద్రంలోకి నీరు కలుస్తూనే ఉంది. గత ఏడాది మొత్తం 501.36 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. ఈ ఏడాది ఇప్పటికే 918 టీఎంసీలను సముద్రంలోకి విడుదల చేశారు. కాలువలకు మరో 100.01 టీఎంసీలు విడుదల చేశారు. కృష్ణమ్మ పొంగి ప్రవహిస్తుండటంతో, పంట కాలువల్లో సైతం కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ ఏడాది ముందస్తుగా అంటే జూన్ 10వ తేదీ నుంచి ప్రభుత్వం కాలువలకు సాగునీరు విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో గత ఏడాది కంటే ముందు గానే వరినాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం కృష్ణా డెల్టా సస్యశ్యామలంగా మారి పచ్చని పంట పొలాలతో కళకళలాడుతోంది. తుపానుల బారిన పడకుండానే వరికోతలు సైతం పూర్తవుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో కడగండ్లే...

టీడీపీ గత ఐదేళ్ల పాలనలో కృష్ణా డెల్టా సాగునీటికి తీవ్ర ఎద్దడి ఎదుర్కొంది. పంట కాలువలకు ఆలస్యంగా సాగునీరు వదిలేవారు. అదీ అరకొరగానే కావడంతో రైతులు పొలాలకు నీటి తడులు ఇచ్చేందుకు ఆయిల్ ఇంజిన్లను ఆశ్రయించాల్సి వచ్చేది. సాగు ఆలస్యం కావడంతో పంట చేతికొచ్చే సమయంలో తుపానులు చుట్టుముట్టి రైతులకు నష్టాలు మిగిల్చేవి. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ప్రకాశం బ్యారేజీకి మళ్లించినా డెల్టా అవసరాలు తీరేవి కావు. ఈ ఏడాది ముందుగానే కాలువలకు నీటి విడుదల చేయడంతో వరినాట్లు పూర్తయ్యాయి. కృష్ణా జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో 3,86,816 ఎకరాల్లో వరి సాగైంది. ఈ ఏడాది 3,95,725 ఎకరాల్లో సాగైంది. 2,11,398 మంది రైతులకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ సైతం పూర్తయింది. నవంబర్ మొదటి వారంలో వరి కోతలు మొదలు కానున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లను సైతం చేస్తోంది.


సాగునీరు పుష్కలం



కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు పుష్కలంగా నీటిని విడుదల చేస్తున్నాం. ఇంత వరకు పట్టిసీమ పంపులను ఆన్ చేయాల్సిన అవసరం రాలేదు. కృష్ణా నదిలో జూన్ నుంచీ ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. కాలువలకు అవసరమైన మేర నీరు విడుదల చేస్తున్నాం. చివరి ఆయకట్టుకూ ఇబ్బంది లేకుండా నీటిని పంపిణీ చేస్తున్నాం. అదనపు జలాలను సముద్రంలోకి వదులుతున్నాం.

– తిరుమలరావు, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, విజయవాడ

ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల ఇలా.. (టీఎంసీల్లో)



విజయవాడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అదితి సింగ్



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు మొక్క అందజేస్తున్న సబ్ కలెక్టర్ అదితి సింగ్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): విజయవాడ డివిజన్ సబ్ కలెక్టర్‌గా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అదితి సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొందిన ఆమెను రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం అదితి సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. విజయవాడ డివిజన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న నవరత్నాలను ప్రజలకు మరింత చేరువ చేస్తానని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత లక్ష్యం లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

కలెక్టర్‌తో మర్యాదపూర్వక భేటీ

సబ్ కలెక్టర్‌గా నియమితులైన అదితి సింగ్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిరుపేదలకు చేరువ చేసేందుకు కృషి చేయాలని సబ్‌కలెక్టర్‌కు కలెక్టర్ సూచించారు. ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పక్కా ఏర్పాట్లు

- ఈ నెల 19న అవనిగడ్డకు సీఎం వైఎస్ జగన్
- విజయవంతం చేయాలని కృష్ణా కలెక్టర్ రంజిత్ బాషా పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా చిత్రంలో ఎస్పీ జాషువా

చిలకలపూడి(మచిలీపట్నం): అవనిగడ్డలో ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో పక్కా ఏర్పాట్లు చేయాలని కృష్ణా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా ఎస్పీ పి. జాషువాతో కలిసి సమీక్ష నిర్వహించారు.

కండిషనల్ పట్టాల సమస్య కొలిక్కి..

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చాలా కాలంగా కండిషనల్ పట్టాల సమస్య, రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో సుమారు 25 వేల ఎకరాలు, కృష్ణాజిల్లా పరిధిలో 18 వేల ఎకరాల్లో సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. మచిలీపట్నం, గుడివాడ, నాగాయలంక మండలాల్లో ఈ సమస్య ఉన్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. జిల్లాలో షరతులు కలిగిన పట్టాలు 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమాన్ని అవనిగడ్డలో 19వ తేదీన లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్ల గురించి వివిధ శాఖల అధికారులకు విధులు కేటాయించామన్నారు. అవనిగడ్డలోని డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అక్కడ ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసి 20 మంది లబ్ధిదారులతో ముఖ్యమంత్రి పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్, హెలీప్యాడ్ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ పి. జాషువా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమంపై భద్రత ఏర్పాట్లను వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, బందరు ఆర్డీవో ఐ. కిషోర్, ఏఎస్పీ రామాంజనేయులు, డీఎస్‌వో కె పార్వతి, సీపీవో శ్రీలత తదితర అధికారులు పాల్గొన్నారు.

సత్వరం సమస్యలు పరిష్కరించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- స్పందనలో 119 అర్జీల స్వీకరణ



అర్జీదారుల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్, డీఆర్వో మోహన్‌కుమార్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. స్పందనలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 119 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. స్పందనలో అర్జీదారుల నుంచి స్వీకరించిన సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కరించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ పెండింగ్ ఉండకూడదని స్పష్టంచేశారు. అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, సర్వే సెటిల్మెంట్ వంటి ప్రధాన శాఖలకు సంబంధించి ఎక్కువ అర్జీలు నమోదవుతున్నాయని తెలిపారు. ఆయా శాఖల అధికారులు ఆ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడటం వల్ల తమ సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం బాధితులకు కలుగుతుందన్నారు. ఇతర శాఖలతో ముడిపడి ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఆయా శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అర్జీదారులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, డ్వామా పీడీ సునీత, హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఈఓ సి.వి.రేణుక, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్ఐసీ ప్రారంభం



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): స్థానిక కలెక్టరేట్ ఆవరణలో నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)ను జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఐటీ సేవలు అందించడం, డిజిటల్ ఇండియా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయలను కల్పించడం ఎన్ఐసీ ప్రధాన బాధ్యతని పేర్కొన్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ద్వారా జిల్లాకు చెందిన వెబ్ సైట్ నిర్వహణ, వివిధ శాఖల్లో ఈ-ఆఫీస్, సాంకేతిక సేవలను అందించడం, సాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో ఎన్ఐసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ అక్కినేని వెంకటేశ్వరరావు, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ కె.సూర్యారావు, కలెక్టరేట్ ఏఓ ఇంతియాజ్ పాషా పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు రూట్ మ్యాప్

చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామాల్లో ప్రతి ఇంటికీ వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుపై వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50 పీహెచ్‌సీలు ఉన్నాయని, ఒక్కొక్క పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉంటారని పేర్కొన్నారు. ఒకరు పీహెచ్‌సీలో ఓపీ వైద్యసేవలకు, మరొకరు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. జిల్లాలో 104 సర్వీసు వాహనాలు 25 ఉన్నాయని వీటిని అన్ని పీహెచ్‌సీలకు మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ఆశా, ఏఎన్ఎంలతో కూడిన వైద్యబృందాలు ఈ వాహనాల ద్వారా రోజు విడిచి రోజు గ్రామాలకు వెళతారన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి అనారోగ్య సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకోవాలన్నారు. వారికి వైద్యసేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో సాధారణ ఓపీ సేవలతో పాటు అవసరమైన వారికి ఈ-సంజీవని టెలీమెడిసన్ ద్వారా స్పెషలిస్ట్ వైద్యసేవలు కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం షెడ్యూల్ సంబంధిత సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందుగా ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ వైద్యబృందాలు గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. హిమోగ్లోబిన్, మలేరియా వంటి 14 రకాల వైద్యపరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ పాల్గొన్నారు.

టెస్టింగ్‌లో టాప్

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల్లో సిద్ధార్థ వైద్య కళాశాల మేటి



మైక్రోస్కోప్‌తో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

- పాథాలజీ విభాగం ద్వారా నెలకు 800 పైగా శాంపిల్స్‌కు పరీక్షలు
- ఎక్కువగా థైరాయిడ్ రొమ్ము క్యాన్సర్‌ల నిర్ధారణ పరీక్షలు
- సర్జరీ తర్వాత ఎలాంటి చికిత్స చేయాలో కూడా సూచనలు
- మూడు జిల్లాల ప్రజలకు మెరుగైన సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీరంలో వచ్చే కణుతులు, గడ్డలు ప్రమాదకరమైనవా కావా అని నిర్ధారించడంలో ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల పాథాలజీ విభాగం విశేష కృషి చేస్తోంది. నిపుణులైన వైద్య బృందం నేతృత్వంలో పరీక్షలు చేస్తూ కచ్చితమైన ఫలితాలు రాబడుతోంది. విజయవాడ ప్రభుత్వాస్పత్రితో పాటు, కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి సైతం సర్జరీ అనంతరం తీసిన గడ్డలను వ్యాధి నిర్ధారణ కోసం ఇక్కడకు పంపుతున్నారు. మచిలీపట్నం, ఏలూరులోని జిల్లా ఆస్పత్రుల నుంచి కూడా ఇక్కడికి పరీక్షల నిమిత్తం పంపిస్తుంటారు. పాథాలజీ వైద్యుల బృందం వాటిని ప్రాసెస్ చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు.

పరీక్షలు ఇలా..

- శస్త్ర చికిత్సతో తొలగించిన గడ్డను ఏ రకం గడ్డ అనేది ఇక్కడ నిర్ధారిస్తారు. ఇలాంటి పరీక్షలు నెలలో 200 నుంచి 250 వరకూ చేస్తుంటారు. వాటిలో 30 నుంచి 40 శాంపిల్స్ ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వస్తుంటాయి.
- మరో విభాగం ఎఫ్ఎన్ఏసీ(శరీరంలో ఉన్న గడ్డ నుంచి నీడిల్‌తో ముక్క తీయడం) పరీక్ష ద్వారా శరీరంలో ఉన్నది ఏ గడ్డ నిర్ధారిస్తారు. ఇవి నెలకు 300 నుంచి 350 వరకూ చేస్తుంటారు.
- మహిళలకు పాప్‌స్మియర్ ద్వారా బయాప్సీ తీసి పరీక్ష చేస్తారు. ఇవి నెలకు 300 వరకూ నిర్వహిస్తారు.
- వీటితో పాటు కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీబీపీ), పొట్టలో ఫ్లూయిడ్ తీసి వ్యాధిని నిర్ధారించడం వంటి అనేక రకాల పరీక్షలు ఈ విభాగంలో నిర్వహిస్తారు.

థైరాయిడ్ క్యాన్సర్‌లే అధికం..

వైద్య కళాశాల పాథాలజీ విభాగంలో నిర్ధారణ అవుతున్న క్యాన్సర్‌లలో థైరాయిడ్ క్యాన్సర్‌లు ఎక్కువగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. రోజుకు ఒకటి, రెండు కేసులు నిర్ధారణ అవుతాయంటున్నారు. ఆ తర్వాత రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్ కేసులు వస్తున్నట్లు వివరిస్తున్నారు. చాలా అరుదుగా పెద్దపేగు క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్‌లు వస్తున్నాయి. అరుదైన గర్భసంచి ముఖద్వార క్యాన్సర్‌లు కూడా నిర్ధారిస్తున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు.

ఇమ్యునో హిస్టో కెమిస్ట్రీ ల్యాబ్..

కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం అందుబాటులో లేని ఇమ్యునో హిస్టో కెమిస్ట్రీ(ఐహెచ్‌సీ) ల్యాబ్ ఇక్కడ అందుబాటులోకి వచ్చింది. దీంతో రొమ్ము క్యాన్సర్, ఇతర క్యాన్సర్‌లకు సర్జరీ అనంతరం ఏ తరహా మందుతో కీమోథెరపీ నిర్వహించాలో ఇక్కడ నిర్ధారణ చేస్తారు.

నిష్ణాతులతో..



శాంపిల్‌ను ప్రాసెస్ చేస్తున్న టెక్నీషియన్

పాథాలజీ విభాగంలో ముగ్గురు ప్రొఫెసర్‌లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్‌లు, ఏడు గురు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లతో పాటు 18 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు మరో ఏడుగురు ల్యాబ్ టెక్నీషియన్స్ సేవలు అందిస్తున్నారు. వారి విభాగానికి వచ్చిన శాంపిల్‌ను స్లైడ్‌పై ప్రాసెస్ చేసి మైక్రోస్కోపీతో పరీక్షిస్తారు. అందుకోసం అత్యాధునిక మైక్రోస్కోపీలు అందుబాటులో ఉన్నాయి. ఒకరు వ్యాధిని నిర్ధారిస్తే, అనంతరం అసోసియేట్, ప్రొఫెసర్‌లు కూడా పరిశీలిస్తారు.

కచ్చితమైన నిర్ధారణ



నిపుణులైన వైద్యుల బృందంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. పాథాలజీ విభాగంలో ఏడాదికి ఆరుగురు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు చేరుతుంటారు. వారితో పాటు, మరో తొమ్మిది సీట్లు కోసం దరఖాస్తు చేశాం. ఇక్కడి వైద్యులు వారికి టీచింగ్ చేస్తూనే, నిర్ధారణ పరీక్షలు చేస్తుంటారు. పరీక్ష ఫలితాలను సైతం సత్వరమే ఇవ్వాలని ఆదేశించాం. అవసరమైతే సిఫార్సు చేసిన వైద్యుడు, రోగి సెల్‌ఫోన్‌కు రిపోర్టులు వాట్సాప్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు, ప్రిన్సిపాల్, సిద్ధార్థ వైద్య కళాశాల

సమష్టిగా కృషి చేస్తున్నాం



రోగులకు మెరుగైన, కచ్చితమైన వ్యాధి నిర్ధారణ ఫలితాలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నాం. సర్జరీ ద్వారా తొలగించిన గడ్డలు, గడ్డ నుంచి సేకరించిన శాంపిల్స్, పాప్‌స్మియర్‌తో సేకరించిన శాంపిల్స్ పరీక్ష కోసం వస్తుంటాయి. వాటితో పాటు శరీరంలో, పేగుల్లో ఫ్లూయిడ్స్ కూడా వ్యాధి నిర్ధారణ కోసం పంపుతుంటారు. వాటిని ప్రాసెస్ చేసి పరీక్షిస్తుంటాం. రొమ్ము, థైరాయిడ్, నోటి క్యాన్సర్‌లతో పాటు, అరుదుగా ఇతర రకాల క్యాన్సర్‌లను కూడా నిర్ధారిస్తుంటాం.

– డాక్టర్ బీవీ రామారెడ్డి, హెచ్ఓడీ, పాథాలజీ విభాగం

కృష్ణా జిల్లా వ్యాప్తంగా వర్షాలు

చిలకపూడి (మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో 20.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం సోమవారం నమోదైంది. అత్యధికంగా చల్లపల్లి మండలంలో 51.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పెనమలూరు మండలంలో 5.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. జిల్లాలోని మిగిలిన మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. బంటుమిల్లి మండలంలో 45.2 మిల్లీమీటర్లు, గుడ్లవల్లేరు 38.2, కృత్తివెన్ను 36.4, పామర్రు 36.2, బాపులపాడు 30.8, పెదపారుపూడి 29.8, గూడూరు 26.4, మచిలీపట్నం 24.2, అవనిగడ్డ 21.8, గుడివాడ మండలంలో 20.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

2,367 ఎకరాల్లో పంట ముంపు

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 2,367 ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలు ముంపునకు గురైనట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహరరావు సోమవారం తెలిపారు. జిల్లాలోని మచిలీపట్నం, నాగాయలంక, కోడూరు, కృత్తివెన్ను మండలాల్లో 1472 ఎకరాల్లో వరి, 895 ఎకరాల్లో వేరుశనగ పంట నీటమునిగిందన్నారు. అయితే ముంపునకు గురైన పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లే అవకాశం లేదన్నారు.



విజయవాడ 41వ డివిజన్ భవానీపురం దర్గా ప్లాంట్స్ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి



నందిగామ మండలం అడవిరావులపాడు గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మైనర్లపై పోలీసు నిఘా !

- వాహనాలు నడుపుతూ రోడ్లపైకి వచ్చారో అంతే!
- కేసులు నమోదు చేసి జరిమానా వసూలు
- మైనర్‌లను పట్టుకునేందుకు నగరంలో స్పెషల్‌డ్రైవ్‌లు



కోనేరుసెంటర్‌లో వాహనాలు నడుపుతున్న మైనర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై రాజేష్

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లపై ట్రాఫిక్ పోలీసులు నిఘా పెట్టారు. అలాంటి వారిని పట్టుకునేందుకు ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. రోడ్లపై వాహనాలు నడుపుతూ కంటపడితే చాలు పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తున్నారు. మైనర్‌లతో పాటు వారికి వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిన ఇంటి పెద్దలనూ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్‌లు ఇస్తున్నారు. అలా ఇప్పటి వరకు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న మైనర్‌లను పట్టుకుని పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేసిన పోలీసులు రూ.లక్షల్లో జరిమానాలు సైతం విధించారు.

ప్రమాదాలకు కారకులుగా మైనర్లు....

ఇటీవల కాలంలో రోడ్డు భద్రతపై ఎటువంటి అవగాహన లేని మైనర్‌లు వాహనాలు నడుపుతూ రోడ్లపైకి రావటంతో పాటు ప్రమాదాలకు కారకులుగా మారుతున్నారు. దీంతో రోడ్లపై డ్రైవింగ్ చేసే మైనర్‌లను పట్టుకునేందుకు బందరు ట్రాఫిక్ పోలీసులు నగరంలో బృందాలుగా ఏర్పడి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రధాన కూడళ్లతో పాటు చిన్న సన్న సందుల్లో సైతం కాపు కాసి మైనర్‌లను పట్టుకుంటున్నారు. అలా గడిచిన కొన్ని నెలల్లో సుమారు 191 కేసులను ట్రాఫిక్ పోలీసులు నమోదు చేశారు. అలాగే వారి నుంచి జరిమానాల రూపంలో దాదాపు రూ. 1,97,685 వసూలు చేశారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు సంబంధించి 97 కేసులు నమోదు చేసిన పోలీసులు రూ. 1,00,395 జరిమానా విధించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్న వారిపై తొమ్మిది కేసులు నమోదు చేసి రూ. 9315లను జరిమానా వసూలు చేశారు. లైసెన్స్‌లు లేని కారణంతో మరో 58 కేసులు నమోదు చేసి రూ. 60,030 జరిమానా విధించారు. అలాగే ఇతర కారణాలతో మరో 27 కేసులు నమోదు చేసి రూ. 27,945 జరిమానాలు వేశారు.

పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు



రోడ్డ భద్రతపై ఎటువంటి అవగాహన లేకుండా మైనర్‌లు వాహనాలు నడుపుకుంటూ రోడ్లపైకి వచ్చేస్తున్నారు. వారిని నిలువరించేందుకు అధికారుల ఆదేశాలతో స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. పట్టుబడిన మైనర్‌ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్‌లు ఇస్తున్నాం. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదనే ఆలోచన తల్లిదండ్రుల్లో కలగాలి. పిల్లలు మారం చేశారని వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే వినకూడని వార్తలు వినాల్సి వస్తుంది. లేదంటే చూడకూడని దృశ్యాలు చూడాల్సి వస్తుంది. తల్లిదండ్రులు సహకరిస్తేనే మైనర్ డ్రైవింగ్‌లను ఆపడం కుదురుతుంది. అది పిల్లలకు శ్రేయస్కరం అవుతుంది.

– భరత్ మాతాజీ, ట్రాఫిక్ డీఎస్పీ

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతుడు లక్ష్మణరావు

తోట్లవల్లూరు: యాకమూరు వద్ద పుల్లేటి కాలువలో ప్రమాదవశాత్తు గల్లంతైన నందిగాని లక్ష్మణరావు(37) మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. ఉయ్యూరు కాపుల రామాలయం ప్రాంతానికి చెందిన లక్ష్మణరావు ఆదివారం సాయంత్రం స్థానిక పుల్లేటి కాలువపై ఉన్న కాలిబాట వంతెన వద్ద నిలుచుని చేపల వేటను చూస్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతైన విషయం విదితమే. లక్ష్మణరావు భార్య నందిగాని లక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు.

గుంటూరు రైల్వే డీఆర్‌ఎం మోహన్‌రాజా బదిలీ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఆర్.మోహన్‌రాజా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తమిళనాడుకు చెందిన ఎం.రామకృష్ణన్ నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మోహన్‌రాజా వెళ్లబోయే స్థానాన్ని ఇంకా స్పష్టం చేయలేదు. తమిళనాడుకు చెందిన రామకృష్ణన్ ప్రస్తుతం తమిళనాడు రైల్వే డివిజన్‌లోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో నాన్ ఫంక్షనల్ హైయర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు రైల్వే అధికారులు చెబుతున్నారు.

ట్రస్ట్ నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, జేసీ శ్రీవాస్ నుపూర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్(డీఎంఎఫ్) నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులలో 55 శాతం ప్రాధాన్యతా రంగాలైన తాగునీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, శానిటేషన్, కార్మికుల సంక్షేమానికి వినియోగించాల్సి ఉంటుందన్నారు. 40 శాతం నిధులను భవనాలు, రోడ్డు, బ్రిడ్జిలు, ప్రాజెక్టుల అభివృద్ధికి ఖర్చు చేయవచ్చన్నారు. ట్రస్ట్ నిధులను ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని వివిధ క్వారీల నుంచి సుమారు రూ.273 కోట్లు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ వసూలు చేశారన్నారు. ఈ నిధులతో గతంలో రూ.2 కోట్లు ఉమ్మడి కృష్ణా జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా పనులకు, రూ.25 కోట్లు కోవిడ్ నియంత్రణకు, మరో రూ.20 కోట్లు వివిధ పనులు నిర్వర్తించిన కాంట్రాక్టర్లకు చెల్లించామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు రూ.130 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, ఈ నిధులలో రూ.80 కోట్లు పాలనాపరమైన పనులకు కేటాయించామన్నారు. మరో రూ.2.33 కోట్లు పెండింగ్ బిల్లులకు సంబంధించి సీఎఫ్‌ఎంఎస్ ద్వారా బిల్లులను చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రూ.76 కోట్లకు సంబంధించిన వివిధ పనులు పురోగతిలో ఉన్నాయని, ఆ పనులకు నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో రూ.34.93 కోట్లు, నందిగామ నియోజకవర్గంలో రూ.9.59 కోట్లు, మైలవరం నియోజకవర్గంలో రూ.21.96 కోట్లు, తిరువూరు నియోజకవర్గంలో రూ.1.39 కోట్ల రూపాయలు, విజయవాడ నియోజకవర్గంలో రూ.3.08 కోట్ల ప్రతిపాదిత పనులకు అంచనాలను రూపొందించామన్నారు. ప్రతి నెలా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించి ఫండ్‌ను ప్రాధాన్యతా రంగాలకు వినియోగించేలా అనుమతి ఇస్తామన్నారు. సమావేశంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ డీఎంఎఫ్ నిధులతో ఇప్పటివరకు చేపట్టిన పనులను పూర్తి చేయడంలో సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది సేవలను కూడా వినియోగించుకుని పనులను వేగవంతం చేయాలని సూచించారు. నీటి అవసరాల కోసం జిల్లా వ్యాప్తంగా వందలాది బోర్లు వేశారని, అయితే వాటిపై సరైన పర్యవేక్షణ లేక సగానికి పైగా పనిచేయడం లేదన్నారు. వీటిపై ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వినియోగంలోకి తేవాలన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ జిల్లాలో 56 ఇసుక రీచ్‌లకు గాను 30 మాత్రమే పని చేస్తున్నాయని, ఇసుక రీచ్‌లు ప్రారంభించి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా నగరపాలక సంస్థ పరిధిలో ఇసుక లభ్యత లేక అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందన్నారు. దీని వలన నాడు–నేడు, జగనన్న గృహ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ టి.నాగేశ్వరరావు, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, మైనింగ్ డెప్యూటీ డైరెక్టర్ కె. సుబ్రమణేశ్వరరావు, ఏడీలు బి.రవికాంత్, బి.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస టీచెర్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc. ✆ 99493 08940

■ ఒకే సం.లో Reg./Distance 10th, Inter, Degree, PG, B.Tech, Dip, Ag. B.Sc, MBA, MCA, ANM, GNM, BSc Nursing, BAMS, BHMS, D/B Pharmacy, Lateral Entry Previous Date Adm. ✆ 91214 53156

PLOT FOR SALE

■ VJA, మంగళగిరి, కంచికచర్ల, గన్నవరం, బందరురోడ్, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. CRDA, DTCP ఫామ్‌హౌస్, శ్రీ గంధం మొక్కలతో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 17,500/-, ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. ✆ 96031 45395

■ HYD to ముంబై హైవే రోడ్ సదాశివపేట, వికారాబాద్ మెయిన్‌రోడ్ ఫేసింగ్స్ 128+12 ఎకరాలు, DTCP ప్లాట్లు కలవు. 10 Lakhs ఇన్వెస్ట్‌మెంట్ 30 వేలు రెంటల్స్ ప్రతి నెల ✆ 96037 78555

TO-LET

■ కృష్ణలంక సబ్‌వే దగ్గర స్టేట్‌బ్యాంక్ రోడ్డులో అన్ని ఆధునిక సౌకర్యాలతో A/c రూములు, ఫ్యామిలీ పోర్షన్లు ఉద్యోగులకు, విద్యార్థులకు, వ్యాపారులకు, ఫ్యామిలీలకు అద్దె కొరకు సంప్ర. ✆ 83099 04493

SERVICES

BUSINESS OFFER

■ వెస్ట్రన్‌గ్లోబల్ ట్రేడర్స్ జీరో మార్కెట్ రిస్క్‌తో అత్యుత్తమ పెట్టుబడి ప్రణాళికలు ISO సర్టిఫైడ్ కంపెనీతో రోజువారి డబ్బు సంపాదించండి. ఫోన్ : 7288821115/1116.

■ పెట్టుబడి పెట్టుకొని ఇంట్లో ఉంటూ కొవ్వొత్తులు, పెన్సిల్స్, ఫ్లోర్ తుడిచే మాప్స్ తయారు చేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్. 9491996566

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నది మా డబ్బుతో విడిపించి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్, జెన్యూన్. ✆ 88978 87700

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర ✆ 96590 57777

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888

■ సంప్ర : 70955 77775, బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. 100% జెన్యూన్

ASTROLOGY

■ శ్రీ చాముండేశ్వరీ జ్యోతిష్య పీఠం S.V. కిరణ్‌శర్మ గారు విజయవాడ మరియు గుడివాడ ప్రాంతములలో గత 15 సం॥రాలుగా స్థిరపడి ఉన్నారు. విద్యా, ఉద్యోగ, వివాహం, సంతాన మరియు స్త్రీ / పురుషుల ఎటువంటి గుప్త సమస్యలకయిన 600 సం॥రాల తాళపత్ర గ్రంధంతో వశీకరణ, ధనయోగం, ఆరోగ్యప్రాప్తి విశేషంగా పూజ, హోమం ద్వారా శాశ్వత పరిష్కారం చెప్పగలరు. సంప్ర. 77020 22513

■ తాళపత్రములు చూసి మీ బొటన వేలి ముద్రతో మీ పేర్లు, మీ కుటుంబ సభ్యుల పేర్లు మీ భవిష్యత్తు, మీ సమస్యలు వాటి పరిష్కారాలు చెప్పబడును. విజయవాడ. ✆ 8317684903.

FOR SALE

■ NTR జిల్లాలో ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో CSE, ECE, EEE, Civil బ్రాంచిలకు సంబంధించిన Lab Equipment, Furniture మొత్తము అమ్మకమునకు కలదు. Contact: 84660 84568, 98481 50166

OLD AGE HOME

■ తేజ ఓల్డేజ్ హోమ్ విజయవాడ ఇదిపెద్దవారి కుటుంబం, పెద్ద కుటుంబం, వృద్ధాప్యం, అనారోగ్యంతో ఉన్న మీ పెద్దల గురించి ఆందోళన వద్దు, మా హోమ్‌లో చేర్పండి. Ph : 8897730222, 7093911010, 9573000987

WANTED

■ విజయవాడ సిటీలో డెమో స్టాల్స్‌లో Surya LED TV's ప్రమోటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీ॥ 12-18K+TA +రూమ్ ఫ్రీ. ✆ 98480 56575

■ Wanted: Social Service Centre Vijayawada: Training Co-ordinator 3 years experience in HIV Programme - 1 Post (MSW), Training Officer 2 years experience in HIV Programme - 2 Posts (Any Graduate) Finance and Admin 2 years experience - 1 Post. Contact: 98490 44585, 83319 16347

■ బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్ VRS స్టేట్ &సెంట్రల్ ఎంప్లాయిస్ గృహిణులు, టీచర్లు రియల్ ఎస్టేట్ వారు కావలెను. Age 50-70 Q : Inter+ జీతం : 12K -15K ✆ 63041 81391

■ బెంజిసర్కిల్ & గొల్లపూడి పరిసర ప్రాంతాలలో 10th, 5'6", సెక్యూరిటీలో 3 సం॥ అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం. డ్యూటీ, మంచి జీతం + PF, ESI. ✆ 78938 84421.

■ స్వీట్‌మ్యాజిక్, Opp : డి.వి. మేనర్, M.G రోడ్, విజయవాడ, క్యాషియర్స్ (Male)కావలెను. ఈ రోజు, రేపు బయోడేటాతో పై అడ్రస్సునందు సంప్రదించండి.

■ విజయవాడ తాడేపల్లి సమీపంలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. డ్యూటీ: 12 గం॥లు, జీతం: 12,000/- వ: 50 సం.లోపు. 4 వీక్లీ ఆఫ్స్. ✆ 8309807283

■ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ / సెంట్రల్ ఎంప్లాయిస్, గృహిణులు, టీచర్స్, R/E వారు కావలెను. వ: 35-70, Q: Inter+ జీ:15-30 వేలు ✆ 94934 02143.

■ Female Tally Prime Full Experienced Accountact for Working two hours at Sitaramapuram. ✆ 92472 88381. E-mail: laldodda@gmail.com

■ సామాన్ టెక్స్‌టైల్స్ & రెడీమేడ్స్ మచిలీపట్నం నందు పనిచేయుటకు : సేల్స్ మెన్ & హెల్పర్స్ కావలెను. ✆ 92464 51778

■ మహిళా టెలికాలర్స్ కావలెను. విజయవాడ, కంకిపాడు ఉయ్యూరులో గల ప్రముఖ సంస్థ వారికి ఫ్రెషర్స్ మరియు అనుభవజ్ఞులు కావలెను.జీతం:9,000-12,000 ✆ 91214 01447

■ విజయవాడలోని ప్రముఖ సంస్థ నందు కౌంటర్ స్టాఫ్, అకౌంటెంట్స్, లేడీ టెలికాలర్స్, లేడీ టైలర్స్ కావలెను. సంప్ర॥ ✆ 92464 74837

■ కైలాష్ ఆటోమొబైల్స్‌లో పని చేయుటకు వర్కర్స్, గోడౌన్ స్టాఫ్, హెల్పర్స్ కావలెను. డోరు నెం. 27-23-174/బి, నవరంగ్ థియేటర్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు. ✆ 98482 94029

■ Full Stack JAVA / PYTHON Trainer కావలెను. ఆకర్షణీయమైన వేతనం, కాంట్రాక్ట్ / ఫుల్ టైం అవకాశం. సంప్ర॥ ✆ 90100 24191.

■ ప్రముఖ కలర్ ల్యాబ్ నందు ఫోటోషాప్ ఆపరేటర్స్, రిసెప్షనిస్టులు, హెల్పర్స్, ఆల్బమ్ బైండర్స్ కావలెను. సంప్ర : ✆ 0866-6669918, 92479 72736

■ VJAలో ప్రముఖ ఆటోమొబైల్ షాపు నందు సేల్స్‌మెన్స్, హెల్పర్స్, గోడౌన్ స్టాఫ్ కావలెను. సంప్ర॥ మనోజ్ ఆటోమొబైల్స్, గవర్నరుపేట, విజయవాడ. ✆ 90007 78748, 63021 29299

■ విజయవాడ, 1 టౌన్, వస్త్రలత హోల్‌సేల్ షాపు నందు పనిచేయుటకు హెల్పర్స్, ఆడ / మగ వారు కావలెను. సంప్ర: ✆ 98480 70411

■ మ్యారేజి సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జి గల లేడీ ఐన్‌ఛార్జి 25,000/-, లేడీ రిసెప్షనిస్ట్ & టెలికాలర్స్ 15,000/-, ఏదైనా డిగ్రీ. సంప్ర॥ విజయవాడ-7 ✆ 87905 99799

■ కెరీర్ వాక్ వారిచే నిరుద్యోగ యువతులకు (Girls) Typing, M.S. Office, Tallyలో ఉచిత శిక్షణ, గవర్నర్‌పేట, విజయవాడ. ✆ 93986 19360, 62818 64337

■ అనుభవం గల సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ (12 గం) 17 వేలు & సెక్యూరిటీ గార్డ్స్ (12 గం) 14,500/- & లేడీ గార్డ్ (8 గం) 11 వేలు వెంటనే కావలెను ✆ 73965 52767, 98494 47895

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి పార్ట్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 10,000 - 15,000 వరకు సంపాదించే అవకాశం. ఫ్రీ బుక్‌లెట్ కొరకు. 90595 09586

■ A Reputed Plywood Company, Vijayawada Require Sales Executive. Send Resume to uvplyhyd@gmail.com ✆ 9160018839.

■ R.K. ఇంజనీరింగ్ కాలేజ్, కేతనకొండ, విజయవాడలో కాలేజ్ క్యాంటీన్ నందు పనిచేయుటకు హెల్పర్స్, టిఫిన్ మాస్టర్స్ మరియు బాయ్స్ & గర్ల్స్ హాస్టల్ నందు పనిచేయుటకు వార్డెన్లు, బాత్‌రూములు క్లీనింగ్ చేయుటకు స్కావెంజర్స్ కావలెను. అనుభవమును బట్టి మంచిజీతం ఇవ్వబడును. సంప్ర: 97014 73399

■ స్నేహ హోంకేర్ సర్వీస్ నందు పెద్ద వారికి సేవ చేయుటకు 24 Hr. ఇంటి, వంట పని, బేబికేర్ టేకర్స్, అటెండర్ హెల్పర్స్, ఏజెంట్స్ స్త్రీ/పు కావలెను. జీ॥ 20-25 వేలు, ఫ్రీ రూం + మెస్ ఫ్రీ. సంప్ర॥ 85209 00992, 91217 22069

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీ/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th-డిగ్రీ, 10-30వేలు జీతం, భో+రూ ఫ్రీ. Hyd. Ph: 7995374999

■ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వర్క్ చేయుటకు కార్గో సూపర్‌వైజర్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, లోడర్స్ అర్జెంట్‌గా కావలెను. జీ: 18,000/- to 30,000/-, Q: 5th to Any Degree రూం+భోజనం ఫ్రీ. 9642264336

■ భవానిపురం,సత్యనారాయణపురం, ఎనికెపాడు బ్రాంచ్‌ల నందు డెలివరీ బాయ్స్ కావలెను. బైక్+డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్ ఫోన్ ఉండవలెను. వయసు:20+. 8686242288, 9666538063.

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K. ఏజెంట్స్ కమీషన్. 3K. Ph: 7569955551, 9848571888

■ 10th class పాసైన వారికి అద్భుతమైన బహుమతి. చిన్న Online test పాసవ్వండి. 3000/– పొందండి. 8374255267

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం



రైల్వే టెన్నిస్ క్రీడాకారుడు రాంకుమార్‌ను సన్మానిస్తున్న సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్(ఐస్టా) ఆధ్వర్యాన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సీనియర్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.పట్టాభిరామయ్య తెలిపారు. జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల ప్రారంభాన్ని పురస్కరించుకుని స్థానిక ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, బ్లూడేమింగ్ స్కూల్, ఎస్ఆర్‌కే క్లబ్‌లలోని కోర్టులలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 35 ప్లస్, 45ప్లస్, 55 ప్లస్, 65 ప్లస్, 70 ప్లస్ వయసు విభాగాల్లో జరిగే ఈ పోటీలలో పలు రాష్ట్రాలకు చెందిన 268 మంది క్రీడాకారులు తలపడతారన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్ పోటీల 35 ప్లస్ విభాగంలో ఐ.గిరీష్‌కుమార్‌రెడ్డి, పి.రాజా, అశోక్‌రెడ్డి, హరీష్‌బాబు, వై.రాము, జి.బాలకృష్ణ, వి.ప్రదీప్‌కుమార్, ఎ.నగేష్‌రెడ్డి, 45 ప్లస్ విభాగంలో షేక్ నూరుద్దీన్, బాలమోహన్, ఐ.అప్పాజీ, జితిన్‌మొహంతి, వి.చంద్ర, ఆర్.మోహన్‌కుమార్, స్నేహసిస్ బెహ్రా, ఆర్.రాంబాబు, 55 ప్లస్ విభాగంలో జి.బాలసుబ్రహ్మణ్యం, పాండురంగయ్య, ఐ.వి.ఆర్.రావు, ఆర్.విజయ్‌వర్ధన్, జి.కన్నన్, డి.సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, లూయిస్ విజేతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సీనియర్ కార్యదర్శి ఎ.రాంబాబు, టోర్నీ ప్రెసిడెంట్, జి.సురేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రాధాకృష్ణమూర్తి, టోర్నీ కన్వీనర్, పరిశీలకుడు మల్లికార్జునరావు, కోచ్ వై.శివరామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కన్వీనర్ ఎస్.దుర్గారావు, చీఫ్ రిఫరీ శ్రీకుమార్ పాల్గొని రైల్వే టెన్నిస్ క్రీడాకారుడు రాంకుమార్‌ను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పల్నాడులో దారుణం

- బాలికను గర్భవతిని చేసిన వార్డెన్
- గతంలో సస్పెండైనా తీరుమారని ప్రబుద్ధుడు

రెంటచింతల (మాచర్ల): పల్నాడు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న ఓ బాలికను వార్డెన్ రెండోసారి గర్భిణిని చేశాడు. గతంలో ఓ సారి పాపను లోబరుచుకుని గర్భవతిని చేసిన వార్డెన్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అయినా అతని తీరులో మార్పు రాలేదు. దీంతో పోలీసులు వార్డెన్‌ను అరెస్టు చేసి బాలికను వైద్యపరీక్షల నిమిత్తంగుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా రెంటచింతల ఏడోమైలు గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ బాలికను మూడేళ్ల క్రితం అక్కడ వార్డెన్‌గా పనిచేసిన ఎ.శ్రీనివాసరావు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. బాలిక గర్భవతి కావడంతో ఉన్నతాధికారులు శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు. ఆ తర్వాత బెల్లంకొండ మండలానికి బదిలీ చేశారు. అయినా తీరు మారని వార్డెన్ శ్రీనివాసరావు ఆ బాలికతో సంబంధం కొనసాగిస్తున్నాడు. మరోమారు బాలిక గర్భందాల్చడంతో ఐదురోజుల క్రితం చిత్తూరు జిల్లాకు తీసుకెళ్లి అబార్షన్ చేయించాడు. బాలిక కనిపించకపోవడంతో ఆందోళన చెందిన బాలిక తల్లిదండ్రులు మాచర్ల పట్టణ పోలీసులను ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు వార్డెన్‌ను అదుపులోకి తీసుకుని బాలికను వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ చేపట్టారు. వార్డెన్ శ్రీనివాసరావు చాలామంది బాలికలతో అసభ్యంగా ప్రవర్తించినట్టు పోలీసులు గుర్తించారు. వార్డెన్‌పై లైంగిక దాడి, కిడ్నాప్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సీఐ బాలకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఉండి(పశ్చిమగోదావరి): ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులో ఉన్న 15 మందికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గణపవరం మీదుగా భీమవరం వెళుతోంది. సోమవారం సాయంత్రం ఉండిలోని ఏఎంసీ సమీపంలోని ఐస్ ఫ్యాక్టరీ సమీపంలోకి వచ్చేసరికి మొగల్తూరు నుంచి దూబచర్ల వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ భాగం తప్పుకోగా, ట్రక్కును బస్సు బలంగా ఢీకొనడంతో బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో 48 మంది ప్రయాణికులు ఉండగా, వీరిలో 15 మందికి గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న ఆకివీడు సీఐ మల్లవరపు గీతాకృష్ణ, ఎస్‌ఐ కె.గంగాధరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వేరే వాహనాల్లో భీమవరంలోని మూడు ప్రైవేట్ ఆసుపత్రులకు చికిత్స కోసం తరలించారు. క్షతగాత్రుల్లో చిన్న పిల్లలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. గాయాలపాలైన వారిలో కొడవలూరి దినేష్‌కుమార్ (తాడినాడ, కృష్ణాజిల్లా), కొడవలూరి ప్రభావతి (తాడినాడ), ఫణీంద్రుల వీరబ్రహ్మం (తాడినాడ), కాళీ జ్యోతి (ఆకివీడు), కాళీ నందిని (ఆకివీడు), కాళీ విన్ను (ఆకివీడు), బొక్కా సూర్యకళ, బొక్కా నాగవల్లి (ఆచంట), నీలం సుబ్బారావు (చీపురుగూడెం), కేశవరపు సీతామహాలక్ష్మి(ఉండి) ఉన్నారు.

క్లుప్తంగా

యువకుడికి ఆర్థిక సాయం

గుణదల(విజయవాడ తూర్పు):అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడికి వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్ రూ.10 వేల ఆర్థిక సాయం అందచేశారు. సోమవారం గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 3వ డివిజన్ కు చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది .దీనికి స్పందించిన ఆయన దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు.

ములాయం సింగ్ కు నివాళి..

సమాజ్ వాది పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ములాయం సింగ్ యాదవ్ అకాల మరణం బాధాకరమని దేవినేని అవినాష్ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ములాయం సింగ్ యాదవ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, వెంకట సత్యనారాయణ, నాయకులు బచ్చు మురళి, సొంగా రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూలు లేకుండానే రూ. 500 టికెట్ల విక్రయం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రూ. 500 అంతరాలయం, వీఐపీ టికెట్లకు 2 లడ్డూలు ఇవ్వకుండానే విక్రయించడంపై భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంతరాలయ, వీఐపీ టికెట్ల సోమవారం నుంచి రూ. 500 టికెట్లను దేవస్థానం విక్రయిస్తుందని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దుర్గగుడి ఈవో భ్రమరాంబ ఉత్సవాల్లో ప్రకటించారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు సమాచార కేంద్రంలో రూ. 500 టికెట్లను సిబ్బంది సోమవారం విక్రయించారు. అయితే వీఐపీ టికెట్‌తో పాటు ఇస్తానని చెప్పిన రెండు లడ్డూలను ఇవ్వకపోవడంతో పలువురు భక్తులు ఆలయ సిబ్బందితో వివాదానికి దిగుతున్నారు. టికెట్ల విక్రయాలను ప్రారంభించినప్పుడు లడ్డూలను ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. మరో వైపున దేవస్థాన అధికారులెవరూ దీనిపై మాట్లాడటం లేదని కౌంటర్‌లోని సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రతి టికెట్‌కు రెండు లడ్డూలు ఇచ్చే అంశం దేవదాయ శాఖ కమిషనర్ నుంచి అనుమతి రావాల్సి ఉంటుంది. దీనిపై ఒకటి రెండు రోజులలో పూర్తి స్థాయి అనుమతులు వచ్చే అవకాశాలున్నాయని ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు.

ప్రపంచ శాంతికి అండగా ఉండాలి



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ముస్లిం సమాజం ప్రపంచ శాంతికి అండగా ఉండాలని ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. మిలాదున్నబిని పురస్కరించుకొని కడప అమీన్‌పీర్ దర్గా బాబా శిష్యబృందం ఆధ్వర్యంలో స్థానిక పంజా సెంటర్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ భారతదేశంలో కులమతాలకు అతీతంగా ప్రజలు సహజీవనం చేస్తూ లౌకికవాదాన్ని కాపాడుకుంటున్నారని తెలిపారు. అదే సంప్రదాయాన్ని పటిష్టంగా కొనసాగించాల్సిన అవసరముందని చెప్పారు. ప్రవక్త అందించిన సందేశాన్ని అందరూ అనుసరించాలని కోరారు. శాంతిసహనాలను ముస్లింలు కొనసాగించాలని సూచించారు. ప్రవక్త అందించే సందేశాన్ని కేవలం ముస్లిం సమాజమే కాకుండా యావత్ ప్రజానీకం అనుసరించదగినదన్నారు. ప్రవక్త జయంతిని పురస్కరించుకొని వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఏటా కడప అమీన్‌పీర్‌దర్గా బాబా బృందం ఈ విధమైన సేవా కార్యక్రమాలను నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఏపీ హిస్టరీ అకాడమీ సభ్యులు వాజీద్‌ఖాన్, కార్పొరేటర్ ఆర్షద్, బీసీ నేత పైడాడ శ్రీనివాసరావు పెద్ద సంఖ్యలో ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

ములాయంసింగ్ యాదవ్‌కు నివాళి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ మృతి యాదవ జాతికి తీవ్ర నష్టమని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ధర్నాచౌక్‌లో యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ములాయం సింగ్‌యాదవ్‌కు ఘన నివాళులర్పించారు. ములాయంచిత్రపటానికి పార్థసారథి పూలు జల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బడుగు, బలహీన వర్గాలకు గుర్తింపు తెచ్చిన వారిలో ములాయం సింగ్ ఒకరని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి పునాదులు వేశారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో యాదవ మహా సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్‌యాదవ్, జాతీయ కార్యదర్శి నెరుసు సతీష్ యాదవ్, గొరిపర్తి శ్రీనివాస్ యాదవ్, కొంగన రవికుమార్, సర్నాల బాలాజీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో దేవినేని అవినాష్



మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు):ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం సోమవారం నిర్వహించారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన రూపొందించి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. పేదల పక్షపాతిగా పేరు తెచ్చుకున్న జగన్‌మోహన్ రెడ్డి కుల మతాలకు అతీతంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కృతకృత్యులయ్యారని వివరించారు. 90 శాతం హామీలను ఇప్పటికే నెరవేర్చారని తెలిపారు. దీనికి తోడు స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు ముమ్మరం చేశారని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలను మెరుగు పరిచేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా నడుచుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని వివరించారు.

మూడు రాజధానులతో అభివృద్ధి....

పాలనా వికేంద్రీకరణ ద్వారా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేయడం ద్వారా సంక్షేమ పాలనతో పాటు సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మూడు రాజధానుల ఏర్పాటు విషయంలో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇంటింటికీ తిరిగి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నగర నాయకులు మునునూరి సుబ్బారావు, పమిడిముక్కల రాజు, విజయబాబు, యాసిన్, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాల నిరోధంపై అవగాహన ర్యాలీలు



బందరు కాల్వ పడవల రేవు సెంటర్ వద్ద మిషన్ కృష్ణా-గోదావరి ర్యాలీని ప్రారంభిస్తున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



రైవస్‌కాల్వ వెంబడి ర్యాలీ నిర్వహిస్తున్న అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, జోనల్ కమిషనర్ అంబేడ్కర్

పటమట(విజయవాడ తూర్పు): మిషన్ క్లీన్ కృష్ణా-గోదావరిలో భాగంగా 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆధ్వర్యంలో బందరుకాల్వ వెంబడి ఉన్న ప్రాంతాల్లో చెత్త, ఇతర వ్యర్థాలను నిరోధించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సాంబమూర్తి రోడ్డులో వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మిషన్ లక్ష్యాలను సాధించడానికి, నగరాన్ని ఉత్తమంగా చూడగలిగేలా నగర పాలక సంస్థకు పౌరుల నుంచి షరతులు లేని సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ మిషన్‌లో భాగంగా వీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది నగర పౌరులతో కలిసి బందరు, ఏలూరు, రైవస్ కాల్వల వెంబడి ఉన్న చెత్త కుప్పలను తొలగించి, లిక్విడ్ డిశ్చార్జి, బహిరంగ మలవిసర్జన కేంద్రాలను గుర్తించి, కాల్వల్లో ఘన వ్యర్థాలను పరవేయకుండా అవగాహన కల్పించారు. సర్కిల్-3 జోనల్ కమిషనర్ అంబేడ్కర్, ఏఎంవోహెచ్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



మాట్లాడుతున్న అడపా శేషు

కృష్ణలంక(విజయవాడ తూర్పు):మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాపు కార్పొరేషన్ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు అన్నారు. కృష్ణలంక, 20వ డివిజన్, హైస్కూల్ రోడ్డులోని పొదుపు సంఘాల సమావేశ మందిరంలో సోమవారం త్రిశక్తి మహిళా స్లమ్ సమాఖ్య, అమృతమయి మహిళా సమాఖ్య పొదుపు సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అడపా శేషు మాట్లాడుతూ మహిళల పేరు మీదనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. బ్యాంకుల ద్వారా అందజేస్తున్న రుణ ఆర్థిక సహాయాన్ని పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించినట్లయితే మరలా ఎక్కువ మొత్తంలో రుణాలను పొందవచ్చని సూచించారు. సీడీవో ఉమామహేశ్వరి, ఐబీ విజయకుమారి, టీఈ మమత, సీవో బాబు, ఆర్పీలు పుష్పవల్లి, వై.అంతుమదేవి, అధ్యక్ష కార్యదర్శులు డి.నాగలక్ష్మి, కోటేశ్వరి, కోశాధికారి కళావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్‌లైన్‌ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి.హరిబాబు తెలిపారు. రామచంద్రనగర్, గణేష్‌నగర్, కరెన్సీనగర్, కనకదుర్గానగర్‌లలో సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'నీతో' చిత్రం వినూత్న కథతో తెరకెక్కించాం

దర్శకుడు బాలు శర్మ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హీరో అభిరామ్ వర్మ, హీరోయిన్ సాత్విక రాజ్ జంటగా నటించిన 'నీతో' చిత్రం వినూత్నమైన కథతో తెరకెక్కించినట్లు దర్శకుడు బాలు శర్మ తెలిపారు. పూర్తి ఫ్యామిలీ రొమాంటిక్ డ్రామా చిత్రమని ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారన్నారు. ఈ నెల 14న చిత్రం విడుదల కాబోతుందని తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు బాలు చిత్ర విశేషాలను వివరించారు. తనకు ఇది తొలి చిత్రమని, చిత్రానికి పనిచేసిన టెక్నీషియన్స్ చాలా సినిమాలకు చేసిన అనుభవం కలిగిన వ్యక్తులన్నారు. చిత్రం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా హీరో అభిరాం వర్మ మాట్లాడుతూ ఈ చిత్రం ఒక చక్కని ఫ్యామిలీ డ్రామా అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ గా వివేక్ సాగర్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ స్వరన్, ఎడిటర్ మార్తాండ కె వెంకటేష్ తదితరులు వర్క్ చేసి అద్భుతంగా తెరకెక్కించారని వివరించారు.

● పేదలకు ఉచితంగా పుల్కాలు



విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందే పేదలు, వారి వెంట ఉండే సహాయకులకు శ్రీ వాసవీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పోషకాహారం అందిస్తున్నారు. తిన్నన్ని పుల్కాలతో పాటు కందిపప్పు, పెసర పప్పు, శనగలు, అలసందలు, సొరకాయ, దోసకాయ, టమాట, ఆకుకూర తదితర పదార్థాలతో కూరలు తయారు చేసి పుల్కాలతో పాటు వడ్డిస్తున్నారు. రోజూ 1500 మందికి పుల్కాలు పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేకమైన యంత్రాలపై నిత్యం నాలుగైదు వేల పుల్కాలు తయారు చేసి పేదలకు ఉచితంగా ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





వీఎంసీ స్పందనలో 8 అర్జీలు

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలో సోమవారం నిర్వహించిన స్పందనలో 8 అర్జీలను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వీకరించారు. కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు అర్జీ దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రణాళిక విభాగంపై -05, ప్రజారోగ్యం విభాగంపై -01, రెవెన్యూ విభాగంపై -02 వచ్చాయి. అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, సీఈ యం. ప్రభాకర్, సీఎంవోహెచ్ డాక్టర్ పి. రత్నావళి, యూసీడీ ప్రాజెక్ట్ అధికారి శకుంతల, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి. వెంకటలక్ష్మి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంపై ఒకటి, పట్టణ ప్రణాళిక విభాగంపై ఒక అర్జీ రాగా, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో ఇంజినీరింగ్‌పై ఒకటి, పట్టణ ప్రణాళిక విభాగంపై ఒక అర్జీ వచ్చాయి. సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో ఎలాంటి అర్జీలు రాలేదు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు



సత్యనారాయణపురంలో పర్యటిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. 33వ డివిజన్ బీఆర్‌టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం. జీఎస్ రాజు రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. సైడ్ డ్రెయిన్లు, వర్షపు నీటి పారుదల విధానాన్ని పరిశీలించారు. వర్షం నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. జీఎస్ రాజు వీధిలో సెంట్రల్ డివైడర్‌లో మొక్కలను ఖాళీ లేకుండా ఏర్పాటు చేయాలని ఉద్యాన వన విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన 38, 45 డివిజన్‌లలో భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న వీఎంసీ స్థలాలను పరిశీలించారు. చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థతోనే మంచి మానసిక ఆరోగ్యం

ఏపీ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ సభ్యుల వెల్లడి



విజయ చిహ్నం చూపుతున్న సైకాలజిస్టులు డాక్టర్ టీఎస్‌రావు, గర్రే శంకరరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుటుంబ సభ్యులంతా కలిసి జీవించడంలోనే మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఏపీ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (ఏపీసీపీఏ) అధ్యక్ష, ఉపాధ్యక్షుడు డాక్టర్ టీఎస్‌రావు, డాక్టర్ గర్రే శంకరరావు తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ సభ్యులు సూర్యారావుపేటలోని సిమ్స్ హాస్పటల్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ సమావేశపు హాల్లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టీఎస్‌రావు, డాక్టర్ గర్రే శంకరరావు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు, ఆధ్యాత్మిక ఆరోగ్యం కూడా ముఖ్యం అన్నారు. ఎదుటి వారితో చిరునవ్వుతో మాట్లాడటం, ఆటలు, పాటలు, రిక్రియేషన్, అందరితో కలిసి మెలసి ఉండటం ద్వారా మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఒంటరి జీవితాలతో మానసిక అసమతుల్యత ఏర్పడుతుందని చెప్పారు. మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందని పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాలకు తమ అసోసియేషన్ సభ్యులు వెళ్లి కరోనా రోగుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించినట్లు తెలిపారు. కరోనా తర్వాత మానసిక సమస్యలు ఎక్కువైనట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పాజిటివ్ ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. సైకాలజిస్టులు శ్రావణి, డాక్టర ఆర్. రామకృష్ణ, ఎల్. వెంకటేశ్వరరావు, రమాదేవి, డి.దాక్షాయణి, కాండ్రు లక్ష్మి, దీప్తి, జ్యోతి, అమూల్య పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై లోకో పైలెట్‌లకు అవగాహన



మాట్లాడుతున్న ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జయమోహన్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రిక్ ట్రాక్షన్ అండ్ ట్రెనింగ్ సెంటర్)లో లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లకు మానసిక ఆరోగ్యంపై సెమినార్ నిర్వహించారు. ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్, సైకాలజిస్ట్ డాక్టర్ జయమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మానసిక ఆరోగ్యంపై మాట్లాడారు. ముందుగా ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేర్చడంలో క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్న లోకో పైలట్‌లను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. మానసిక ఒత్తిడి, ఆందోళన, విచారం, నిరాశల నుంచి బయటపడేందుకు ఇతరులతో సంభాషించడం ఉత్తమ మార్గం అని చెప్పారు. తమలోని మానసిక అనారోగ్యానికి కారణమైన ఒత్తిడి, భయం, విచారం వంటి ప్రతికూల భావోద్వేగాలను గురించి, వాటి నివారణ కోసం చేపట్టాల్సిన స్వీయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ రోజువారి విధుల్లో వ్యక్తులు ఎదుర్కొంటున్న వివిధ రకాల ఒత్తిళ్లకు మూల కారణాలను, వాటి వల్ల వ్యక్తి మానసిక ప్రవర్తనలో వచ్చే మార్పులను వివరించారు. వాటి నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం, శ్వాస పద్ధతులు, మెడిటేషన్‌లు చేయడం సరైన మార్గం అన్నారు.

యోగా మాస్టర్ సత్యనారాయణ, ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శారద, ఈటీటీసీ ప్రిన్సిపాల్ వెంకటేష్, పీఆర్‌ఓ నుస్రత్ ఎం.మండ్రుప్కర్, లోకో పైలట్‌లు తదితరులు పాల్గొన్నారు.

యథాతథ స్థానాలకు తరలింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):దసరా ఉత్సవాలు ముగియడంతో ప్రసాదాల కౌంటర్లు, కేశకండనశాల, అన్న ప్రసాద వితరణలను యథాతథ స్థానాలకు తరలించారు. అమ్మవారి లడ్డూ, పులిహోర విక్రయించే ప్రసాదాల కౌంటర్లను మహా మండపం గ్రౌండ్‌ఫ్లోర్ లోకి, కేశకండనశాలను దుర్గాఘాట్ ఎదురుగా ఉన్న అరండల్ సత్రంలోకి, అన్న ప్రసాద వితరణను మహా మండపం రెండో అంతస్తుకి మార్పు చేశారు. మరో వైపున సోమవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ షెడ్లు, క్యూలైన్లను సిబ్బంది తొలగిస్తున్నారు. క్యూలైన్ల తొలగింపు సందర్భంగా ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

ఏఎంసీ నగర కార్యదర్శిగా ఎండీ దస్తగిర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్):ఆజాద్ ముస్లిం కమిటీ (ఏఎంసీ) నగర కార్యదర్శిగా ఎండీ దస్తగిర్ ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. ముస్లిం మైనార్టీకు అండగా ఉంటామన్నారు.


చిలకలూరిపేటలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తున్న మంత్రి విడదల రజిని


నంద్యాలలో సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

సంక్షేమాభివృద్ధికి సలాం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. గ్రామ గ్రామానా ప్రజలు ఎదురేగి నాయకులకు స్వాగతం పలికారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఇంటికి వచ్చి సమస్యల గురించి అడుగుతుండటంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని సమస్యల పరిష్కారం కోసం నాయకులు అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో తమకు అందిన సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 95 శాతం హామీలను అమలు చేసిందని, రానున్న కాలంలో మరింత లబ్ధి చేకూరుస్తుందని నాయకులు వివరించారు.


పార్వతీపురం మన్యం జిల్లా పద్మాపురంలో మహిళలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర


ఒంగోలులో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

పేదల 'ఉపాధి'కి గండికొట్టాలని ప్రయత్నం

- చంద్రబాబు, టీడీపీ నేతలపై ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు మండిపాటు



సాక్షి, అమరావతి: కరోనా వంటి విపత్తు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా పేదలకు ఉపాధి కల్పిస్తే.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, కొందరు ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ పథకం గురించి తప్పుడు సమాచారంతో ఫిర్యాదులు చేస్తూ కూలీలకు పనిలేకుండా చేసి వారి జీవనోపాధికి గండికొట్టాలని చూస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. 2020 జూలై 16న, గత ఏడాది జూలై 14న, నవంబర్ 26న, ఈ ఏడాది ఆగస్టు 22న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు ఫిర్యాదులు చేశారని తెలిపారు. అవన్నీ తప్పుడు ఫిర్యాదులు కావడంతో కేంద్రం ఎలాంటి చర్యలకు పూనుకోలేదని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకం అములులో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు, మార్గదర్శకాలు అతిక్రమించలేదని తెలిపారు. రాష్ట్రంలో పేదల ఉపాధికి గండి కొట్టేలా చంద్రబాబుకు మద్దతు పలికే పత్రికలు కూడా తప్పుడు కథనాలు రాస్తున్నాయని పేర్కొన్నారు. నిరాధారమైన, అవాస్తవమైన వివరాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేవారు.

మహిళలపై దౌర్జన్యాలు టీడీపీకి నిత్యకృత్యాలా?

- టీడీపీ ఎమ్మెల్యే 'నిమ్మల' తీరుపై వైఎస్సార్‌సీపీ మహిళా నేతల ఆగ్రహం


నల్ల బెలూన్లతో మహిళల నిరసన

పాలకొల్లు సెంట్రల్: మహిళల పట్ల దౌర్జన్యం, వారిని అగౌరవ పరచడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్యలా ఉందని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు మండిపడ్డారు. అమరావతి రైతుల పాదయాత్రపై ప్రశ్నించిన మహిళ పట్ల పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్ వద్ద సోమవారం వారు నల్ల బెలూన్లతో ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే ఫ్లెక్సీని దహనం చేశారు. వైఎస్సార్ సీపీ మహిళా నేతలు మాట్లాడుతూ మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యే రామానాయుడు తన పదవికి రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యలమంచిలి ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్‌లు దిడ్ల మణివజ్రం, కడలి నాగమణి, మాజీ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

జోరుగా టిడ్కో ఇళ్ల పంపిణీ

- మండపేటలో లబ్ధిదారులకు 2,720 యూనిట్లు అందజేత
- 15న మంగళగిరి, 21న జీవీఎంసీలో పంపిణీ
- ఈ నెలలో 20 వేలకు పైగా ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు.. ఇప్పటిదాకా 44 వేలకు పైగా టిడ్కో ఇళ్ల పంపిణీ
- గృహ సముదాయాల్లోనే రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి తాళాలు అందజేత
- డిసెంబర్ నాటికి మొత్తం 2.62 లక్షల ఇళ్ల పంపిణీ లక్ష్యం


మండపేటలోని టిడ్కో ఇళ్లు

సాక్షి, అమరావతి: పట్టణ ప్రాంత పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసే ప్రక్రియ వేగం పుంజుకుంది. కోనసీమ జిల్లా మండపేట పురపాలక సంఘం పరిధిలో నిర్మించిన ఇళ్లలో 2,720 యూనిట్లను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ నెల 15న మంగళగిరి పరిధిలో, 21న జీవీఎంసీలో కూడా ఇళ్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేశారు. వీటితో పాటు తెనాలి, పొన్నూరు, చిలకలూరిపేట నంద్యాలతోపాటు మొత్తం తొమ్మిది పట్టణాల్లో 20,176 ఇళ్లను పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది జూన్ 23న విజయనగరంలో ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆగస్టు నాటికి 39,820 యూనిట్లను టిడ్కో అధికారులు అందజేశారు. అలాగే, సెప్టెంబర్‌లో ఆదోనిలో 2,500, ఎమ్మిగనూరులో రెండువేల యూనిట్లను పంపిణీ చేశారు. నిజానికి వర్షాల కారణంగా పంపిణీ ఆలస్యమైనా ఆ తర్వాత నిర్మాణాలు పూర్తిచేసుకున్న చోట అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో మౌలిక వసతులు కల్పించి నెలన్నర వ్యవధిలో 39,820 యూనిట్లను పంపిణీ చేశారు. మొత్తం రెండు నెలల వ్యవధిలో 44,320 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. ఈ నెలలో మరో 20,176 యూనిట్లను అందించనున్నారు.

గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది నిర్మాణం

మరోవైపు గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంచేసిన టిడ్కో ఇళ్ల పథకాన్ని ప్రస్తుత వైఎస్సార్ సీపీ సర్కారు పునరుద్ధరించి 88 పట్టణ స్థానిక సంస్థల్లో 2,62,216 ఇళ్లను జీ ప్లస్ త్రీ విధానంలో నిర్మాణం చేపట్టింది. వీటిలో 300 చ.అ. విస్తీర్ణంగల 1,43,600 ఇళ్లను ఒక్క రూపాయికే అందించడంతో పాటు వీటికయ్యే ఆర్థిక భారం రూ.3,805 కోట్లను ప్రభుత్వమే భరిస్తోంది. ఇక 365 చ.అ., 430 చ.అ. విస్తీర్ణం కలిగిన 1,18,616 ఇళ్ల నిర్మాణం కూడా వేగంగా పూర్తి చేస్తోంది. అంతేకాక, లబ్ధిదారులు అందరికీ ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకు దాదాపు రూ.1,000 కోట్లను ప్రభుత్వమే భరించి ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తోంది. టిడ్కో ఇళ్ల పత్రాలు, తాళాలు గృహ సముదాయ ప్రాంగణాల్లోనే అందజేస్తున్నామని, ఇకపైనా అదే విధానం కొనసాగుతుందని టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ 'సాక్షి'కి తెలిపారు. అక్టోబర్ నెల పంపిణీ ప్రక్రియ మండపేట నుంచి ప్రారంభించామని టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్ చెప్పారు. ఇళ్ల పంపిణీ ప్రాంగణంలోనే ఇంటి తాళాలతో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఈ నెలలో పంపిణీ చేయనున్న ఇళ్లు..

శ్రీకాకుళం	1,280	నంద్యాల	4,000
జీవీఎంసీ	3,000	తెనాలి	848
రామచంద్రపురం	1,088	పొన్నూరు	1,000
మంగళగిరి	1,728	మొత్తం:	17,456
చిలకలూరిపేట	4,512		

ఇప్పటిదాకా లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లు..

తేదీ	ప్రాంతం	పంపిణీ చేసిన ఇళ్లు
08.10.2021	నెల్లూరు (వెంకటేశ్వరపురం)	4,800
23.06.2022	విజయనగరం (సారిపల్లి)	2,656
30.06.2022	తాడేపల్లిగూడెం (కొండ్రుప్రోలు)	2,272
30.06.2022	పెద్దాపురం (వలుతిమ్మాపురం)	1,728
30.06.2022	సామర్లకోట (జగ్గంవారిపేట-ఉప్పవారిసత్రం)	1,056
01.07.2022	రాజమండ్రి (బొమ్మూరు-తొర్రేడు)	3,424
16.07.2022	గూడూరు (గాంధీనగర్)	5,120
16.07.2022	ఆత్మకూరు (నెల్లూరుపాలెం)	1,056
01.08.2022	కర్నూలు (జగన్నాథగట్టు)	6,000
05-08-2022	భీమవరం (గునుపూడి)	8,352
05-08-2022	పాలకొల్లు (పెంకుళ్లపాడు)	3,356
23-09-2022	ఆదోని	2,500
	ఎమ్మిగనూరు	2,000
	మొత్తం:	44,320

పేదలకు అండగా ప్రభుత్వం..

గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయకుండా వదిలేసింది. మా ప్రభుత్వం 2.62 లక్షల ఇళ్లల్లో 1.43 లక్షల యూనిట్లు నిరుపేదలకు చెందినవే. వీటికి గత పాలకులు ఒక్కో యూనిట్‌కు రూ.2.60 లక్షల ధర నిర్ణయించి, బ్యాంకు రుణాలు మంజూరు చేశాక, ప్రతి నెలా రూ.3 వేల చొప్పున 20 ఏళ్లు చెల్లించాలని చెప్పింది. అలా చెల్లిస్తే ఒక్కొక్కరు మొత్తం రూ.7.20 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే.. 1.43 లక్షల మందిపైనా సుమారు రూ.10 వేల కోట్లకు పైగా భారం పడుతుంది. కానీ, సీఎం వైఎస్ జగన్ 300 చ.అ. ఇళ్లను ఒక్క రూపాయికే ఇచ్చారు. అంతేకాక.. రూ.6 వేల కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. డిసెంబర్ నాటికి మొత్తం 2.62లక్షల యూనిట్లను అందజేస్తాం.



– డాక్టర్ ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

పవన్ నోట పూటకో మాట!

దుమ్మెత్తి పోస్తున్న నెటిజన్లు

■ **మరో ఉద్యమం రాదా?**

'కేవలం రాజధాని (అమరావతి) చుట్టూ అభివృద్ధి కేంద్రీకృతమైతే ఉత్తరాంధ్ర ఏం కావాలి? రాయలసీమ ఏం కావాలి? ప్రకాశం జిల్లా ఏం కావాలి? తెలంగాణ ఉద్యమం వచ్చినట్లుగా ఇంకో ఉద్యమం రాదా?'
– 2018లో గుంటూరు జిల్లాలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు

■ **ఎందుకీ గర్జన..?**

'విశాఖలో ఎందుకీ గర్జన? మూడు రాజధానులతో రాష్ట్రాన్ని ఇంకా అధోగతి పాలు చేయటానికా? వలసలు ఆపలేకపోయినందుకా? రుషికొండను ధ్వంసం చేసి మీకోసం భవనం నిర్మిస్తున్నందుకా? వైఫల్యాలు దాచేసి కులాల మధ్య చిచ్చు రేపినందుకా? విద్యుత్ చార్జీలు భారీగా పెంచినందుకా?'
– తాజాగా పవన్ కళ్యాణ్ ట్వీట్లు

సాక్షి, అమరావతి: కేవలం అమరావతి పరిసరాల్లోనే అభివృద్ధి అంతా కేంద్రీకృతమైతే ఉత్తరాంధ్ర, రాయలసీమ పరిస్థితి ఏం కావాలని గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రశ్నలు కురిపించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తాజాగా విశాఖ గర్జన సభపై చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు. గతంలో పవన్ జనసేన బహిరంగ సభలో మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లు వైరల్ అవుతున్నాయి. పవన్ మాట ఎందుకు మారుస్తున్నారంటూ పలువురు రీ ట్వీట్ చేశారు. మీపై ఏమి ప్రభావం చూపాయో చెప్పాలంటూ నిలదీస్తున్నారు.

15 నుంచి పవన్ విశాఖ పర్యటన

పవన్ కళ్యాణ్ ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని జనసేన ఒక ప్రకటనలో పేర్కొంది. 15, 16, 17వ తేదీల్లో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నాయకులతో సమావేశమవుతారు. 16న విశాఖలో ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

పవన్ ట్వీట్లకు మంత్రుల స్ట్రాంగ్ కౌంటర్

సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వరుస ట్వీట్లకు రాష్ట్ర మంత్రులు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'ప్యాకేజీ కోసం మొరిగే వాళ్లకు గర్జన అర్థమవుతుందా' అని ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు ట్వీట్ చేశారు. 'దత్త తండ్రి తరఫున దత్తపుత్రుడి మియావ్ మియావ్'... అంటూ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ట్వీట్ చేశారు. కుంభకర్ణుడిలా 6 నెలలు నిద్రపోయి పవన్ విచిత్రమైన ట్వీట్ చేశారని, టీడీపీ, బీజేపీతో జత కట్టినప్పుడు ఉత్తరాంధ్రలో వలసలు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. రోజుకో మాట, పూటకో వేషం వేసుకుంటే ప్రజలు కొడతారని మంత్రి ఆర్కే రోజా హెచ్చరించారు. 29 గ్రామాల కోసం 26 జిల్లాలు ఫణంగా పెట్టలేమన్నారు. అమరావతిలోనే కాదు రాయలసీమ, ఉత్తరాంధ్రలోనూ రైతులున్నారని మంత్రి రోజా గుర్తు చేశారు. అమరావతి ఉద్యమం కాదు.. అత్యాశపరుల ఉద్యమం ఇదన్నారు. 'పవన్ కల్యాణ్ చంద్రబాబు చెంచా. పవన్ నువ్వు ఉండేది హైదరాబాద్‌లో. షూటింగ్స్ విదేశాల్లో. ఏపీలో గ్రౌండ్ రియాలిటీస్ నీకేం తెలుసు?. చంద్రబాబు ఏ ట్వీట్ పెట్టమంటే పవన్ అది పెడతాడు. పవన్ ట్వీట్లు సినిమా డైలాగుల్లానే ఉంటాయి. 2024లో పార్టీని చంద్రబాబుకు అమ్మేయడానికి పవన్ సిద్ధంగా ఉన్నాడు. ట్విట్టర్‌లో కాదు పవన్‌కు దమ్ముంటే విజయవాడ రావాలి. పవన్‌ను ప్రశ్నించిన అంశంపై నేను చర్చకు సిద్ధం' అని మంత్రి జోగి రమేష్ సవాల్ విసిరారు.

వికేంద్రీకరణ కోసం



చేయిచేయి కలిపి..

వికేంద్రీకరణకు మద్దతుగా సోమవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు రాజధానులకు మద్దతుగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని.. అచ్చెన్నాయుడుకు దమ్మంటే విశాఖలో పరిపాలనా రాజధాని వద్దని తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. – టెక్కలి



చైతన్యదీపం వెలిగించి..

వికేంద్రీకరణకు మద్దతుగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభమై పాటిమీద సెంటర్, ఓవర్ బ్రిడ్జి సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, గణపతి సెంటర్ల మీదగా పార్టీ కార్యాలయం వద్దకు చేరకుంది. ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. – నిడదవోలు

రాజధానులు ఎవరూ నిర్మించరు

- ఆ కాన్సెప్ట్ తెచ్చింది చంద్రబాబే
- ఎమ్మెల్యే కొడాలి నాని ఫైర్



గుడివాడ టౌన్: ప్రపంచంలోని ఏ దేశంలో, ఏ రాష్ట్రంలోనూ రాజధాని నిర్మించిన చరిత్ర లేదని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. రాజధాని నిర్మాణం అనే కాన్సెప్ట్ తెచ్చింది చంద్రబాబే అని అన్నారు. ఆయన సోమవారం కృష్ణాజిల్లా గుడివాడలో విలేకరులతో మాట్లాడారు. ఏ దేశంలో, ఏ రాష్ట్రంలో రాజధాని నిర్మించారో తెలుగుదేశం చవటలు చెప్పాలన్నారు. అన్ని సౌకర్యాలు, వెసులుబాటు ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని అక్కడ నుంచి పాలన కొనసాగిస్తే అదే రాజధాని అవుతుంది తప్ప రాజధాని నిర్మించి పాలనచేసిన చరిత్ర లేదని చెప్పారు. దానికి కొన్ని నిధులు వెచ్చించి ఇంకా అభివృద్ధి చేస్తే అది పెద్ద నగరంగా మారి అనంతరం పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యూనిట్లు ఏర్పడి మహానగరాలుగా మారతాయని పేర్కొన్నారు. విశాఖపట్నం ఎప్పుడో నిర్మాణమైన మహానగరమన్నారు. అక్కడ 25 లక్షల జనాభా, సహజసిద్ధమైన ఓడరేవు, లక్షలమందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఆరులేన్ల జాతీయ రహదారి వంటివి గతంలోనే ఉన్నాయి కనుక అక్కడ పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని, ఆ ప్రాంతంలో ప్రజలు బాగుపడతారని చెప్పారు. అదేవిధంగా కర్నూలు గతంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉందని గుర్తుచేశారు. అక్కడ హైకోర్టు ఏర్పాటు చేసి న్యాయపరమైన అన్ని శాఖలు నెలకొల్పితే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం సంకల్పం

ఈ విధంగా రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ ద్వారా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. దీన్ని ఓర్వలేక 420 చంద్రబాబు అమరావతి రైతులకు అన్యాయం అంటూ ఆయన సామాజికవర్గానికి చెందిన కొన్ని కుటుంబాల అభివృద్ధిని కాంక్షిస్తూ దొంగయాత్రలు చేపట్టారని విమర్శించారు. చంద్రబాబు మాటల భ్రమలోపడి ఆయన సామాజికవర్గానికి చెందిన కొందరు పిచ్చిపిచ్చి యాత్రలు చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చారని నిరసన దీక్షలు చేసేవారు... ముందుగా ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి, ఆయన్ను అధికారంలో నుంచి దించేసిన దుర్మార్గుడు చంద్రబాబును బయటకు పంపేందుకు దీక్షలు చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌ను మానసికంగా వేధించి మరణానికి కారకులైన వారిని, ఆయనకు 'భారతరత్న' వచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోని వెధవల్ని పార్టీ నుంచి బయటకు సాగనంపేలా దీక్షలు చేయాలని కోరారు. ఎన్టీఆర్ పేరున ఒక జిల్లా ఏర్పాటు చేసి ఆయనకు గౌరవం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నిందించడం సరికాదని కొడాలి నాని పేర్కొన్నారు.

డబ్బా పెరుగన్నం.. డబ్బుల సంచీ!

- పవన్ కళ్యాణ్‌పై మంత్రి అమర్‌నాథ్ విమర్శలు
- టీడీపీ నేతలకు దమ్ముంటే అమరావతి కోసం రాజీనామాలు చేయాలని సవాల్

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అమరావతి వెళ్లి డబ్బా పెరుగన్నం తిని డబ్బుల సంచి సర్దుకుని వచ్చారని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. అమరావతి గురించి గతంలో పవన్ కళ్యాణ్ చేసిన విమర్శలను ప్రజలు ఎవరూ మరచిపోలేదన్నారు. 'ఆయనకు నిలకడలేదు. పరిణతి లేకుండా మాట్లాడుతున్నారు. ట్విట్టర్‌లో ఒక మాట.. మైకు ముందు మరో మాట! ఇదీ పవన్ తీరు. కర్నూలుపై మనసులో మాట ఎటు పోయింది? ఆయన ఆలోచనలు పూర్తిగా దారి తప్పాయి' అని విమర్శించారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.



దమ్ముంటే రాజీనామాలు చేయండి

'అందరి ఆకాంక్షలకు అనుగుణంగా మూడు రాజధానులను సీఎం జగన్ ఏర్పాటు చేస్తున్నారు. మూడు రాజధానులకు మద్దతుగా 15న విశాఖలో విశాఖ గర్జన నిర్వహించాలని జేఏసీ నిర్ణయించింది. టీడీపీ నేత అచ్చెన్నాయుడు అమరావతిని రాజధానిగా కోరుకుంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. దమ్ముంటే అమరావతి కోసం కుప్పం ఎమ్మెల్యే పదవికి చంద్రబాబు రాజీనామా చేయాలి. అప్పుడు వారికే తెలిసొస్తుంది. మూడు రాజధానులే అజెండాగా ఎన్నికలకు వెళతాం. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం. పాదయాత్రను ఇప్పటికైనా వారు విరమించాలి. విశాఖ ప్రజలు అచ్చెన్నాయుడిని చూసి భయపడుతున్నారు. విశాఖలో టీడీపీ నేతల చేతుల్లో ఉన్న 450 ఎకరాల భూమిని కాపాడాం. అమరావతి విషయంలో టీడీపీ, జనసేన ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని అన్నారు.

షూటింగ్ గ్యాప్‌లో జనంలోకి...

పవన్‌పై డిప్యూటీ సీఎం సత్యనారాయణ ఫైర్



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఓ ట్విట్టర్ మాస్టర్ అని డిప్యూటీ సీఎం (దేవదాయ శాఖ మంత్రి) కొట్టు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ట్వీట్లతో ఆయన ప్రజలతో ఉన్నట్లుగా భావిస్తుంటారని ఎద్దేవా చేశారు. షూటింగ్ గ్యాప్ దొరికినప్పుడు ఆర్నెల్లకు, తొమ్మిది నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని ధ్వజమెత్తారు. చంద్రబాబును అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్న పవన్ తీరును సొంత సామాజిక వర్గం సైతం హర్షించడం లేదని చెప్పారు. దొడ్డిదారి రాజకీయాలను ప్రజలు ఎలా విశ్వసిస్తారని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల ముసుగులో శాంతియుత పాదయాత్ర పేరుతో అనుమతి పొందిన టీడీపీ నేతలు ఇష్టానుసారంగా కవ్వించే వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి సత్యనారాయణ మండిపడ్డారు. రాజధానికి మద్దతుగా పాదయాత్ర అంటూ కొవ్వెక్కిన మాటలు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. 'పాదయాత్రలో 600 మంది మాత్రమే పాల్గొంటారని అనుమతి తీసుకున్నారు. అసలు ఆ యాత్రకు, టీడీపీకి సంబంధం లేదని చంద్రబాబు చెప్పారు. మరి ఎక్కడికక్కడ టీడీపీ నేతలు పాల్గొంటూ ఇష్టమొచ్చినట్టు వ్యాఖ్యలు చేయడం ఏమిటి? వాటిని కోర్టు దృష్టికి తెస్తాం' అని పేర్కొన్నారు.



● క్రీడాకారుల శిక్షణా కార్యక్రమంలో...

ఆటలకు మానసిక బలం

ఆటల్లో ఒకరు గెలిస్తే మరొకరు ఓడాలి. గెలిచినప్పుడు పొంగిపోకుండా ఓడినప్పుడు కుంగిపోకుండా ఉండగలిగేవారు స్పోర్టివ్ స్పిరిట్ ఉన్నావారు. కాని అందరూ అలా ఉండరు. ఆటల్లో రాణించాలంటే వారిని ఓటమి భయం వెంటాడుతూ ఉంటుంది. ప్రత్యర్థి గురించి ఆందోళనలు ఉంటాయి. చిన్నపిల్లల దగ్గరి నుంచి సీనియర్ ఆటగాళ్ల వరకూ ఈ ఒత్తిడి తప్పించుకోని వారు ఉండరు. మరి వీరికి సాయం? హిందోళ వంటి స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ను కలవడమే. 'మైండ్ లీడ్' అనే ప్రోగ్రామ్ ద్వారా ఆటగాళ్ల ఒత్తిడిని తొలగిస్తూ వారికి అవసరమైన మానసిక బలం అందిస్తోంది హైదరాబాద్ వాసి హిందోళ.



● రాహుల్ ద్రావిడ్‌తో...

'స్పోర్ట్స్ సైకాలజీ అనేది ఒకటుంటుందని మనలో చాలా మందికి తెలియకపోవచ్చు. దాని అవసరం ఏముందిలే అనుకోవచ్చు. కానీ ఈ రంగంలో ఈ సైకాలజీ అవసరం ఎంతో ఉంది' అంటోంది హైదరాబాద్ మాదాపూర్‌లో ఉంటున్న హిందోళ. అందుకు డియర్ కామ్రెడ్‌లోని ఒక సీన్‌ను ఉదాహరిస్తూ..

'లిల్లీ క్రికెటర్‌గా రాణిస్తున్న అమ్మాయి. రాష్ట్రస్థాయి క్రీడాకారిణి. మంచి నైపుణ్యం ఉన్న అమ్మాయి సడెన్‌గా డిప్రెషన్ బారిన పడుతుంది. ఎవరికీ అర్థం కాదు. ఎవరూ అర్థం చేసుకోలేరు. క్రికెట్టే లోకంగా బతికిన ఆ అమ్మాయి మూడేళ్లపాటు మానసికంగా ఒంటరైపోతుంది. ఆసుపత్రి పాలైన ఆ అమ్మాయిని హీరో వచ్చి ఆమెను మానసిక వేదన నుంచి బయటికి తీసుకొస్తాడు. అందరి జీవితాల్లోనూ అలాంటి హీరోలు ఉండకపోవచ్చు. కానీ, మానసిక స్థైర్యం ఇవ్వగలిగేవాళ్లు ఉండాలి.

ఇటీవల తొమ్మిదవ తరగతి చదువుతున్న ఓ అమ్మాయి బ్యాడ్మింటన్ చాలా బాగా ఆడేది. సడెన్‌గా అకాడమీకి రావడం మానేసింది. ఆ స్పోర్ట్స్ అకాడమీకి సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్న నేను ఏమైందని తెలుసుకోవడానికి వారి తల్లిదండ్రులను సంప్రదించాను. తనను కష్టపెడుతున్న సమస్యలు ఆమె తల్లిదండ్రులకు కూడా చెప్పుకోలేకపోయింది. తోటి వారి నుంచి వస్తున్న కామెంట్స్ ఆమెను ఆ ఆట నుంచి తప్పుకునేలా చేశాయి. ఈ విషయంపై కొన్నిరోజుల పాటు చేసిన కౌన్సెలింగ్ ఆమెలో మార్పు తీసుకువచ్చింది. లేదంటే, ఇదే ప్రభావం ఆమె చదువుమీద ఆ తర్వాత తన కెరియర్ మీద పడుతుంది. ముఖ్యంగా అమ్మాయిలకు బయటకు చెప్పుకోలేని ఎన్నో సమస్యలు ఉంటాయి. అవి కోచ్‌ల ద్వారా కావచ్చు, తోటి క్రీడాకారుల ద్వారా కావచ్చు, ఆత్మన్యూనత కావచ్చు, మరేవిధమైన మానసిక సంఘర్షణ అయినా కావచ్చు. ఇలాంటప్పుడు స్పోర్ట్స్ సైకాలజిస్టుల మద్దతు అవసరం అవుతుంది' అని వివరించింది ఈ మైండ్‌లీడ్ ఛాంపియన్.



● కె.హిందోళ, స్పోర్ట్స్ సైకాలజిస్ట్

అకాడమీలో సైకాలజిస్ట్‌గా..

తను చేస్తున్న వర్క్, ప్రణాళికల గురించి వివరిస్తూ – 'బెంగళూరులోని పదుకొనే ద్రావిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్'లో పనిచేస్తున్నాను. ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ అథ్లెట్స్‌తోనూ మాట్లాడుతుంటాను. దీంతో ఏ స్థాయిలో స్పోర్ట్ సైకాలజీ అవసరం అనేది మరింత క్షుణ్ణంగా అర్థమవుతుంది. చాలామంది క్రీడలలో మానసిక అంశాలకు సంబంధించిన విషయాలు ఎప్పుడూ పక్కన పెట్టేస్తారు. మన దేశంలో అయితే చాలా వరకు దీనిని విస్మరిస్తుంటారు. అందుకే, క్రీడాకారులందరికీ మానసిక శిక్షణను అందుబాటులో ఉంచాలని ఆన్‌లైన్‌లో మైండ్‌లీడ్ ప్రోగ్రామ్ ద్వారా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను.

బలమైన స్థితి

క్రీడలకు మానసిక బలం అవసరమని విదేశీయులకు బాగా తెలుసు. అందుకే వారు ప్రతి పోటీలో స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ల గైడెన్స్ తప్పక తీసుకుంటారు. మన దేశంలో కూడా దీనిని గుర్తించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే మన దగ్గర ఇంకా రకరకాల భావజాలాలు ఉన్నాయి. అమ్మాయిలను ఓ స్థాయి వరకే క్రీడలకు పరిమితం చేస్తుంటారు. కుటుంబం, బయట, అకాడమీ, స్కూల్, కాలేజీ.. ప్రతిచోటా వెనక్కి లాగడానికే ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఈ విధానంలో మార్పులు తీసుకురావడానికి ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాను. దీని ద్వారా అథ్లెట్లు, కోచ్‌లు, బృందాలు, తల్లిదండ్రులకు, సహాయక సిబ్బందికి వినూత్నమైన విధానంలో మానసిక శిక్షణతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నాను.

ఈ భిన్నమైన కోర్సును ఎంచుకున్నప్పుడు మా అమ్మ మాలతి, నాన్న సుధాకర్‌ల మద్దతుగా నిలిచారు. వారి వల్లే ఈ రంగంలో మరింతగా కృషి చేయగలుగుతున్నాను. ఈ మైండ్ లీడ్ ప్రోగ్రామ్ ద్వారా స్కూల్స్ కాలేజీలలో వర్క్‌షాప్స్ నిర్వహించబోతున్నాను. గ్రామీణ స్థాయి క్రీడాకారులలోనూ మానసిక చైతన్యం నింపే దిశగా కృషి చేస్తున్నాను' అని వివరించింది ఈ యువ స్పోర్ట్స్ సైకాలజిస్ట్.

ఆటలు పరిచిన బాట

'చిన్నప్పటి నుంచి నాకు ఆటల్లో ఆసక్తి ఎక్కువ. బహుశా కేంద్రీయ విద్యాలయంలో చదవడం, అక్కడ అన్ని ఆటల్లో పోటీపడటం వల్ల క్రీడలు నా జీవితంలో కీలకమయ్యాయి. నా దృష్టి ఎక్కువగా బ్యాడ్మింటన్‌పై ఉండేది. అదే నన్ను ప్రొఫెషనల్ స్పోర్ట్స్ పర్సన్స్‌కి పరిచయం చేసింది. ఈ రంగంలో కొత్త కొత్త వ్యక్తులను కలిశాను. గెలుపు కోసం ప్రయత్నించేవారితో కలిసి ఉండటం వల్ల ప్రతిరోజూ నన్ను నేను కొత్తగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. ఇందులో ఉండే చేదు అనుభవాలు, పంచుకున్నవారి వేదనలు.. ఇవన్నీ నా కెరియర్‌ని డిసైడ్ చేసుకునేలా చేశాయి. అందుకే, స్కూల్ చదువు పూర్తవగానే స్పోర్ట్స్ సైకాలజీ దిశగా అడుగులు వేశాను. దీనికోసం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకాలజీ అండ్ రీసెర్చ్ నుండి సైకాలజీ, జర్నలిజం అండ్ ఉమన్ స్టడీస్‌లో డిగ్రీ చేశాను. ఆ తర్వాత స్పోర్ట్స్ సైకాలజీలో మాస్టర్స్ చేయడానికి మణిపూర్ వెళ్లాను. ఇక్కడే క్రీడలలో మైండ్‌ఫుల్‌నెస్‌పై ప్రయోగాత్మక పరిశోధన చేశాను. భారతదేశంలోని అథ్లెట్ల కోసం సొంతంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించాను.'

– నిర్మలారెడ్డి

వైరల్

కబడ్డీ కబడ్డీ

చిన్నప్పుడెప్పుడో కబడ్డీ ఆడిన మహిళలు వీరు. ఛత్తీస్‌గఢ్ ఒలింపిక్స్‌లో వీరి అద్భుతమైన ఆట తీరును చూస్తే 'వావ్' అనిపిస్తుంది. అది సరే, ఒలింపిక్స్ ఛత్తీస్‌గఢ్‌లో కూడా జరుగుతాయా? మరి అదే విశేషం...



● ఆటల్లో... నువ్వా నేనా

పద్నాలుగు రకాల సంప్రదాయ ఆటలకు పూర్వవైభవం తీసుకురావడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'ఛత్తీస్‌గఢియా ఒలింపిక్స్' పేరుతో ఆటల పోటీలు నిర్వహిస్తోంది. కబడ్డీ, ఖోఖోలతో పాటు 'లంగ్డీ' 'బౌరా' 'ఒటి' 'గిల్లీ–దండ'... మొదలైన ఆటలు ఇందులో ఉన్నాయి. ఈ పోటీలలో భాగంగా ఒక గ్రామంలోని మహిళలు చీరెలు ధరించి కబడ్డీ ఆడుతున్న వీడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఐఏఎస్ అధికారి అవనీష్ షరన్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ రోజుల వ్యవధిలోనే మూడు లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'అంతర్జాతీయ స్థాయి ప్లేయర్స్‌కు ఏమాత్రం తీసిపోకుండా ఆడుతున్నారు. అద్భుతమైన నైపుణ్యం వీరి సొంతం' అని ప్రశంసించారు నెటిజనులు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఒక బామ్మ అయితే తన బాల్యంలోకి వెళ్లింది...'స్కూల్‌లో జరిగే కబడ్డీ పోటీల్లో నేను నంబర్‌వన్ ప్లేయర్‌ని. ఈ వీడియో చూస్తుంటే ఆ రోజులు కళ్ల ముందు కదలాడుతున్నాయి. నిజం చెప్పాలంటే ఈ వయసులోనూ నాకు మళ్లీ ఆడాలని ఉంది'

కొన్ని నెలల క్రితం...

రోమ్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న నన్స్ బృందం వీడియో, మెక్సికోకు చెందిన 71 సంవత్సరాల ఆండ్రియా లోపెజ్ అద్భుతంగా బాస్కెట్‌బాల్ ఆడుతున్న వీడియోలు వైరల్ అయ్యాయి. వీటి తరువాత బాగా వైరల్ అయింది ఈ ఛత్తీస్‌గఢ్ మహిళల కబడ్డీ.

బ్యూటిప్స్



ఈ మూడింటితో ఒత్తుగా.. పొడుగ్గా



● అల్లం తురుము టేబుల్ స్పూను, టీస్పూను ఆవాలు, ఐదు లవంగాలను తీసుకుని ఒక కాటన్ వస్త్రంలో మూటకట్టాలి. మీరు వాడుతోన్న హెయిర్ ఆయిల్‌ను గాజు సీసాలో పోసి, దానిలో ఈ మూటను మునిగేటట్లు పెట్టి ఒకరోజంతా సీసాను ఎండలో ఉంచాలి. మరుసటిరోజు ఈ నూనెను తలకు పట్టించి మర్దన చేయాలి. ఒకరోజంతా ఉంచుకుని తరువాతిరోజు తలస్నానం చేయాలి. ● ఇలా వారానికి ఒకసారి ఈ అయిల్‌ను తలకు పట్టించడం ద్వారా జుట్టురాలడం తగ్గి, ఒత్తుగా పొడవుగా పెరుగుతుంది. ● నూనె అయిపోయిన తరువాత మొదట చెప్పుకున్నట్లుగానే తాజాగా తయారు చేసుకుని వాడితే పదిహేను రోజుల్లోనే మార్పు కనిపిస్తుంది.

సాగుబడి
చిత్త కార్తె: అక్టోబర్ 10 నుంచి

జీవ కంచెకు జై!

- పొలం చుట్టూ కాక్టస్ జాతి ముళ్ల మొక్కలతో జీవ కంచె
- కోతులు, అటవీ జంతువుల బారి నుంచి పంటలకు నిరంతర రక్షణ
- 2 అడుగుల కాండం ముక్కలను పొలం చుట్టూ అడుగుకు ఒకటి నాటాలి
- ఒకటి-రెండేళ్లు జాగ్రత్తగా కాపాడుకుంటే చాలంటున్న మహారాష్ట్ర రైతు

కోతుల నుంచి, అడవి పందుల నుంచి లేదా సాధారణ పశువుల నుంచి పంటలను రక్షించుకోవటం తెలుగు రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో రైతులకు కత్తి మీద సాములా మారింది. ఈ సమస్యకు ఇనుప కంచెలు, సోలార్ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకొని రైతులు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటారు. అయితే, వాటి కన్నా బంజరు భూముల్లో పెరిగే బ్రహ్మజెముడు జాతికి చెందిన ముళ్ల మొక్కలను పొలం చుట్టూతా కంచెగా నాటుకుంటే మేలని మహారాష్ట్రకు చెందిన జగన్ ప్రహ్లాద్ భగడే అనుభవపూర్వకంగా చెబుతున్నారు.


ఆయనది అకోలా జిల్లాలోని ఖపర్‌వాది బద్రుక్ గ్రామం. ఆయనకు 30 ఎకరాల సాగు భూమి ఉంది. 'ఏ పంట వేసినా నీల్‌గాయ్, దుప్పులు, అడవి పందులు, కోతులు, పశువులు పాడు చేస్తూ ఉండేవి. ఎకరం పొలం చుట్టూ ఇనుప కంచె వేశాను. ఏడేళ్ల క్రితమే రూ. 40 వేలు ఖర్చయ్యింది. ఇక మొత్తం పొలం చుట్టూ కంచె వెయ్యాలంటే ఉన్న భూమిలో కొంత భాగాన్ని అమ్ముకోవటం తప్ప వేరే మార్గం లేదు.

బంజరు భూముల్లో కనిపించే కాక్టస్/బ్రహ్మజెముడు జాతి (యుఫోర్బియా లాక్టియా)కి చెందిన మొక్కల్ని పొలం చుట్టూ నాటాను. ఎకరానికి మహా అయితే రూ. 1,500 ఖర్చయ్యింది. అది కూడా కూలీలకు మాత్రమే. ఏడేళ్ల తర్వాత ఇప్పుడు మా పొలం చుట్టూ దట్టంగా అల్లుకున్న ఆకుపచ్చని ముళ్ల కంచె దుర్భేద్యమైన కోటలాగా నిలబడి ఉంది. కోతులు, అడవి జంతువుల బెడద అన్న మాటే లేదిప్పుడు. ఏ పంటైనా చేతికొస్తుందో లేదన్న బెంగ లేదు. అందరూ ఆశ్చర్యపడేంత స్థాయిలో పంటల దిగుబడి వస్తోంది. అంతేకాదు, బలమైన గాలుల నుంచి, చీడపీడల నుంచి పంటలను, మట్టిని రక్షించుకోగలుగుతున్నాను'అంటున్నారు బగడే సగర్వంగా. చుట్టుపక్కల బంజరు భూముల్లో నుంచి కాక్టస్ జాతి ముళ్ల మొక్కల కాండాలను కోసి ట్రాక్టర్ ట్రక్కులో వేసుకొని తెచ్చి.. 2 అడుగుల పొడవు ముక్కలను కత్తిరించి.. అడుగుకు ఒకటి చొప్పున పొలం చుట్టూతా నాటారు. మొదట్లో అందరూ అతన్ని పిచ్చోడు అని ఎగతాళి చేశారు. ఇప్పుడు నిశ్చింతగా పంట చేతికివస్తుంటే ఎంత తెలివైన పని చేశాడని పొగుడుతున్నారు. కట్టెలతో, బార్బ్‌డ్ వైర్‌తో లేదా రాళ్లతో కంచెను ఏర్పాటు చేసుకోవటం కన్నా దట్టంగా అల్లుకుపోయి 12 అడుగుల ఎత్తు వరకు ఎదిగిన ఈ జీవ కంచే (బయో ఫెన్స్) ఎంతో బాగుందని అందరూ అంటున్నారు. కాక్టస్ జాతి ముళ్ల మొక్కల కాండాల 2 అడుగుల ముక్కలను నాటి.. తొలి దశలో శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడప్పుడూ ఎరువు వేస్తూ ఉంటే చాలు. ఒకటి రెండు ఏళ్లలో దాదాపుగా 5 అడుగుల ఎత్తు పెరుగుతాయి. ఆ తర్వాత ఇక వాటి గురించి పట్టించుకోవాల్సిన అవసరం గాని, నీరు పెట్టాల్సిన అవసరం గానీ ఉండదు.

'పొలంలో', పరిసర ప్రాంతాల్లో వాన నీటి సంరక్షణ పనులు గ్రామస్తులం కలసి చేసుకున్నాం. భూగర్భ జలమట్టం బాగా పెరిగింది. ఇప్పుడు నీటికి కరువు లేదు. దానితో పాటు జీవ కంచె కూడా విజయవంతం కావటంతో రైతులకు మా పొలం దర్శనా స్థలంగా మారిపోయింది..' అంటున్నారు బగడే ఆనందంగా. తలవని తలంపుగా మరో ఉపయోగం కూడా చేకూరింది. జీవ కంచె పైకి కాకర, చిక్కుడు, సొర, బీర వంటి తీగజాతి కూరగాయ మొక్కల్ని పాకించి అదనపు ఆదాయం పొందే అవకాశం కూడా అందివచ్చింది!



● జీవకంచె పక్కన రైతు జగన్ ప్రహ్లాద్ భగడే



● జీవకంచెపై కూరగాయ తీగల్ని చూపుతున్న భగడే



● జీవకంచె గురించి రైతులకు వివరిస్తున్న భగడే

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



● బ్రెజిల్‌లో పత్తి తీస్తున్న యంత్రం



● పత్తి ఇలా తీస్తుంది

- బ్రెజిల్ శాస్త్రవేత్తల రూపుకల్పన
- 3.5 గంటల్లో హెక్టారులో పత్తి తీస్తుంది

చిన్న కమతాలకు అనువైన

పత్తి తీసే యంత్రం

పత్తి తీసే కూలి ఖర్చులను 70% వరకు తగ్గించే యంత్రాన్ని బ్రెజిల్ శాస్త్రవేత్తలు రూపొందించారు. చిన్న కమతాల్లో పత్తిని తీయడానికి అనువైనదిగా చెబుతున్న ఈ యంత్రం ఒంటి వరుసలో పత్తిని తీస్తూ ముందుకు వెళ్తుంది. ట్రాక్టర్ వెనుక ఈ యంత్రాన్ని జోడించి పత్తి తీయాల్సి ఉంటుంది. దీనితో 3.5 గంటల్లో రెండున్నర ఎకరాల (హెక్టారు) పొలంలో ఈ యంత్రం పత్తి తీయవచ్చు. 30 రోజుల్లో 120 హెక్టార్లలో పత్తి తీయవచ్చని చెబుతున్నారు. + కాటన్ సహకార ప్రాజెక్ట్‌లో భాగంగా ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.)తో కలిసి బ్రెజిల్ ప్రభుత్వం ఈ 'సింగిల్ రో కాటన్ పికర్' యంత్రానికి రూపకల్పన చేసింది.

+కాటన్ ప్రాజెక్ట్‌లో భాగస్వాములైన అర్జెంటీనా, బొలీవియా, కొలంబియా, ఈక్వెడార్, హైతీ, పరాగ్వే, పెరూ వంటి లాటిన్ అమెరికా దేశాల్లోని చిన్న, సన్నకారు రైతులకు ఈ యంత్రం ఉపకరిస్తుందని భావిస్తున్నారు. బ్రెజిల్ రైతుల సహకార సంస్థ ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో ఈ యంత్రం పనితీరును పరీక్షిస్తున్నారు.

బ్రెజిల్ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఎంబ్రాపా) పత్తి విభాగంలో పరిశోధకులైన ఒడిలోన్ రెనీ రిబీరో, వాల్డినీ సోఫియాట్టి సంయుక్తంగా దీన్ని అభివృద్ధి చేశారు. తొలి ప్రొటోటైప్ యంత్రంతో బ్రెజిల్‌లో 2019లో మొదటి సారి పత్తి తీసే పరీక్షలను ప్రారంభించినప్పుడు సంతృప్తికరమైన ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం పెరూ పత్తి పొలాల్లో దీని పనితీరును పరీక్షిస్తున్నారు.

బ్రెజిల్‌లోని ఈశాన్య ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా పత్తిని పండిస్తున్నారు. దీంతో కూలీల కొరత తీవ్రమైంది. సాధారణంగా పత్తి మొక్కల నుంచి కూలీలు తమ చేతులతో దూదిని తీస్తారు. 3-4 దఫాలుగా పత్తి తీస్తుంటారు.

అయితే, ఈ యంత్రంతో పత్తి తీత ఒకే సారి పూర్తవుతుంది. తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో పత్తి తీత పని పూర్తి చేయడానికి ఈ యంత్రం ఉపకరిస్తుందని భావిస్తున్నారు. రెండు వరుసల్లో ఏకకాలంలో పత్తి తీసే ఖరీదైన భారీ హార్వెస్టర్ల కన్నా.. ఈ ఒంటి వరుస యంత్రం చిన్న రైతులకు మరింత అందుబాటులో ఉండే అవకాశం ఉంది.



● తీసిన దూదిని నిల్వ చేసే బాక్స్



● దూదిని ఇలా డౌన్‌లోడ్ చేస్తుంది

సేంద్రియ సేద్యంపై ఎన్‌ఐపీహెచ్‌ఎంలో 3 నెలల కోర్సు

రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, మిత్రపురుగులను ఉపయోగించి సేంద్రియ సేద్యం చేసే పద్ధతులపై హైదరాబాద్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థ జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్.ఐ.పి.హెచ్.ఎం.) 3 నెలల ఆచరణాత్మక శిక్షణ ఇవ్వనుంది. భారతీయ వ్యవసాయ వ్యవస్థల పరిశోధనా సంస్థ, జాతీయ సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ సంస్థ, మేనేజ్‌తో కలిసి ఈ సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ఎన్.ఐ.పి.హెచ్.ఎం. తెలిపింది.

కనీసం ఇంటర్ పాసై లేదా టెన్త్+వ్యవసాయంలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన 18 ఏళ్లు పైబడిన స్త్రీ/పురుషులు అర్హులు. గ్రామీణ యువతకు ప్రాధాన్యం. 25 మందికి మాత్రమే ప్రవేశం. సేంద్రియ సాగులో అన్ని అంశాలతో పాటు సర్టిఫికేషన్ పొందటం, సేంద్రియ వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ నైపుణ్యాలను సైతం నేర్పిస్తారు. ఈ ఏడాది డిసెంబర్ 1న ప్రారంభమై వచ్చే ఏడాది మార్చి 10న కోర్సు ముగుస్తుంది.

మొదటి 21 రోజులు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎన్.ఐ.పి.హెచ్.ఎం. ఆవరణలో తరగతి గదిలో పాఠాలు చెబుతారు. తర్వాత 60 రోజులు అభ్యర్థులతో పొలంలో స్వయంగా సేంద్రియ పంటలు సాగు చేయిస్తారు. చివరి పది రోజులు సాగులో ఎదురైన సమస్యలపై శిక్షణ ఇస్తారు. ఎన్.ఐ.పి.హెచ్.లో ఉచిత వసతి కల్పిస్తారు. భోజన ఖర్చులు అభ్యర్థులే భరించాలి. ఫీజు రూ. 6,500 చెల్లించి, నవంబర్ 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు.. డా. ఇ.శ్రీలత – 90103 27879 sreelatha437@gmail.com డా. కె. దామోదరాచారి – 95426 38020 asomicroniphm2019@gmail.com

సేంద్రియ సేద్య డిప్లొమాలో ప్రవేశాలు నేడు

వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం జింగుర్తిలోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కళాశాలలో 2 ఏళ్ల సేంద్రియ వ్యవ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఈ నెల 11(మంగళవారం)న చివరి తేదీ. కనీస అర్హతలు: పదో తరగతి పాస్ లేదా ఇంటర్ ఫెయిల్. 15–22 ఏళ్ల మధ్య వయసు. పాలీసెట్–2022 పరీక్ష రాసిన/రాయని వారూ అర్హులే. ఏపీ అభ్యర్థులకు 15% సీట్లు కేటాయిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 11న ఒరిజినల్ సర్టిఫికెట్లతో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వెళ్లి స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. వివరాలకు... 95151 37015.

నవంబర్ 5న గోకృపామృతంపై సదస్సు

గో-ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి మూలాధారమైన గో-కృపామృతం ద్రావణం వాడే పద్ధతులు, ప్రయోజనాలపై నవంబర్ 5వ తేదీ (శనివారం)న గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉ. 10–సా.4 గం. వరకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. గో-కృపామృతాన్ని రూపొందించిన గోపాల్ భాయ్ సుతారియా స్వయంగా ఈ సదస్సులో ప్రసంగిస్తారు, రైతుల ప్రశ్నలకు సమాధానాలిస్తారు. గో-కృపామృతం మదర్‌కల్చర్ 1 లీటర్ బాటిల్‌ను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తారు. దీన్ని ఒకసారి తీసుకుంటే చాలు.. మళ్లీ మళ్లీ రైతులే (బెల్లం, దేశీ ఆవు మజ్జిగను కలుపుకొని) స్వయంగా తయారు చేసుకోవచ్చు. అందరూ ఆహ్వానితులే. ప్రవేశం ఉచితం. వివరాలకు.. 97053 83666.



గ్వాంగ్‌జు ఓపెన్ టోర్నీలో రన్నరప్ సాకేత్ జోడీ

ఈ ఏడాది ఏడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాలని ఆశించిన భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేనికి నిరాశ ఎదురైంది. కొరియాలో జరిగిన గ్వాంగ్‌జు ఓపెన్ టోర్నీలో సాకేత్–యూకీ బాంబ్రీ (భారత్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో సాకేత్–యూకీ జోడీ 6–2, 3–6, 6–10తో టాప్ సీడ్ బారియెంటోస్ (కొలంబియా)–రెయస్ వరేలా (మెక్సికో) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది. సాకేత్–యూకీ జోడీకి 1,800 డాలర్ల (రూ. లక్షా 48 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్'... హర్మన్‌ప్రీత్

భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికైంది. ఆమె గత నెలలో అద్భుతంగా రాణించింది. ఇంగ్లండ్ పర్యటనలో మూడు వన్డేల్లో 74 నాటౌట్, 143 పరుగులతో చెలరేగింది. ఆఖరి వన్డేలో 4 పరుగులు చేసినప్పటికీ భారత్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆమె అసాధారణ ఆటతీరుతో 23 ఏళ్ల (1999) తర్వాత ఇంగ్లండ్ గడ్డపై భారత్ అమ్మాయిలు సిరీస్ గెలిచారు.



37 పరుగులకే 'థాయ్'ని పడగొట్టేశారు

ఆరు ఓవర్లలోనే గెలిచిన టీమిండియా ● లీగ్ టాపర్‌గా భారత్

సిల్హెట్ (బంగ్లాదేశ్): మహిళల ఆసియా కప్ టి20 టోర్నీలో క్రికెట్ కూన థాయ్‌లాండ్‌ను భారత మహిళల జట్టు చిత్తుచిత్తుగా ఓడించింది. మొదట ప్రత్యర్థిని 37 పరుగులకే పడగొట్టిన భారత్ ఆ తర్వాత 'పవర్ ప్లే'లోనే లక్ష్యాన్ని ముగించింది. సోమవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళలు 9 వికెట్ల తేడాతో థాయ్‌లాండ్‌పై ఘనవిజయం సాధించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ విశ్రాంతి తీసుకోవడంతో ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. స్మృతి కెరీర్‌లో ఇది 100వ టి20 మ్యాచ్. హర్మన్‌ప్రీత్ (135 మ్యాచ్‌లు) తర్వాత 100 టి20 మ్యాచ్‌లు ఆడిన రెండో భారతీయ మహిళా క్రికెటర్‌గా స్మృతి నిలిచింది.
ముందుగా బ్యాటింగ్‌కు దిగిన థాయ్‌లాండ్ జట్టు 15.1 ఓవర్లలో 37 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ ననపత్ కొంచరొయెంకయ్ (12) టాప్‌స్కోరర్. మిగతా పది మంది బ్యాటర్లవి సింగిల్ డిజిట్లే! భారత బౌలర్లు సమష్టిగా దెబ్బకొట్టారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్నేహ్ రాణా (4–0–9–3) అద్భుతమైన స్పెల్‌తో రాణించగా... దీప్తి శర్మ, రాజేశ్వరి గైక్వాడ్ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత సులువైన లక్ష్యాన్ని భారత్ 6 ఓవర్లలోనే వికెట్ కోల్పోయి 40 పరుగులు చేసి ఛేదించింది. షఫాలీ వర్మ (8) తక్కువే చేసినా... ఆంధ్రప్రదేశ్ క్రికెటర్ సబ్బినేని మేఘన (18 బంతుల్లో 20 నాటౌట్; 3 ఫోర్లు), పూజ వస్త్రకర్ (12 బంతుల్లో 12 నాటౌట్; 2 ఫోర్లు) ముగించారు. ఇంకా ఇతర జట్ల లీగ్ దశ సమరం ముగియలేదు. దీంతో సెమీస్‌లో భారత్ ప్రత్యర్థి ఎవరో ఇంకా ఖరారు కాలేదు. ఏడు జట్లు తలపడుతున్న ఈ టోర్నీలో భారత్ 6 మ్యాచ్‌లాడి 5 గెలిచింది. ఒక్క మ్యాచ్‌లో ఓడిన భారత్ 10 పాయింట్లతో లీగ్ 'టాప్' ర్యాంకర్‌గా ఉంది.


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్నేహ్ రాణా

విజయంతో ముగించేందుకు...

- భారత్, దక్షిణాఫ్రికా సై
- నేడు చివరి వన్డే మ్యాచ్
- గెలిస్తే సిరీస్ సొంతం
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



న్యూఢిల్లీ: భారత గడ్డపై దక్షిణాఫ్రికా పర్యటన చివరి అంకానికి చేరింది. టి20 సిరీస్ కోల్పోయిన ఆ జట్టు ఇప్పుడు వన్డే సిరీస్‌ను చేజార్చుకోరాదని పట్టుదలగా ఉండగా... స్టార్లు లేకపోయినా సిరీస్ గెలవగల సత్తా తమలో ఉందని భారత బృందం నిరూపించే ప్రయత్నంలో ఉంది. ఈ నేపథ్యంలో ఫలితాన్ని తేల్చే చివరి పోరుకు రంగం సిద్ధమైంది. నేడు జరిగే మూడో వన్డేలో సఫారీ టీమ్‌తో టీమిండియా తలపడనుంది. రెండు మ్యాచ్‌లలో ఇరు జట్ల ప్రదర్శనను బట్టి చూస్తే మరో మ్యాచ్ కూడా హోరాహోరీగా సాగడం ఖాయంగా అనిపిస్తోంది. అయితే వాన కారణంగా పూర్తి స్థాయి మ్యాచ్ జరుగుతుందా లేదా అనే సందేహాలు ఉన్నాయి.

మార్పుల్లేకుండానే...

రెండో వన్డేలో భారత జట్టు ఆటను చూస్తే ఈ సిరీస్ ద్వారా జట్టుకు ఆశించిన ఫలితం దక్కినట్లే అనిపిస్తోంది. భారత్ కోణంలో యువ ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించడమే ఈ సిరీస్‌లో కీలకం కాగా అందరూ ఆశించిన స్థాయిలో రాణించారు. బ్యాటింగ్‌లో శ్రేయస్, సామ్సన్, ఇషాన్ కిషన్ సత్తా చాటగా, ఆల్‌రౌండర్‌గా శార్దుల్, బౌలింగ్‌లో కుల్దీప్ ఆకట్టుకున్నాడు. షహబాజ్ కూడా అరంగేట్రంలో చెప్పుకోదగ్గ ప్రదర్శనే కనబర్చాడు. పేసర్లలో సిరాజ్ పదునైన బౌలింగ్ హైలైట్‌గా నిలిచింది. తన తాజా ప్రదర్శనతో అతను టి20 వరల్డ్ కప్ జట్టులో బుమ్రా స్థానంలో చోటు దక్కించుకునే అవకాశాలు మెరుగుపర్చుకున్నాడు. మరోవైపు రెండు మ్యాచ్‌లలోనూ విఫలమైన శిఖర్ ధావన్, శుబ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌లో రాణించాల్సిన అవసరం ఉంది. వీరిద్దరు జట్టుకు శుభారంభం అందిస్తే తిరుగుండదు. ముఖ్యంగా వచ్చే వన్డే వరల్డ్‌కప్ వరకు ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్న శిఖర్ సొంతగడ్డపై గుర్తుండిపోయే ఇన్నింగ్స్ ఆడటం అవసరం. మొత్తంగా రెండో వన్డే విజయం అందించిన ఆత్మవిశ్వాసంతో భారత యువ జట్టు మరో గెలుపుపై దృష్టి పెట్టింది.

బవుమా రాణించేనా!

భారత్‌లో అడుగు పెట్టిన నాటినుంచి దక్షిణాఫ్రికాకు అతి పెద్ద సమస్య కెప్టెన్ బవుమా బ్యాటింగ్. నాలుగు మ్యాచ్‌లలో వరుసగా 0, 0, 3, 8 పరుగులు చేసిన బవుమా వరల్డ్‌కప్‌కు ముందు ఆఖరి పోరులోనైనా రాణించాలని జట్టు కోరుకుంటోంది. అనారోగ్యంతో గత మ్యాచ్‌కు దూరమైన అతను ఇక్కడ బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. డికాక్ శుభారంభం అందించాల్సి ఉండగా, ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చిన మార్క్‌రమ్ కూడా మరో కీలక ఇన్నింగ్స్‌పై గురి పెట్టాడు. బవుమా తిరిగొస్తే మలాన్‌ను తుది జట్టు నుంచి తప్పించడం ఖాయం కాబట్టి హెన్‌డ్రిక్స్‌పై అదనపు భారం ఉంది. టూర్ మొత్తం మంచి ప్రదర్శన ఇచ్చిన మిల్లర్ అదే జోరు కొనసాగిస్తే సఫారీ టీమ్ సిరీస్ గెలిచే అవకాశాలు పెరుగుతాయి. అయితే రబడ, నోర్జే తమ స్థాయిలో గొప్ప బౌలింగ్ చేయలేకపోతున్నారు. ఆల్‌రౌండర్‌గా పార్నెల్ కూడా తమ పాత్రకు న్యాయం చేయలేకపోయాడు. కేశవ్ మహరాజ్ ఆకట్టుకోవడంతో మరోసారి రెండో స్పిన్నర్ లేకుండానే జట్టు బరిలోకి దిగనుంది. ఇలాంటి స్థితిలో పర్యటనను దక్షిణాఫ్రికా గెలుపుతో ముగించగలదా చూడాలి.

భారత్‌లో అమ్మాయిల 'కిక్'స్టార్ట్ నేడే

- అమెరికాతో తొలి మ్యాచ్
- అండర్–17 ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ
- రాత్రి గం. 8 నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం



భువనేశ్వర్: 'ఫిఫా' అమ్మాయిల అండర్–17 ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు సర్వం సిద్ధమైంది. 16 జట్ల మధ్య ఈనెల 30 వరకు జరిగే ఈ టోర్నీని భువనేశ్వర్, గోవా, నవీ ముంబైలలో నిర్వహిస్తారు. గ్రూప్ 'ఎ' తొలి మ్యాచ్‌లో బ్రెజిల్‌తో మొరాకో తలపడనుండగా, మరో మ్యాచ్‌లో 2008 రన్నరప్ అమెరికాతో భారత్ ఎదుర్కోనుంది. ఈ వయో విభాగంలో జరుగుతున్న ఏడో ప్రపంచకప్‌లో భారత్ ఆడటం ఇదే మొదటిసారి. ఆతిథ్య హోదాతో బెర్త్ లభించగా మిగతా జట్లు ఆరు కాన్ఫెడరేషన్ల టోర్నీలతో అర్హత సాధించాయి. ఆసియా నుంచి భారత్‌తో పాటు చైనా, జపాన్... ఆఫ్రికా కాన్ఫెడరేషన్ నుంచి మొరాకో, నైజీరియా, టాంజానియా... సెంట్రల్, ఉత్తర అమెరికా, కరీబియన్‌ల నుంచి కెనడా, మెక్సికో, అమెరికా, దక్షిణ అమెరికా నుంచి బ్రెజిల్, చిలీ, కొలంబియా, ఓసియానియా నుంచి న్యూజిలాండ్, యూరోప్ నుంచి ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్‌లు ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి. గ్రూప్ 'ఎ'లో భారత్‌కు ప్రతీ మ్యాచ్ అగ్నిపరీక్షే! అమెరికా, బ్రెజిల్, మొరాకోలతో క్లిష్టమైన పోటీలే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గ్రూప్ దశ దాటడం అసాధ్యమే! అద్భుతాలకు ఏమాత్రం చోటులేదు. 'బి' గ్రూపులో జర్మనీ, నైజీరియా, చిలీ, న్యూజిలాండ్. 'సి'లో స్పెయిన్, కొలంబియా, మెక్సికో, చైనా.. 'డి'లో జపాన్, టాంజానియా, కెనడా, ఫ్రాన్స్ ఈ టోర్నీలో పోటీ పడనున్నాయి. ఈ నెల 30న ఫైనల్ జరుగుతుంది.

సూర్యకుమార్ 'ప్రాక్టీస్'



పెర్త్: ఆస్ట్రేలియా గడ్డపై పరిస్థితులకు అలవాటు పడేందుకు అన్ని జట్లకంటే ముందుగా అక్కడికి చేరుకున్న భారత్ తమ సన్నాహాలను సంతృప్తిగా మొదలు పెట్టింది. మూడు రోజుల సాధన అనంతరం సోమవారం మ్యాచ్ బరిలోకి దిగిన టీమిండియా తొలి పోరులో విజయం సాధించింది. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత్ 13 పరుగుల తేడాతో వెస్టర్న్ ఆస్ట్రేలియాను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అదే జోరును ఇక్కడా కొనసాగించాడు. ఇతర బ్యాటర్లలో హార్దిక్ పాండ్యా (27; 1 ఫోర్, 1 సిక్స్), దీపక్ హుడా (22; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించగా... రోహిత్ (3), ఓపెనర్‌గా ఆడిన పంత్ (9) విఫలమయ్యారు. అనంతరం వెస్టర్న్ ఆస్ట్రేలియా 8 వికెట్లకు 145 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ 6 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టగా... చహల్, భువనేశ్వర్ చెరో 2 వికెట్లు తీశారు.

తెలంగాణకు మరో పతకం

అహ్మదాబాద్: జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రానికి మరో పతకం లభించింది. సోమవారం జరిగిన కనోయింగ్ స్ప్రింట్ కే4 500 మీటర్ల రేసులో నివాస్ సింగ్, కునాల్, హర్ష కుమార్, మహేంద్ర సింగ్‌లతో కూడిన తెలంగాణ జట్టు కాంస్య పతకం సాధించింది. తెలంగాణ జట్టు 1ని:39.168 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానంలో నిలిచింది. ఈ జాతీయ క్రీడల్లో ఇప్పటి వరకు తెలంగాణ 8 స్వర్ణాలు, 7 రజతాలు, 8 కాంస్యాలు గెలిచి మొత్తం 23 పతకాలతో 14వ స్థానంలో ఉంది.

హరికృష్ణ జట్టుకు యూరోపియన్ చెస్ క్లబ్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ సభ్యుడిగా ఉన్న నోవీ బోర్ చెస్ క్లబ్ ప్రతిష్టాత్మక యూరోపియన్ చెస్ క్లబ్ (ఈసీసీ) టోర్నమెంట్‌లో టైటిల్ సాధించింది. ఆస్ట్రియాలో జరిగిన ఈ టోర్నీలో మొత్తం 70 క్లబ్ జట్లు పాల్గొన్నాయి. చెక్ రిపబ్లిక్‌కు చెందిన నోవీ బోర్ క్లబ్ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అజేయంగా నిలిచి 14 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. నోవీ బోర్ క్లబ్‌లో హరికృష్ణతోపాటు గ్రాండ్‌మాస్టర్లు విదిత్ సంతోష్ (భారత్), రాడోస్లా (పోలాండ్), డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్), ఎన్గుయెన్ థాయ్ డై వాన్ (చెక్ రిపబ్లిక్), నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్), డేవిడ్ గిజారో (స్పెయిన్), మార్కస్ రేజర్ (ఆస్ట్రియా) సభ్యులుగా ఉన్నారు. వ్యక్తిగత విభాగంలో హరికృష్ణకు రజత పతకం లభించింది. బోర్డు–1పై ఆడిన హరికృష్ణ మొత్తం ఏడు పాయింట్లకుగాను 4.5 పాయింట్లు స్కోరు చేశాడు. ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ ప్రాతినిధ్యం వహించిన ఆఫర్‌స్పిల్ చెస్ క్లబ్ (నార్వే) ఏడో స్థానంలో... భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ సభ్యులుగా ఉన్న సీఎస్‌యు ఏఎస్ఈ సూపర్‌బెట్ (రొమేనియా) క్లబ్ ఆరో స్థానంలో... తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ సభ్యుడిగా ఉన్న తాజ్‌ఫన్ లుబియానా (స్లొవేనియా) క్లబ్ ఎనిమిదో స్థానంలో నిలిచాయి.



దినేశ్‌కు మూడు కాంస్యాలు



సాక్షి, హైదరాబాద్: ఉగాండా పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన రామ్‌కో సిమెంట్స్ ఉద్యోగి దినేశ్ రాజయ్య రాణించి మూడు కాంస్య పతకాలు సాధించాడు. దినేశ్ ఎస్ఎల్–3 సింగిల్స్‌లో, ఎస్ఎల్3–ఎస్ఎల్4 డబుల్స్‌లో, ఎస్ఎల్3–ఎస్‌యు5 మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీ సందర్భంగా దినేశ్‌ను ఉగాండాలో భారత హైకమిషనర్‌గా ఉన్న ఎ.అజయ్ కుమార్ సన్మానించి అభినందించారు. మొత్తం 20 దేశాల నుంచి వివిధ కేటగిరీల్లో కలిపి 191 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొన్నారు. భారత్‌కు 12 స్వర్ణాలు, 14 రజతాలు, 16 కాంస్యాలతో కలిపి మొత్తం 42 పతకాలు లభించాయి.

సినిమా


● బెల్లంకొండ సురేష్, గణేష్,లక్ష్మణ్

గణేష్‌కు ఆ అదృష్టం దక్కింది

- నిర్మాత బెల్లంకొండ సురేష్

''నా చిన్న కుమారుడు బెల్లంకొండ గణేష్ హీరోగా పరిచయమైన 'స్వాతిముత్యం'తోనే ప్రేక్షకులు తనను నటుడిగా అంగీకరించడం నాకు హ్యాపీగా ఉంది. దర్శకుడు లక్ష్మణ్‌ను కూడా ప్రేక్షకులు అంగీకరించారు. తొలి సినిమాతోనే ప్రేక్షకాదరణ పొందాలంటే అదృష్టం ఉండాలి. అది 'స్వాతిముత్యం'తో గణేష్‌కు దక్కడం హ్యాపీ'' అన్నారు నిర్మాత బెల్లంకొండ సురేష్.
బెల్లంకొండ గణేష్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన చిత్రం 'స్వాతిముత్యం'. లక్ష్మణ్ కె. కృష్ణ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 5న రిలీజైంది. సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ– ''స్వాతిముత్యం' రిలీజైన తొలి రోజు, రెండో రోజు కలెక్షన్స్ చూసి భయపడ్డాం. కానీ మూడో రోజు నుంచి వసూళ్లు పెరుగుతున్నాయి. మరోవైపు చిరంజీవిగారి 'గాడ్ ఫాదర్' సినిమా ఉన్నా 'స్వాతిముత్యం'కూ ప్రేక్షకాదరణ లభించింది. 'గాడ్ ఫాదర్' ప్రీ రిలీజ్‌లో చిరంజీవిగారు 'స్వాతిముత్యం' సినిమాను కూడా ఆదరించాలని చెప్పారు. ఆయనకు ధన్యవాదాలు. గణేష్‌ను హీరోగా లాంచ్ చేసిన నాగవంశీ, చినబాబులకు రుణపడి ఉంటాను. ఓ నిర్మాతగా నేను కూడా ఇలాంటి లాంచింగ్‌ను గణేష్‌కు ఇచ్చి ఉండేవాడిని కాదేమో! ఇక బాలకృష్ణగారి 'చెన్నకేశవరెడ్డి' సినిమాను రీ రిలీజ్ చేయడం వల్ల వచ్చిన ఐదు కోట్ల నలభై లక్షల రూపాయలను బసవతారకం ట్రస్ట్‌కు విరాళంగా ఇవ్వనున్నాం. ఎన్టీఆర్‌గారి 'ఆది' సినిమాను కూడా రీ రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం. ఇక 'జగదేకవీరుని కథ' సినిమాను మళ్లీ తీయాలన్నది నాకున్న లక్ష్యాల్లో ఒకటి. ఎప్పటికైనా తీస్తా'' అన్నారు. ''తొలి సినిమాతోనే నటుడిగా నాకు ఇంత మంచి పేరు వస్తుందని ఊహించలేదు'' అన్నారు గణేష్. ''రిపీట్ ఆడియన్స్ ఉన్న చిత్రం 'స్వాతిముత్యం'. నన్ను నమ్మి, ప్రోత్సహించిన నాగవంశీ, చినబాబు, బెల్లంకొండ గణేష్‌గార్లకు ధన్యవాదాలు. దర్శకుడిగా నా రెండో సినిమా కూడా సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లోనే ఉంటుంది'' అన్నారు లక్ష్మణ్ కె. కృష్ణ.


● వరుణ్ తేజ్

యాక్షన్ బిగిన్

గన్‌ను ఫుల్‌గా లోడ్ చేసి రంగంలోకి దిగారు వరుణ్ తేజ్. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నాగబాబు సమర్పణలో ఎస్వీసీసీ పతాకంపై బాపినీడు, బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ సోమవారం లండన్‌లో ప్రారంభమైంది. హీరో వరుణ్ తేజ్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''షూటింగ్ మొదలైంది. ది గేమ్ ఆఫ్ లైఫ్ అండ్ డెత్ బిగిన్స్' అంటూ లొకేషన్ వీడియోను షేర్ చేశారు వరుణ్ తేజ్. కాగా ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇంటర్నేషనల్ గూఢచారి పాత్రలో కనిపిస్తారని టాక్.


● విష్ణు, సన్నీ లియోన్

జారు మిఠాయో...

మంచు విష్ణు, పాయల్ రాజ్‌పుత్, సన్నీ లియోన్ హీరో హీరోయిన్లుగా ఈషాన్ సూర్య దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జిన్నా'. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ సంస్థలు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'జారు మిఠాయో..' అనే పాట లిరికల్ వీడియోను సోమవారం విడుదల చేశారు. అనూప్ రూబెన్స్ స్వరపరచిన ఈ పాటకు ఎ. గణేష్ సాహిత్యం అందించగా సింహా, నిర్మలా రాథోడ్ పాడారు. ఈ పాటకు ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రాఫర్. నాగేశ్వరరెడ్డి మూల కథ అందించిన ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే–క్రియేటివ్ ప్రొడ్యూసర్: కోన వెంకట్, కెమెరా: ఛోటా కె. నాయుడు.


● సంపత్ నంది, మిర్నా, శర్వానంద్, ఆది, రాధామోహన్, ఫణి కృష్ణ సిరికి

క్రేజీ ఫెలో సక్సెస్ కావాలి

- శర్వానంద్

''హీరో ఆది సాయికుమార్‌ని నేను బ్రదర్‌లా భావిస్తాను. ఆదికి సక్సెస్ వస్తే నేనూ ఎంజాయ్ చేస్తాను. నిర్మాత రాధామోహన్‌గారు పదేళ్లుగా తెలుసు. నేను హీరోగా చేసిన 'రన్ రాజా రాన్' ఫ్లేవర్ 'క్రేజీ ఫెలో' సినిమాలో కనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అన్నారు శర్వానంద్. ఆది సాయికుమార్, మిర్నా మీనన్ జంటగా ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన చిత్రం 'క్రేజీ ఫెలో'. ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో హీరో శర్వానంద్, దర్శకులు మారుతి, సంపత్ నంది అతిథులుగా పాల్గొన్నారు. ''కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు మారుతి. ''రాధామోహన్‌గారితో తొలి సినిమా చేసే దర్శకులకు విజయం వస్తుంది. అలా ఫణి కృష్ణకు కూడా 'క్రేజీ ఫెలో'తో విజయం వస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు సంపత్ నంది. ''క్రేజీ ఫెలో' హిలేరియస్ ఎంటర్‌టైనర్. సినిమాలో మంచి ఎమోషన్ కూడా ఉంది'' అన్నారు ఆది. ''ఈ సినిమాలో ఆది సాయికుమార్ కొత్తగా కనిపిస్తారు. మేం అందరం క్రేజీగా పని చేశాం'' అన్నారు ఫణి కృష్ణ. ''ఈ కథకు ఆది బాగా సరిపోయాడు. దర్శకుడిగా ఫణి కృష్ణకు మంచి భవిష్యత్ ఉంది'' అన్నారు రాధామోహన్. ఈ కార్యక్రమంలో నటుడు అనీష్ కురువిల్లా, నటి వినోదినీ వైద్యనాథన్, లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్, యాక్షన్ కొరియోగ్రాఫర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీ అడుగుల వెంట...

'నీ అడుగుల వెంట, నే గురుతై ఉంటా.. నీ పాదమే దాటు ప్రతి చోటునా నీ పెదవులు తాకే నా పేరును వింటా..' అని ప్రేమ పాట పాడుకున్నారు అల్లు శిరీష్. రాకేష్ శశి దర్శకత్వంలో అల్లు శిరీష్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా జీఏ2 పిక్చర్స్ నిర్మించిన 'ఊర్వశివో రాక్షసివో' చిత్రంలోని పాట ఇది. అచ్చు రాజమణి స్వరపరచిన ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యం అందించగా సిద్ శ్రీరామ్ పాడారు. ''ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభించింది. సోమవారం రిలీజ్ చేసిన మొదటి పాట 'నీ అడుగుల వెంట..'లో అల్లు శిరీష్, అను ఇమ్మాన్యుయేల్ మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వుంది. నవంబర్ 4న రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ చిత్రానికి సహనిర్మాత: విజయ్ ఎం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు.


● అల్లు శిరీష్,అను

నిర్మాత మాగుంట సుధాకర్ రెడ్డి కన్నుమూత



ప్రముఖ సినీ నిర్మాత, పంపిణీదారుడు, థియేటర్స్ అధినేత మాగుంట సుధాకర్ రెడ్డి (73) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గత శుక్రవారం తుది శ్వాస విడిచారు. శనివారం అంత్యక్రియలు జరిగాయి. స్వర్గీయ మాగుంట రాఘవరెడ్డి, కౌసల్యమ్మ దంపతులకు 1949 సెప్టెంబరు 9న మాగుంట సుధాకర్ రెడ్డి జన్మించారు. ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎంపీ దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి సహోదరుడే సుధాకర్ రెడ్డి. ఆయనకు భార్య స్నేహలత, కుమారుడు కిరణ్ రెడ్డి, కుమార్తె దీప్తి ఉన్నారు. ఇక వ్యాపారంగంలోనే కాదు.. సినిమా పరిశ్రమలో కూడా సుధాకర్ రెడ్డి తనదైన ముద్రవేశారు. దివంగత ప్రముఖ నటులు–నిర్మాత కృష్ణంరాజు హీరోగా నటించిన 'అంతిమ తీర్పు, పృథ్వీరాజ్, ధర్మతేజ', చిరంజీవి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన 'ఖైదీ' సినిమాకు ఓ నిర్మాతగా ఉన్నారు సుధాకర్ రెడ్డి. అలాగే కన్నడ ప్రముఖ దివంగత నటులు అంబరీష్ నటించిన నాలుగు సినిమాలకు సుధాకర్ రెడ్డి నిర్మాత. ఇటు పంపిణీదారుడిగా, థియేటర్స్ సెక్టార్స్‌లో కూడా ఆయన ముద్ర ఉంది. చెన్నై, కోయంబత్తూర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో ఆయన పలు మల్టిప్లెక్స్‌లను నిర్మించడం జరిగింది. తెలుగు దిన పత్రిక ఉదయం అధినేత కూడా. ఇక సుధాకర్ రెడ్డి మరణం పట్ల నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కాట్రగడ్డ ప్రసాద్‌లతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పదరా వేటకు..


● విశ్వ, ఊర్వశి

విశ్వజిత్, అర్చనా సింగ్, ఊర్వశీ రాయ్, రఘుదీప్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'కౌశిక్ వర్మ దమయంతి'. వియాన్ జీ అంగారిక సమర్పణలో సుధీర్ దర్శకత్వంలో విశ్వజిత్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్‌లో విడుదల కానుంది. ఈ చిత్రంలోని హేమచంద్ర పాడిన 'పదరా పదరా వేటకు వెళ్దాం..' పాటను నిర్మాత సి. కల్యాణ్ విడుదల చేశారు. చిత్ర హీరో, నిర్మాత విశ్వజిత్ మాట్లాడుతూ– ''రెండొందల సంవత్సరాల క్రితం నాటి కథ, ప్రస్తుత కథతో తెరకెక్కించిన ఈ సినిమా ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు. ''ఇలాంటి మంచి హిస్టరికల్ సినిమాకు దర్శకుడిగా అవకాశం ఇచ్చిన హీరో, నిర్మాత విశ్వజిత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు సుధీర్.

హీరోయిన్‌గా భాగ్యశ్రీ కుమార్తె

'మైనే ప్యార్ కియా' (తెలుగులో 'ప్రేమ పావురాలు') అంటూ 30 ఏళ్ల క్రితం హిందీ తెరపై సల్మాన్ ఖాన్‌తో భాగ్యశ్రీ కురిపించిన ప్రేమను అప్పటి తరం అంత సులువుగా మరచిపోదు. ఈ మధ్యే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రీ–ఎంట్రీ ఇచ్చారామె. ఇప్పుడు భాగ్యశ్రీ కుమార్తె అవంతిక దాసాని హీరోయిన్‌గా తెలుగు పరిశ్రమకు ఎంట్రీ ఇస్తున్నారు. బెల్లంకొండ గణేష్ హీరోగా నటించిన 'నేను స్టూడెంట్ సార్!' ద్వారా అవంతిక పరిచయం కానున్నారు. రాఖీ ఉప్పలపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ 'నాంది' చిత్రనిర్మాత సతీష్ వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సతీష్ వర్మ మాట్లాడుతూ – ''ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీలో శ్రుతీ వాసుదేవన్ అనే కాలేజీ స్టూడెంట్‌గా నటించారు అవంతిక. సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: అనిత్ మధాడి.


● అవంతిక

సాక్షి బిజినెస్
మంగళవారం
11-10-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
200	74
57,991	17,241

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,527	▽	126
డోజోన్స్	29,148	▽	149
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,959	▽	32
డాక్స్	12,272	▽	1
షాంఘై	2,974	▽	50
నికాయ్	27,116	▽	195

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

కోయంబత్తూరులో భారతి సిమెంట్ టెర్మినల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సిమెంట్ తయారీ సంస్థ భారతీ సిమెంట్.. తమిళనాడులోని కోయంబత్తూరులో 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంతో అత్యాధునిక బల్క్ సిమెంట్ టెర్మినల్‌ను ఏర్పాటు చేసింది. కడప ప్లాంటు నుంచి ఈ కేంద్రానికి బల్క్ సిమెంట్ సరఫరా అవుతుంది. ఇక్కడ ప్యాకింగ్ చేసి సిమెంట్ పంపిణీ చేస్తారు. వికా గ్రూప్ చైర్మన్, సీఈవో గీ సీడో, వికా ఇండియా సీఈవో అనూప్ కుమార్ సక్సేనా, మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.రవీందర్ రెడ్డి ఈ టెర్మినల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళనాడు, కేరళ మార్కెట్ల కోసం క్విక్‌సెమ్ పేరుతో తదుపరి తరం పర్యావరణ అనుకూల ప్రీమియం సిమెంట్‌ను విడుదల చేశారు.

ఎన్‌సీఎల్‌టీకి జీవీకే కంపెనీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అనుబంధ కంపెనీ అయిన జీవీకే పవర్ (గోయింద్‌వాల్ సాహిబ్) లిమిటెడ్‌పై యాక్సిస్ బ్యాంక్ దాఖలు చేసిన దివాలా విచారణ పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ అంగీకరించిందని జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సోమవారం తెలిపింది. జీవీకే పవర్ (గోయింద్‌వాల్ సాహిబ్) లిమిటెడ్‌కు పంజాబ్‌లోని గోయింద్‌వాల్ సాహిబ్ వద్ద 540 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ ఉంది. 2016 ఏప్రిల్ 1న యూనిట్-1, ఏప్రిల్ 14న యూనిట్-2 ప్రారంభమైంది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	51,120
బంగారం (99.5 స్వచ్ఛత)	50,915
వెండి (కిలో)	58,949

మార్కెట్లో కొనసాగిన నష్టాలు

- అంతర్జాతీయంగా బేరిష్ ట్రెండ్
- మరోసారి రేట్ల పెంపు భయాలు
- ప్రధాన సూచీలకు అర శాతం నష్టం

ముంబై: ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో రోజు నష్టాలతో ముగిశాయి. ఉక్రెయిన్-రష్యా మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, మరో విడత యూఎస్ ఫెడ్ రేట్లను పెంచొచ్చన్న భయాలతో అంతర్జాతీయంగా బేరిష్ సంకేతాలు నెలకొన్నాయి. ఇవి మన మన మార్కెట్లపైనా ప్రభావం చూపించాయి. దీంతో ఇన్వెస్టర్లలో రిస్క్ ధోరణి తగ్గింది. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడికి డాలర్ మారకంతో రూపాయి మరో కొత్త కనిష్టానికి చేరడం కూడా ప్రభావం చూపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ సోమవారం ఇంట్రాడేలో గరిష్టం నుంచి 800 పాయింట్లు పడిపోయింది. చివరికి 200 పాయింట్ల నష్టానికి (0.34 శాతం) పరిమితమై 57,991 వద్ద క్లోజయింది.




అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 74 పాయింట్లు నష్టపోయి (0.43 శాతం) 17,241 వద్ద ముగిసింది.

- ఏషియన్ పెయింట్స్, టైటాన్, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, నెస్లే ఇండియా నష్టాలను ఎదుర్కొన్నాయి.
- యాక్సిస్, టీసీఎస్, మారుతీ, విప్రో, ఇ న్ఫీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ లాభపడ్డాయి.
- సెన్సెక్స్ 30 కంపెనీల్లో 19 నష్టాల్లో ముగియడం ప్రతికూల సెంటిమెంట్‌ను తెలియజేస్తోంది.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.87 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.58 శాతం చొప్పున నష్టపోయాయి.

అదానీ చేతికి జేపీ సిమెంట్ వ్యాపారం!

- రూ. 5,000 కోట్ల ఆఫర్
- తుది దశలో చర్చలు
- ఈ వారంలో ప్రకటనకు అవకాశం



న్యూఢిల్లీ: సిమెంట్ రంగంలో స్థానాన్ని మరింత పటిష్టపర్చుకునే దిశగా అదానీ గ్రూప్ దూకుడు పెంచుతోంది. రుణభారం పేరుకుపోయిన జేపీ గ్రూప్ సంస్థల సిమెంటు వ్యాపారాలను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టింది. వీటితో పాటు మరి కొన్ని చిన్న అసెట్ల కొనుగోలు కోసం రూ. 5,000 కోట్లు ఆఫర్ చేసినట్లు సమాచారం. జైప్రకాశ్ అసోసియేట్స్‌తో (జేఏఎల్) అదానీ గ్రూప్ జరుపుతున్న చర్చలు తుది దశలో ఉన్నాయని, ఈ వారంలోనే డీల్‌ను ప్రకటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అదానీ గ్రూప్ ఈ ఏడాది మే నెలలోనే అంబుజా సిమెంట్స్, ఏసీసీ లిమిటెడ్‌లను హోల్సిమ్ నుంచి కొనుగోలు చేసింది. తద్వారా రాత్రికి రాత్రే 67.5 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి (ఎంటీపీఏ) సామర్థ్యంతో దేశీయంగా రెండో అతి పెద్ద సిమెంటు తయారీ దిగ్గజంగా మారింది. కంపెనీ వచ్చే అయిదేళ్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 140 ఎంటీపీఏకి పెంచుకోవాలని యోచిస్తోంది. ఈ డీల్ పూర్తయితే అదానీ గ్రూప్‌నకు అదనంగా దాదాపు 10 ఎంటీపీఏ సామర్థ్యాలు లభిస్తాయి.

గట్టెక్కే యత్నాల్లో జేపీ గ్రూప్..

భారీ రుణభారం నుంచి బైటపడే యత్నాల్లో భాగంగానే జేపీ గ్రూప్ సంస్థలు తమ సిమెంటు వ్యాపారాన్ని, ఇతర ప్రధానయేతర వ్యాపారాలను విక్రయించే యోచనలో ఉన్నాయి. సోమవారమే రెండు గ్రూప్ సంస్థలు జైప్రకాశ్ అసోసియేట్స్ (జేఏఎల్), జైప్రకాశ్ పవర్ వెంచర్స్ (జేపీవీఎల్) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. జేఏఎల్‌పై దివాలా ప్రక్రియ కింద చర్యలకు ఎస్‌బీఐ సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రుణ భారాన్ని తగ్గించుకునేందుకు సిమెంటు వ్యాపారాన్ని విక్రయించాలని బోర్డు నిర్ణయించినట్లు జేఏఎల్ సోమవారం తెలిపింది. జేపీవీఎల్ కూడా మధ్యప్రదేశ్‌లోని నిగ్రీ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌తో పాటు ఇతర అసెట్లను విక్రయించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. జేపీ గ్రూప్ కంపెనీలైన జేపీ ఇన్‌ఫ్రాటెక్ (జేఐఎల్), ఆంధ్రా సిమెంట్ ఇప్పటికే దివాలా ప్రక్రియ కింద చర్యలు ఎదుర్కొంటున్నాయి.

షేర్లు రయ్..

సిమెంటు వ్యాపార విక్రయ వార్తలతో సోమవారం జేఏఎల్ షేరు సుమారు 10 శాతం పెరిగి రూ. 11.74 వద్ద క్లోజయ్యింది. అటు జేపీవీఎల్ షేరు దాదాపు 4 శాతం పెరిగి 8.46 వద్ద ముగిసింది.

టీసీఎస్ లాభం రూ. 10 వేల కోట్లు

- ఒక క్వార్టర్‌లో తొలిసారి నమోదు
- క్యూ2లో లాభం 8.4 శాతం అప్; రూ. 10,431 కోట్లు
- ఆదాయం 18 శాతం వృద్ధి; రూ. 55,309 కోట్లు
- రూ. 8 మధ్యంతర డివిడెండు

ముంబై: దేశీ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అంచనాలకు అనుగుణమైన లాభాలతో రెండో త్రైమాసికం ఆర్థిక ఫలితాల సీజన్‌కు బోణీ కొట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ2లో కంపెనీ లాభం 8.4 శాతం పెరిగి రూ. 10,431 కోట్లుగా నమోదైంది. టీసీఎస్ లాభాలు ఒక త్రైమాసికంలో రూ. 10వేల కోట్ల మైలురాయిని అధిగమించడం ఇదే ప్రథమం. ఇక సమీక్షా కాలంలో ఆదాయం 18 శాతం ఎగిసి రూ. 55,309 కోట్లకు చేరింది. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో రూ. 46,867 కోట్ల ఆదాయంపై రూ. 9,624 కోట్ల లాభం నమోదు చేసింది. సీక్వెన్షియల్‌గా చూస్తే లాభం 10 శాతం, ఆదాయం 5 శాతం పెరిగాయి. 'మా సర్వీసులకు డిమాండ్ పటిష్టంగా ఉంది. వివిధ విభాగాలు, మార్కెట్లలో లాభదాయకతపరంగా మెరుగైన వృద్ధి నమోదు చేశాం' అని సంస్థ సీఈవో రాజేశ్ గోపీనాథన్ తెలిపారు. అయితే, వ్యాపార పరిస్థితులు 'సవాళ్లతో' కూడుకుని ఉన్నాయని, మరింత 'అప్రమత్తంగా' వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా అనిశ్చితి రిస్కుల ప్రభావం కంపెనీపై పడకుండా సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేస్తామని స్పష్టం చేశారు. భౌగోళిక, రాజకీయపరమైన సవాళ్లపై ఆందోళనల కారణంగా క్లయింట్లు దీర్ఘకాలిక డీల్స్‌కు దూరంగా ఉంటున్నారని సీవోవో గణపతి సుబ్రమణియం చెప్పారు. ధరలపరంగా పరిస్థితి స్థిరంగానే ఉందని, రూపాయి క్షీణత కారణంగా ఒత్తిళ్లేమీ లేవని పేర్కొన్నారు.



సీఈవో రాజేశ్ గోపీనాథన్

మరిన్ని విశేషాలు..

- షేరు ఒక్కింటికి రూ. 8 చొప్పున టీసీఎస్ రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రికార్డు తేదీ అక్టోబర్ 18 కాగా, నవంబర్ 7న చెల్లిస్తుంది.
- క్యూ2లో నిర్వహణ మార్జిన్ 1.6% క్షీణించి 24%కి పరిమితమైంది. నాలుగో త్రైమాసికం నాటికి దీన్ని 25%కి పెంచుకోవాలని.. తర్వాత 26–28%కి చేరుకోవాలని సంస్థ నిర్దేశించుకుంది.
- విభాగాల వారీగా చూస్తే సమీక్షా కాలంలో రిటైల్, సీపీజీ (కన్జూమర్ ప్యాకేజ్డ్ గూడ్స్) 22.9%, కమ్యూనికేషన్స్.. మీడియా 18.7 శాతం, టెక్నాలజీ .. సర్వీసులు 15.9 శాతం, తయారీ 14.5 శాతం, బీఎఫ్ఎస్ఐ 13.1% మేర వృద్ధి నమోదు చేశాయి.
- కంపెనీ ఆర్డరు బుక్ విలువ సెప్టెంబర్ త్రైమాసికంలో 8.1 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో 400 మిలియన్ డాలర్ల ఒప్పందమే అతి పెద్దది.
- క్యూ2లో కొత్తగా 9,840 మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 6,16,171కి చేరింది. మహిళా సిబ్బంది వాటా 35.7 శాతంగా ఉంది. అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలసలు) జూన్ త్రైమాసికంలో 19.7 శాతంగా ఉండగా క్యూ2లో 21.5 శాతానికి చేరింది. అయితే, ఇది దాదాపు గరిష్ట స్థాయికి చేరినట్లేనని, ఇక్కడి నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టవచ్చని లక్కడ్ తెలిపారు.

మూన్‌లైటింగ్‌కు విరుద్ధమే అయినా..

ఇటీవల వివాదాస్పదంగా మారిన మూన్‌లైటింగ్ (రెండు చోట్ల ఉద్యోగాలు చేయడం) అనేది నైతికతకు సంబంధించిన అంశమని టీసీఎస్ చీఫ్ హెచ్‌ఆర్‌వో మిలింద్ లక్కడ్ చెప్పారు. ఇది తమ సంస్థ విలువలు, సంస్కృతికి విరుద్ధమే అయినప్పటికీ ఇప్పటి వరకూ ఇందుకు సంబంధించి ఉద్యోగులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొన్నారు. మరోవైపు, జాబ్ ఆఫర్లు అన్నింటినీ గౌరవిస్తున్నామని, ప్రథమార్ధంలో ఇప్పటికే 35,000 మంది ఫ్రెషర్స్‌ను తీసుకున్నామని చెప్పారు. మరో 12,000 మందిని తీసుకోబోతున్నామని.. తద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 40,000 పైచిలుకు ఫ్రెషర్స్ నియామక లక్ష్యాన్ని అధిగమించబోతున్నామని లక్కడ్ తెలిపారు.

టీసీఎస్ షేరు సోమవారం 2% పెరిగి 3,121 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వచ్చాయి.

బీఓఎం రుణ రేటు పెంపు...

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) నిధుల సమీకరణ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్) 20 బేసిస్ పాయింట్లు లేక 0.2 శాతం (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెరిగింది. ఆర్‌బీఐ రెపో రేటు పెంపు నేపథ్యంలో ఎస్‌బీఐసహా పలు బ్యాంకులు ఇప్పటికే తమ రుణ రేట్లను పెంచిన సంగతి తెలిసిందే. తమ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రకటన ప్రకారం బ్యాంక్ ఏడాది కాలపరిమితి ఎంసీఎల్‌ఆర్ 7.60 శాతం నుంచి 7.8 శాతానికి ఎగసింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-10-2022	
విశాఖ	430–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	430–00
విజయవాడ	430–00
రిటైల్ ధర (డజను)	66.00
10-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	412–00
వరంగల్	414–00
రిటైల్ ధర	4.70

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీలో 26 యునాని మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్(యునాని) పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **అర్హత:** యునానిలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760 వరకు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష (పేపర్-1, పేపర్-2), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.10.2022
» **ఫీజు చెల్లింపుకు చివరితేది:** 20.10.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.10.2022
» **రాతపరీక్ష తేది:** నవంబర్ 2022
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఏపీ హైకోర్టులో 76 కోర్టు మాస్టర్-పర్సనల్ సెక్రటరీ పోస్టులు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కోర్టు మాస్టర్ & పర్సనల్ సెక్రటరీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 76
» **అర్హత:** డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/కామర్స్), ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్, హయ్యర్ గ్రేడులో ఇంగ్లిష్ టైప్ రైటింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** రూ.57,100 నుంచి రూ.1,47,760 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌హ్యాండ్ ఇంగ్లిష్ టెస్ట్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్), ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, నేలపాడు, అమరావతి, గుంటూరు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.10.2022
» **వెబ్‌సైట్:** hc.ap.nic.in

సశస్త్ర సీమాబల్‌లో 399 కానిస్టేబుల్ పోస్టులు

న్యూఢిల్లీలోని డైరెక్టరేట్ జనరల్, సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ) 2022 సంవత్సరానికి సంబంధించి తాత్కాలిక ప్రాతిపదికన స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 399
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. నిర్దేశించిన క్రీడా ఈవెంట్లలో పాల్గొని ఉండాలి.
» **క్రీడలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాడీ బిల్డింగ్, బాక్సింగ్, సైక్లింగ్, ఈక్వెస్ట్రియన్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కరాటే, షూటింగ్, సెపక్ తక్రా, స్విమ్మింగ్, తైక్వాండో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు, వాటర్ స్పోర్ట్స్, యాచింగ్.
» **వయసు:** 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** క్రీడా విజయాలు, రాతపరీక్ష, ఫీల్డ్ ట్రయల్, స్కిల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. ఎంపికైన అభ్యర్థులు దేశంలో లేదా భారత భూభాగం వెలుపల సేవలు అందించాల్సి ఉంటుంది.
» **దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.ssbrectt.gov.in

ఎయిమ్స్, బీబీనగర్‌లో సీనియర్ రెసిడెంట్ పోస్టులు

బీబీనగర్ (తెలంగాణ రాష్ట్రం)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/ఎండీ/ఎంఎస్/డీఎం /ఎంసీహెచ్/డీఎన్‌బీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా
» **ఈమెయిల్:** sr.aiimsbibinagar@gmail.com
» **దరఖాస్తులకు చివరి తేది:** 25.10.2022
» **ఇంటర్వ్యూ వేదిక:** ఆడిటోరియం, రెండో ఫ్లోర్, ఎయిమ్స్ బిబీనగర్-508126.
» **ఇంటర్వ్యూ తేదీలు:**02.11.2022, 03.11.2022
» **వెబ్‌సైట్:** aiimsbibinagar.edu.in

గ్రూప్-1..గురి పెట్టండిలా!

బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారా.. ప్రభుత్వ కొలువు లక్ష్యంగా చేసుకున్నారా.. గ్రూప్-1 వంటి అత్యున్నత సర్వీసులు సొంతం చేసుకోవడమే లక్ష్యంగా సిద్ధమవుతున్నారా.!! అయితే.. మీ స్వప్నం సాకారం చేసుకునే సమయం ఆసన్నమైంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) తాజాగా గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసింది! దీని ద్వారా రాష్ట్ర స్థాయిలో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ వంటి ఉన్నత స్థాయి పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. పరీక్ష తేదీలను సైతం ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-1 నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం , విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

» 92 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీపీఎస్సీ
» మూడు దశలుగా ఎంపిక ప్రక్రియ
» డిసెంబర్ 18న తొలి దశ ప్రిలిమ్స్
» 2023 మార్చి రెండో వారంలో మెయిన్ ఎగ్జామ్
» అక్టోబర్ 13 నుంచి దరఖాస్తు ప్రక్రియ

ఏపీపీఎస్సీ తాజా నోటిఫికేషన్ ద్వారా గ్రూప్-1 స్థాయిలో.. డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ తదితర హోదాల్లో 92 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ప్రిలిమ్స్, మెయిన్ ఎగ్జామినేషన్ తేదీలను కూడా ప్రకటించడం ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పొచ్చు.

అర్హతలు

- ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- వయసు:జూలై1, 2022నాటికి 18–44ఏళ్ల మధ్య ఉండాలి. డీఎస్పీ(సివిల్) పోస్టులకు 21–30ఏళ్లు, డీఎస్పీ జైల్స్‌కు 18–30ఏళ్లు, డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు 21–28ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు ఉంటుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో జరుగనుంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష(స్క్రీనింగ్ టెస్ట్),మెయిన్ ఎగ్జామినేషన్,పర్సనల్ ఇంటర్వ్యూ.

తొలి దశ ప్రిలిమినరీ

గ్రూప్-1 పోస్టుల ఎంపిక ప్రక్రియలో ముందుగా ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులకు రెండో దశలో మెయిన్ పరీక్షను నిర్వహిస్తారు. ఒక్కో పోస్టుకు 50 మందిని చొప్పున (1:50 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు. ▪ తొలి దశలో నిర్వహించే ప్రిలిమినరీ రెండు పేపర్లలో 240 మార్కులకు ఉంటుంది. ▪ ప్రిలిమ్స్ పరీక్ష ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండు గంటలు.

▪ పేపర్ 1లో ఏ,బీ,సీ,డీ అనే నాలుగు భాగాలు ఉంటాయి. ప్రతి భాగానికి 30 మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులకు పేపర్1 ఉంటుంది. పార్ట్ ఏలో హిస్టరీ అండ్ కల్చర్; పార్ట్ బీలో రాజ్యాంగం , పాలిటీ, సోషల్ జస్టిస్, అంతర్జాతీయ సంబంధాలు; పార్ట్ సీలో భారత, ఆంధ్రప్రదేశ్ ఎకానమీ అండ్ ప్లానింగ్; పార్ట్ డీలో జాగ్రఫీ ఉంటుంది.

▪ అదేవిధంగా పేపర్ 2లో పార్ట్ ఏ 60 మార్కులకు, పార్ట్ బీ 60 మార్కులకు ఉంటాయి. పార్ట్-ఎలో పేర్కొన్న అంశాల నుంచి 60 ప్రశ్నలు, పార్ట్-బి-1 నుంచి 30 ప్రశ్నలు, పార్ట్-బి-2 నుంచి 30 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. పార్ట్ ఏలో జనరల్ మెంటల్ ఎబిలిటీ, అడ్మినిస్ట్రేటివ్ అండ్ సైకలాజికల్ ఎబిలిటీస్; పార్ట్ బీలో సైన్స్ అండ్ టెక్నాలజీస్, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

మెయిన్‌లో ఏడు పేపర్లు

- రెండో దశ మెయిన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఏడు పేపర్లలో నిర్వహిస్తారు.
- ఒక్కో పేపర్‌కు పరీక్ష సమయం 3 గంటలు.
- తెలుగు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్లను కేవలం అర్హత పేపర్లుగానే పరిగణిస్తారు. ఇందులో కనీస ఉత్తీర్ణత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఓసీ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. అప్పుడే మెయిన్‌లోని మిగతా అయిదు పేపర్ల మూల్యాంకన చేస్తారు.
- పేపర్-1లో జనరల్ ఎస్సే(ప్రాంతీయ,జాతీయ అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న సమకాలీన అంశాలు 150 మార్కులకు ఉంటుంది.
- పేపర్-2 ఏపీ, భారత చరిత్ర, సంస్కృతి భౌగోళిక శాస్త్రంపై 150 మార్కులకు ఉంటుంది.
- పేపర్-3 పాలిటీ, రాజ్యాంగం, పాలన, లా, ఎథిక్స్‌పై 150 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్-4 ఎకానమీ, భారత దేశ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి 150 మార్కులకు జరుగుతుంది.
- పేపర్-5లో సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ అంశాలు 150 మార్కులకు ఉంటాయి.
- ఇలా ఈ అయిదు పేపర్ల మొత్తం 750 మార్కులకు అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా తుది దశ ఇంటర్వ్యూ ఎంపిక చేస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్‌లో పొందిన మార్కులు ఆధారంగా.. రిజర్వేషన్లు ఇతర నిబంధనలను అనుసరించి 1:2 నిష్పత్తిలో చివరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయించారు. మెయిన్ ఎగ్జామినేషన్‌లో 750మార్కులు,పర్సనల్ ఇంటర్వ్యూ 75 మార్కులు మొత్తం 825మార్కులకుగాను అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా తుదివిజేతలను ఖరారు చేస్తారు.

సన్నద్ధతకు అడుగులు ఇలా

▪ ఆయా సిలబస్ అంశాలను చదివేటప్పుడు వాటిని సమకాలీన పరిణామాలతో సమన్వయం చేసుకుంటూ డిస్క్రిప్టివ్ విధానంలో ప్రిపరేషన్ సాగించాలి. అదేవిధంగా అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచే ఆయా అంశాలను విశ్లేషించుకుంటూ అభ్యసించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన, విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి.

- ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానా లు.. ఇలా అన్ని కోణాల్లో అవగాహన పెంచుకోవాలి.
- ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ముఖ్యంగా నవరత్నాలు, వాటికింద అమలు చేస్తున్న పథకాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటి వరకు లబ్ధి పొందిన వారి సంఖ్య తదితర వివరాల ఔపోసన పట్టాలి. దీంతోపాటు రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఆర్థిక విధానాలు, వాటి ద్వారా కలిగిన అభివృద్ధిపైనా దృష్టి సారించాలి.

చరిత్ర, జాగ్రఫీ..

- రాష్ట్ర చరిత్రకు సంబంధించి ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలి. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర గురించి అవగాహన పెంచుకోవాలి. అలాగే భారత దేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా పట్టు సాధించాలి.
- జాగ్రఫీకి సంబంధించి రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరులు గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. అదే విధంగా గతేడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు, వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

పాలిటీపై పట్టు కోసం

- రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాలు వరకూ తెలుసుకోవాలి.
- గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజా సేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలి. వీటితోపాటు స్ఫూర్తి దాయక నేతల వివరాలు, వారు పాలించిన తీరు తదితర అంశాలను సేకరించుకోవాలి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి.
- ప్రాథమిక హక్కులు,విధులు,కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు, వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా, సివిల్ అండ్ క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్ గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.



ఆర్థికం.. విస్తృత అధ్యయనం

ప్రిపరేషన్ ప్రారంభ దశలో ఎకానమీకి సంబంధించి మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ..గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటి ద్వారా లబ్ధి చేకూరే వర్గాలు, అదే విధంగా జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఇటీవల కాలంలో తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి.ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పెంచుకోవాలి.

ఎస్ అండ్ టీ

సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి దేశంలో, రాష్ట్రంలో అమలవుతున్న కొత్త ఐసీటీ విధానాలు, ప్రధాన సంస్థలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం

గ్రూప్-1 అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. విభజన తర్వాత ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలు వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు గురించి సమకాలీన అంశాలతో కూడిన సమాచారంతో సన్నద్ధత సాధించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** అక్టోబర్ 13–నవంబర్ 2
- **ప్రిలిమినరీ(స్క్రీనింగ్ టెస్ట్) పరీక్ష తేదీ:** డిసెంబర్ 18, 2022
- **మెయిన్ పరీక్ష తేదీ:** 2023 మార్చి ద్వితీయార్థంలో
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఏపీలో రైతు సంక్షేమ కార్యక్రమాల అమలు అద్భుతం

ఆస్ట్రేలియా వ్యవసాయ శాఖ మంత్రి మాక్ టైర్నన్

- ఏపీలో వ్యవసాయ పరిశోధనలకు మరింత ఊతమిస్తామని వెల్లడి
- ఆధునిక సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధమన్న మంత్రి
- మర్డోక్, వెస్టర్న్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలతో ఎంవోయూ కుదుర్చుకున్న ఎన్జీ రంగా వర్సిటీ



ఆస్ట్రేలియా మంత్రి అలన్నా మాక్ టైర్నన్‌తో భేటీ అయిన మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి : రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న కార్యక్రమాలను వింటుంటే నిజంగా ఆశ్చర్యమేస్తోందని.. ఇక్కడి పథకాలు అద్భుతంగా ఉన్నాయని ఆస్ట్రేలియా వ్యవసాయ శాఖ మంత్రి అలన్నా మాక్ టైర్నన్ పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తమ దేశం ఆసక్తిగా ఉందని చెప్పారు. ఆధునిక సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఏపీ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు చేసేందుకు ఊతమిచ్చేలా ఆస్ట్రేలియాలోని మర్డోక్, వెస్టర్న్ ఆస్ట్రేలియా వర్సిటీలతో ఎన్జీ రంగా వర్సిటీ సోమవారం ఎంవోయూ కుదుర్చుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆస్ట్రేలియా వ్యవసాయ శాఖ మంత్రి అలన్నా మాక్ టైర్నన్, పార్లమెంటరీ కార్యదర్శి సమంతారో సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ల్యాబ్ టూ ల్యాండ్ కాన్సెప్ట్ కింద ఆర్బీకేల ద్వారా పరిశోధనా ఫలితాలను నేరుగా రైతులకు అందిస్తున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలకు అభినందనలు తెలిపిన ఆస్ట్రేలియా మంత్రి తప్పకుండా ఏపీతో కలిసి పనిచేస్తామన్నారు. ఎన్జీ రంగా వర్సిటీ వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, మర్డోక్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆంద్రూ డీక్స్, డిప్యూటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పీటర్ డెవిస్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందంతో ప్రయోజనాలివే..

ఆస్ట్రేలియాలోని మర్డోక్, వెస్టర్న్ ఆస్ట్రేలియా వర్సిటీలతో అవగాహన ఒప్పందం వల్ల ఎన్జీ రంగా వర్సిటీ విద్యార్థులు అక్కడకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించడంతోపాటు అక్కడ పరిశోధనలు కూడా చేసుకోవచ్చు. అదేవిధంగా ఆ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ఇక్కడ మన వర్సిటీలో పరిశోధనలు చేసుకునే అవకాశం ఉంటుంది. వర్సిటీ అధ్యాపక బృందం అక్కడకు వెళ్లి శిక్షణ పొందడంతోపాటు పరిశోధనా ఫలాలను పరస్పరం అందిపుచ్చుకోవచ్చు.

ఆ కేసు విచారణకు స్వీకరిస్తేనే ఎన్‌ఓసీ అవసరం

పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి, అతని పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నప్పుడు, ఆ క్రిమినల్ కేసును సంబంధిత కోర్టు విచారణకు(కాగ్నిజెన్స్) స్వీకరించినప్పుడు మాత్రమే.. నిందితుడు విదేశాలకు వెళ్లాలంటే సంబంధిత కోర్టు నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకోవాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. కేసు సంబంధిత కోర్టులో పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన, ఆ కేసును పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుగా భావించడానికి వీల్లేదంది. సంబంధిత కోర్టు ఆ కేసును విచారణకు తీసుకోనంత వరకు విదేశీయానం విషయంలో ఆ కోర్టు నుంచి ఎన్‌ఓసీ అవసరం లేదంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఇటీవల తీర్పునిచ్చారు. పిటిషనర్ నుంచి స్వాధీనం చేసుకున్న పాస్‌పోర్ట్‌ను తిరిగి అతనికి ఇచ్చేయాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. కేసు విచారణకు హాజరయ్యే హామీతో రూ.2 లక్షలను విజయవాడ రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో డిపాజిట్ చేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లా, ఆలమూరు మండలానికి చెందిన డీవీ సూర్యనారాయణమూర్తిపై వరకట్న వేధింపుల కేసు నమోదైంది. ఖతార్‌లో ఉద్యోగం చేస్తున్న సూర్యనారాయణమూర్తి మన దేశానికి రాగానే విజయవాడ దిశా పోలీసులు అతని పాస్‌పోర్టును సీజ్ చేశారు. అంతేకాక అతని పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలంటూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధి కారికి లేఖ రాశారు. దీనిపై సూర్యనారాయణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

శివశంకర్, ఉమాశంకర్ పిటిషన్‌పై విచారణ ముగింపు

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని సవాల్ చేస్తూ శివశంకర్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారిలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. చార్జిషీట్ దాఖలు కాకముందే దస్తగిరి అప్రూవర్‌గా మారడానికి దర్యాప్తు సంస్థ ఎలా అనుమతిస్తుందని ప్రశ్నించారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఏ4గా ఉన్న దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని సహ నిందితులు ఎలా వ్యతిరేకిస్తారని ప్రశ్నించింది. ఫిర్యాదు చేసిన వారు అభ్యంతరం తెలపవచ్చు గానీ సహ నిందితులకు ఆ అధికారం లేదని పేర్కొంది. ట్రయల్ కోర్టు విచారణలో అభ్యంతరముంటే హైకోర్టు దృష్టికి తీసుకెళ్లొచ్చన్న ధర్మాసనం.. పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు పేర్కొంది.

ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించండి

వెస్టర్న్ ఆస్ట్రేలియా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ పెట్టేందుకు ఆస్ట్రేలియాలోని పెట్టుబడిదారులు ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియాలో ఉన్న మంత్రి సోమవారం రాత్రి వెస్టర్న్ ఆస్ట్రేలియా, అంతర్జాతీయ ట్రేడ్, పెట్టుబడుల సంస్థ అధ్యక్షులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు మైకేల్ కార్టర్ నేతృత్వంలో కామర్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. ఫుడ్ అండ్ ప్రాసెసింగ్ విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీ ప్రకటించిందన్నారు. పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొచ్చేవారికి అవసరమైన చేయూతనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తన విజ్ఞప్తిపై వెస్టర్న్ ఆస్ట్రేలియా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.

21న జీఎస్ఎల్‌వీ మార్క్–3 ప్రయోగం

సూళ్లూరుపేట : న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి 12.02 నిమిషాలకు తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జియో శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ మార్క్–3, ఎం–2) ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డం(యూకే)కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేషన్ లిమిటెడ్(వన్ వెబ్ కంపెనీ)తో ఇస్రో, న్యూ స్పేస్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సంస్థలు ఈ ప్రయోగాన్ని నిర్వహించేందుకు ఇటీవల ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భాగంగానే వన్ వెబ్ కంపెనీకి చెందిన 36 ఉపగ్రహాలను ఒకేసారి లోయర్ ఎర్త్ ఆర్బిట్ (లియో ఆర్బిట్) రోదసీలోకి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో ఉపగ్రహం బరువు 137 కిలోలు ఉంటుందని, 36 ఉపగ్రహాలు కలిపితే 4,932 కిలోల బరువుగా ఇస్రో పేర్కొంది. ఈ ఉపగ్రహాలు, వాటితోపాటు ఫ్యూయల్‌ను కలిపితే 5.21 టన్నుల బరువుగా నిర్ధారించింది. జీఎస్ఎల్‌వీ మార్క్–3 ఎం–2 లాంటి భారీ రాకెట్‌ను వాణిజ్యపరంగా వాడుకునేందుకు వన్ వెబ్ కంపెనీ మూడుసార్లు 36 చొప్పున 108 ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మరో రెండుసార్లు జీఎస్ఎల్‌వీ మార్క్–3 ప్రయోగాలను నిర్వహించేందుకు ఇస్రో ఇప్పటికే సిద్ధమైంది. వన్ వెబ్ కంపెనీ గ్లోబల్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌గా రూపాంతరం చెంది వాణిజ్యపరంగా ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు ఇస్రోతో కలిసి ఈ ప్రయోగం చేపడుతోంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.